# భారత్ శక్తి

VOICE OF INDIAN

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి : 20 | సంచిక : 303 | సోమవారం,మే 25 , 2026 | పేజీలు : 12 | వెల : 1.00


## ఇది జగన్ రెడ్డి వంకర బుద్ధికి నిదర్శనం: నారా లోకేష్



**అమరావతి(భారత శక్తి):** ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లను పూర్తిగా నిలిపివేసిందంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తీవ్రంగా ఖండించారు. ఈ ప్రచారం వందశాతం అవాస్తవమని, కిట్ల పంపిణీని ఆపే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని ఆయన స్పష్టం చేశారు. కేవలం కొన్ని అంతర్జాతీయ కారణాల వల్ల కిట్ల సరఫరాలో సుమారు నెల రోజుల జాప్యం జరుగుతోందని తెలిపారు. ప్రభుత్వం నిజాయతీగా జాప్యం గురించి వెల్లడిస్తే, దానిని వక్రీకరించి అసలు కిట్లే ఇవ్వరంటూ వైసీపీ పార్టీ విష ప్రచారం చేస్తోందని ఆయన ఆరోపించారు.

2లో..

### మోదీ పర్యటనలో

## భద్రతా లోపం

**- ఆరుగురు పోలీసుల సస్పెన్షన్**



**బెంగళూరు భారత శక్తి:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన సందర్భంగా బెంగళూరు శివార్లలో జిలెటిన్ స్టిక్స్ కనిపించడం ఇటీవల సంచలనమైంది. ప్రధాని పర్యటనలో భద్రతా లోపానికి సంబంధించి తాజాగా ఆరుగురు పోలీసులను సస్పెండ్ చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించారనే కారణంగా బెంగళూరు సౌత్ జిల్లా ఎస్పీ ఆర్.శ్రీనివాస గౌడ ఆదేశాలతో ఒక పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్, ఒక అసిస్టెంట్ పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్, నలుగురు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేసారు. శాఖాపరమైన విచారణకు ఆదేశించారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫౌండేషన్ 45వ వార్షికోత్సవం, ఆ సంస్థ వ్యవస్థాపకుడు శ్రీశ్రీ రవిశంకర్ 70వ పుట్టినరోజు కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈనెల 10న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని ప్రయాణించిన మార్గానికి సమీపంలో పలు పేలుడు పదార్థాలను పోలీసులు స్వాధీనం చేసుకోవడం సంచలనమైంది. రెండు జిలెటిన్ స్టిక్స్‌లు, ఆరు ఇన్‌సెన్స్ స్టిక్‌లు, ఒక అగ్గిపెట్టె, సెల్‌ఫోన్ టేపులు, బ్యాటరీ ప్యాక్, వైర్లు, ఒక సర్క్యూట్ బోర్డును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్రధాని పర్యటనకు సుమారు గంటన్నర ముందు ఈ పేలుడు పదార్థాలు కనిపించాయి. ఈ ఘటనపై పేలుడు పదార్థాల చట్టంలోని పలు సెక్షన్ల కింద బెంగళూరు సౌత్ జిల్లా కగ్గలిపుర పోలీసులు ఎఫ్ఐఆర్

2లో..

# సబ్ రిజిస్ట్రార్ల 'అవినీతి' మయాజాలం




## ల్యాండ్ మాఫియా గుప్పిట్లో హైదరాబాద్!

- నాలా కన్వర్షన్ లేకుండానే అగ్రి
- ల్యాండ్స్ రిజిస్ట్రేషన్.. చెరువు శిఖాలు, ప్రభుత్వ భూములు స్వాహా!
- హెచ్ఎండిఏ,జిహెచ్ఎంసి లేఔట్ అనుమతులు లేకుండానే అక్రమ పద్ధతిలో రిజిస్ట్రేషన్లు..!
- హౌస్ నంబర్లతో అక్రమ రిజిస్ట్రేషన్లు
- ప్రభుత్వ ఖజానాకు చేరవలసిన కోట్ల రూపాయల పన్ను సొంత జేబుల్లోకి మళ్లించుకుంటున్న ఎస్ ఆర్.ఓ.లు
- స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐ.జి,తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి సీఎం రేవంత్ రెడ్డి దృష్టి సారించాలి..

రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ కాసుల వర్షం కురిపిస్తుంటే, మన సబ్-రిజిస్ట్రార్లు మాత్రం అక్రమార్జనలో కొత్త రికార్డులు సృష్టిస్తున్నారు! 'నాలా' కన్వర్షన్ల ఊసే లేదు.. చెరువు శిఖాలు, ప్రభుత్వ భూములను ప్రైవేట్ వ్యక్తులకు 'ధారాదత్తం' చేయడంలో వీరి దాతృత్వమే వేరు. హెచ్ఎండిఏ, జీహెచ్ఎంసీ అనుమతులు లేకపోయినా, కనీసం ఖాళీ స్థలంలో ఇల్లు లేకపోయినా.. నకిలీ 'హౌస్ నంబర్ల' మంత్రంతో క్షణాల్లో రిజిస్ట్రేషన్లు కానిచ్చేస్తున్నారు. దళారులకు డిజిటల్ కీలు ఇచ్చి మరీ రాత్రి పూట నడిపించే ఈ 'చీకటి దందా'తో ప్రభుత్వ ఖజానాకు కోట్ల రూపాయల గండి పడుతోంది. ఏసీబీ, హైడ్రా కొరడా ఝుళిపిస్తున్నా ఈ అవినీతి తిమింగలాల 'సంతకాల సంత' సాగుతూనే ఉంది. రెవెన్యూ శాఖ, సీఎం రేవంత్ రెడ్డి ఈ ల్యాండ్ మాఫియా గుప్పిట చిక్కిన హైదరాబాద్‌ను కాపాడతారో లేదో చూడాలి!

**( హైదరాబాద్ మే 24 భారత శక్తి):** మహానగరం చుట్టుపక్కల రియల్ ఎస్టేట్ రంగం విపరీతంగా పుంజుకోవడంతో, స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖలో అవినీతి నెట్‌వర్క్ రూట్ లెవల్‌కు చేరింది. ముఖ్యంగా యాంటీ కరప్షన్ బ్యూరో (ACB), విజిలెన్స్ విచారణలు మరియు ఇటీవల హైడ్రా జరిపిన ఆపరేషన్లలో ,సబ్-రిజిస్ట్రార్లు అవలంబిస్తున్న అక్రమ పద్ధతులు, కొల్లగొట్టిన ప్రభుత్వ భూముల వివరాలు వెలుగులోకి వచ్చాయి. హైదరాబాద్ చుట్టుపక్కల 50 కిలోమీటర్ల పరిధిలోనే 60 శాతానికి పైగా అవినీతి కేసులు నమోదవుతుండటం గమనార్హం.

### నిషేధిత జాబితాకు తూట్లు.. వందల ఎకరాల ల్యాండ్ పూలింగ్

నిషేధిత జాబితా (సెక్షన్ 22-ఏ)లో ఉన్న ప్రభుత్వ భూములు, చెరువు శిఖం భూములు, మరియు దేవాదాయ/వక్ఫ్ భూములను సైతం సబ్-రిజిస్ట్రార్లు ప్రైవేట్ వ్యక్తుల పేరిట మార్చేశారు. ప్రధానంగా భూముల విలువలు కోట్లల్లో ఉన్న ప్రాంతాల్లోనే ఈ అక్రమాలు ఎక్కువగా జరిగాయి.

2లో..

### బలూచిస్థాన్‌లో

## రక్తపాతం

- పాక్ సైనికులు వెళుతున్న రైలుపై ఉగ్రదాడి..
- 24 మంది మృతి
- క్వెట్టాలో జరిగిన ఉగ్రదాడిలో 24 మంది మృతి
- మృతుల్లో సైనిక సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు
- కారు బాంబుతో దాడి చేసినట్లు వెల్లడి



పాకిస్థాన్‌లో ఘోర ఉగ్రదాడి జరిగింది. బలూచిస్థాన్ ప్రావిన్స్‌లో సైనిక సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు ప్రయాణిస్తున్న రైలును లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాదులు దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో కనీసం 24 మంది మరణించగా, 50 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో సైనికులు కూడా ఉన్నట్లు ఓ సీనియర్ అధికారి వెల్లడించారు. బలూచిస్థాన్ రాజధాని క్వెట్టాలో ఆదివారం ఈ దాడి జరిగింది. క్వెట్టా నుంచి పెషావర్‌కు వెళుతున్న ఈ రైలులో సైనికులు, వారి కుటుంబసభ్యులు ఉన్నారు. మంగళవారం నుంచి ప్రారంభం కానున్న బక్రీద్ పండుగ కోసం వీరంతా తమ స్వస్థలాలకు పయనమయ్యారు. రైలు క్వెట్టాలోని చమన్ పట్టక్ వద్ద సిగ్నల్ దాటుతున్న సమయంలో పేలుడు పదార్థాలతో నింపిన కారుతో ఒక బోగీని ఉగ్రవాదులు ఢీకొట్టారు. దీంతో

2లో..

# జీహెచ్ఎంసీలో 'పెన్షన్' బాగోతం

## చనిపోయిన మహిళ పేరిట రూ.80 లక్షల దోపిడీ!

- భారీ ముడుపులు తీసుకొని లైఫ్ సర్టిఫికెట్లు మంజూరు చేసిన ట్రాన్స్‌పోర్ట్ అధికారులు ఎవరు..!
- గతంలో ఈ విషయంపై విజిలెన్స్ కేసు సలీం మళ్లీ ఉద్యోగ కొనసాగింపు ఎలా..!
- ఎవరెవరు అమ్ముడు పోయారు.. ఎవరెవరు అవినీతికి పాల్పడ్డారు, అనే కోణంలో భారత శక్తి ఇన్వెస్టిగేషన్ రిపోర్ట్...

**హైదరాబాద్:** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (GHMC) చార్మినార్ జోన్ ఎంటమాలజీ మరియు రవాణా విభాగాల్లో పెను సంచలనం సృష్టించిన భారీ పెన్షన్ కుంభకోణం వెలుగుచూసింది. ఏళ్ల క్రితమే మరణించిన ఓ వృద్ధురాలు బ్రతికే ఉన్నట్లు నకిలీ 'లైఫ్ సర్టిఫికెట్లు' (జీవిత ధృవీకరణ పత్రాలు) సృష్టించి, దాదాపు 80 లక్షల రూపాయలకు పైగా ప్రభుత్వ ధనాన్ని కాజేసినట్లు తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై 'యాక్షన్ టేకెన్ రిపోర్ట్' (ATR) కోరిన సామాజిక

2లో..




### బెంగాల్‌లో ఫాల్తా రీపోలింగ్‌లో

## బీజేపీ ఘనవిజయం



పశ్చిమ బెంగాల్‌లోని ఫాల్తా అసెంబ్లీ నియోజకవర్గంలో జరిగిన రీపోలింగ్ ఓట్ల లెక్కింపులో బీజేపీ ఘన విజయం సాధించింది. ఆదివారం వెలువడిన ఫలితాల్లో బీజేపీ అభ్యర్థి దేబాంగ్షు పండా ఏకంగా 1,09,021 ఓట్ల భారీ ఆధిక్యంతో గెలుపొందారు. అధికార తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) అభ్యర్థి నాలుగో స్థానానికి పడిపోయి, డిపాజిట్ కోల్పోవడం గమనార్హం. ఓట్ల లెక్కింపులో దేబాంగ్షు పండాకు 1,49,666 ఓట్లు రాగా, సీపీఐ(ఎం) అభ్యర్థి శంభునాథ్ కుర్మీ 40,645 ఓట్లతో

2లో..

### ఉచిత విద్యుత్ రద్దుకే

## వ్యవసాయ మోటార్లకు మీటర్లు..

**- కాంగ్రెస్ సర్కారుపై కేటీఆర్ ఫైర్**

- వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించడం కుట్రేనన్న కేటీఆర్
- ఉచిత విద్యుత్ పథకాన్ని రద్దు చేయడానికే ఈ నిర్ణయమని ఆరోపణ
- మూడు నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా ప్రీపెయిడ్ మీటర్లు పెడతారని వ్యాఖ్య
- గతంలో కేసీఆర్ ఒప్పుకోని పనిని కాంగ్రెస్ చేస్తోందని విమర్శ

**( హైదరాబాద్ మే 24 భారత శక్తి)** తెలంగాణలో రైతులకు అందిస్తున్న ఉచిత విద్యుత్ పథకాన్ని రద్దు చేయాలనే ఏకైక ఉద్దేశంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగిస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రీపెయిడ్ మీటర్ల పేరుతో విద్యుత్ రంగాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు కుట్ర పన్నుతోందని ఆయన విమర్శించారు. ఆదివారం బీఆర్ఎస్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. శనివారం జరిగిన కేబినెట్ సమావేశంలో

2లో..



### ప్రొఫెసర్ నాగేశ్వర్‌పై

## కేసులు తక్షణమే ఎత్తివేయండి

### ఏపీ ప్రభుత్వానికి హరీశ్ రావు విజ్ఞప్తి

**( హైదరాబాద్ మే 24 భారత శక్తి)** జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, కూటమి ప్రభుత్వంపై ప్రముఖ రాజనీతి విశ్లేషకుడు ప్రొఫెసర్ కె. నాగేశ్వర్ చేసిన వ్యాఖ్యలు రెండు తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర రాజకీయ దుమారం రేపిన సంగతి తెలిసిందే. వైసీపీ అధినేత జగన్‌ను అరెస్ట్ చేయాలంటూ పవన్ కల్యాణ్ కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కోరినట్టు... జగన్ మనకు లాంగ్ టైమ్ ఫ్రెండ్, ఆయనతో స్నేహంగా ఉండాలని పవన్ కు అమిత్ షా చెప్పినట్టు ప్రొఫెసర్ నాగేశ్వర్ చేసిన కామెంట్స్‌ను జనసేన పార్టీ తీవ్రంగా తప్పుబట్టింది. ఆయన వైసీపీకి తొత్తుగా మారి అవాస్తవాలు మాట్లాడుతున్నారంటూ సోషల్ మీడియాలో జనసైనికులు పెద్ద ఎత్తున

2లో..




### ఇరాన్ అణ్వాయుధాలను

## కోరుకోవడం లేదు

- అణ్వాయుధాల కోసం తాము ప్రయత్నించడం లేదన్న ఇరాన్
- పశ్చిమాసియాలో అశాంతికి ఇజ్రాయెలే కారణమని ఆరోపణ
- ఇరాన్‌తో చర్చల్లో గణనీయమైన పురోగతి ఉందన్న అమెరికా
- హర్మూజ్ జలసంధిపై శుభవార్త రావచ్చని సంకేతాలు
- దేశ గౌరవంతో రాజీపడబోమని స్పష్టం చేసిన ఇరాన్ అధ్యక్షుడు

**ఇరాన్:** ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ ఆదివారం కీలక వ్యాఖ్యలు చేశారు. అణ్వాయుధాలను తాము కోరుకోవడం లేదని, ఈ విషయంలో ప్రపంచానికి హామీ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన స్పష్టం చేశారు. స్థానిక మీడియా కథనాల ప్రకారం, అమెరికాతో చర్చలు జరుగుతున్న నేపథ్యంలో ఆయన ఈ ప్రకటన చేయడం ప్రాధాన్యం ప్రాంతంలో సంతరించుకుంది. "ఈ

2లో..



## కర్ణాటకపై సీఎం విజయ్ చూపు..



**బెంగళూరు: భారత శక్తి** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ప్రభంజనం సృష్టించి అధికార పగ్గాలు చేపట్టిన నటుడు, తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ ఇప్పుడు పొరుగు రాష్ట్రాలపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. తన పార్టీ టీవీకే విస్తరణలో భాగంగా ఆయన కర్ణాటక రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చేందుకు వ్యూహాలు రచిస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా, త్వరలో జరగబోయే బెంగళూరు మున్సిపల్ కార్పొరేషన్ (BBMP) ఎన్నికల్లో పోటీ చేయడం ద్వారా కర్ణాటకలో పార్టీ జెండా పాతాలని విజయ్ గట్టి ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.ఐటీ హబ్ బెంగళూరు నగరంలో స్థానిక కన్నడిగులతో పాటు లక్షలాది మంది తమిళ ప్రజలు దశాబ్దాలుగా నివసిస్తున్నారు. అంతేకాకుండా, నటుడిగా విజయ్‌కు కర్ణాటక వ్యాప్తంగా, ముఖ్యంగా బెంగళూరులో భారీ సంఖ్యలో అభిమాన సంఘాలు, బలమైన ఫాలోయింగ్ ఉంది. ఇటీవల తమిళనాడు

2లో..

# సబ్ రిజిస్ట్రార్ల 'అవినీతి' మాయాజాలం








### మియాపూర్ - మఖ్తా మహబూబ్‌పేట్ (సర్వే నెం. 44):

పూర్తి సర్వే నెంబర్ ప్రభుత్వ భూమి అయినప్పటికీ, నకిలీ పత్రాలు సృష్టించి వాణిజ్య సముదాయాలకు రిజిస్ట్రేషన్లు చేశారు. ఇక్కడ మొత్తం '260 ఎకరాల, భూమి వివాదంలో ఉండగా, ఇటీవల హైడ్రా ?3,000 కోట్ల విలువైన 15 ఎకరాలను స్వాధీనం చేసుకుంది.

### కూకట్‌పల్లి - కొంపల్లి - కుత్బుల్లాపూర్:

వ్యవసాయేతర భూమిని వ్యవసాయ భూమిగా చూపించి రిజిస్ట్రేషన్ చేయడం, దేవాదాయ భూములను ప్రైవేట్ వ్యక్తులకు బదలాయించడం ద్వారా రాష్ట్ర ఖజానాకు 500 కోట్ల పైగా నష్టం చేకూర్చారు. సంగారెడ్డి (ఐలాపూర్ తండా): ఇక్కడ సుమారు 300 ఎకరాలకు పైగా, ప్రభుత్వ భూమిని నకిలీ డాక్యులతో పేద, మధ్యతరగతి ప్రజలకు ప్లాట్లుగా మార్చి విక్రయించారు. చంపాపేట్, ఎల్బీనగర్, అబ్దుల్లాపూర్మెట్ వనస్థలిపురంవనస్థలిపురం ఉ గండిపేట్, గండిపేట్ పరిధిలో అక్రమ లేఅవుట్లకు, వనస్థలిపురంలో... చుట్టుపక్కల ఉన్న పార్కు స్థలాలకు, ప్రభుత్వ లేఅవుట్ ఓపెన్ ప్లాట్లకు లంచాలు తీసుకుని రిజిస్ట్రేషన్లు పూర్తి చేశారు.

### నాలా నిబంధనలకు పాతర.. అండర్ వాల్యూయేషన్ దందా

వ్యవసాయ భూమిని వ్యవసాయేతర అవసరాలకు వాడుకోవాలంటే నాలా (Non-Agricultural Lands Assessment Act) ప్రకారం కన్వర్షన్ ఫీజు కట్టి అనుమతి పొందాలి. కానీ సబ్-రిజిస్ట్రార్లు, డాక్యుమెంట్ రైటర్లు, దళారులు కలిసి ఈ నిబంధనను యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారు. పెద్ద ఎకరాల విస్తీర్ణాన్ని వెంచర్లుగా మార్చినప్పుడు నాలా కన్వర్షన్ తప్పనిసరి అయినప్పటికీ, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లలో వాటిని వ్యవసాయ భూమి యొక్క చిన్న ముక్కలు లేదా "గుంటలు"గా చూపిస్తూ తక్కువ ముద్రణ సుంకం (స్టాంప్ డ్యూటీ)తో రిజిస్ట్రేషన్ పూర్తి చేస్తున్నారు. మరోవైపు ధరణి పోర్టల్‌లో ఉన్న సాంకేతిక లొసుగులను, గందరగోళాన్ని ఆసరాగా చేసుకుని, నిషేధిత జాబితాలో లేని విధంగా పాత రికార్డులను సృష్టించి మ్యుటేషన్లు జరుపుతున్నారు. రియల్ ఎస్టేట్ వెంచర్లలో మార్కెట్ విలువ కంటే చాలా తక్కువగా, వ్యవసాయ రేటు ప్రకారం విలువ కట్టి (అండర్ వాల్యుయేషన్) ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు.

### చంపాపేట్ ఎస్ఆర్ఓలో 'ఇంటి నెంబర్' మాయాజాలం

చంపాపేట్ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో ఇంటి నెంబర్ల ఆధారంగా జరిగిన అక్రమ రిజిస్ట్రేషన్ల వ్యవహారం హైదరాబాద్ విజిలెన్స్ వర్గాల్లో సంచలనం సృష్టించింది. ఖాళీ స్థలాలు, ప్రభుత్వ భూములు లేదా నాలా కన్వర్షన్ లేని లేఅవుట్లను రిజిస్ట్రేషన్ చేయకుండా చట్టం నిరోధిస్తుంది. ఈ నిబంధనను దాటవేయడానికి చంపాపేట్ కార్యాలయంలో "నకిలీ అసెస్‌మెంట్ నెంబర్ల సృష్టి" అనే వ్యూహాన్ని వాడారు.మున్సిపాలిటీ నుండి ఆస్తి పన్ను నెంబర్ (PTIN) ఉంటే ఆ నిర్మాణాన్ని చట్టబద్ధమైనదిగా భావిస్తారు. దీన్ని ఆసరాగా చేసుకుని, మున్సిపల్ రికార్డుల్లో లేని లేదా వేరే ఎవరిదో ఉన్న పాత ఇంటి నెంబర్లను దొంగతనంగా సృష్టించి బాండ్ పేపర్లపై రాశారు.

వాస్తవానికి అక్కడ కేవలం ఖాళీ స్థలం మాత్రమే ఉన్నప్పటికీ, డాక్యుమెంట్లలో "ఇంత చదరపు అడుగుల బిల్ట్-అప్ ఏరియాతో కూడిన ఇల్లు (RCC Roof Structure)" ఉందని తప్పుడు పత్రాలు సమర్పించారు.సబ్-రిజిస్ట్రార్లు కరెంట్ బిల్లు, వాటర్ బిల్లు లేదా లింక్ డాక్యుమెంట్లను కనీసం పరిశీలించకుండా, భారీగా ముడుపులు తీసుకుని రిజిస్ట్రేషన్లను ఆమోదించారు. చంపాపేట్, కర్మన్‌ఘాట్, సరూర్‌నగర్ చుట్టుపక్కల ఉన్న చెరువుల శిఖం (FTL) పరిధిలోని బఫర్ జోన్ భూములను సైతం నకిలీ హౌస్ నెంబర్లతో ప్లాట్లుగా మార్చి రిజిస్ట్రేషన్లు చేశారు. పాత గ్రామ పంచాయతీ అనుమతులు ఉన్నట్లు నకిలీ సర్టిఫికెట్లు సృష్టించడం, వాటికి కృత్రిమంగా ఇళ్ల నెంబర్లు కేటాయించి రిజిస్టర్ చేశారు. ఒకే సర్వే నెంబర్ మరియు హౌస్ నెంబర్‌పై వేర్వేరు వ్యక్తులకు రిజిస్ట్రేషన్లు (డబుల్ రిజిస్ట్రేషన్) చేసిన దాఖలాలు దొరికాయి.

### రాత్రి వేళల్లో దొంగ లాగిన్లు.. సెలవు రోజుల్లోనూ క్లియరెన్స్

విచారణలో సబ్-రిజిస్ట్రార్ల బయోమెట్రిక్ మరియు డిజిటల్ కీలను దళారులు ఉపయోగించి రాత్రి వేళల్లో లేదా సెలవు రోజుల్లో కూడా కొన్ని వివాదాస్పద ఫైళ్లను క్లియర్ చేసినట్లు ఐటీ ఆడిట్‌లో పక్కా ఆధారాలు దొరికాయి. ఇందుకు కార్యాలయంలోని కంప్యూటర్ ఆపరేటర్లు, సబ్-రిజిస్ట్రార్ల లాగిన్ ఐడీలను దుర్‌నియోగం చేశారు. ఖాళీ స్థలానికి ఓపెన్ ప్లాట్ రేటు ప్రకారం స్టాంప్ డ్యూటీ కట్టాల్సి ఉండగా, పాత బిల్డింగ్ అని చూపించడం ద్వారా మార్కెట్ విలువను తగ్గించి ప్రభుత్వ ఆదాయానికి కోట్ల రూపాయల నష్టం చేకూర్చారు.

### సస్పెన్షన్ల వేటు.. 200 డాక్యుమెంట్లు హోల్డ్!

చంపాపేట్ ఎస్ఆర్ఓలో జరిగిన ఈ హౌస్ నెంబర్ల స్కామ్‌పై విజిలెన్స్ నివేదికల ఆధారంగా ప్రభుత్వం సబ్-రిజిస్ట్రార్లపై సస్పెన్షన్ వేటు వేసింది.

కార్యాలయంలోని సీనియర్ అసిస్టెంట్లు, డాక్యుమెంట్ రైటర్లపై క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. అనుమానాస్పదంగా ఉన్న సుమారు 200 కంటే ఎక్కువ రిజిస్ట్రేషన్ పత్రాలను,అధికారులు హోల్డ్‌లో పెట్టారు మరియు వాటి మ్యుటేషన్లను నిలిపివేయాల్సిందిగా రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి. ప్రస్తుతం ఈ ప్రతీ అక్రమ డాక్యుమెంట్‌ను జీహెచ్‌ఎంసీ ఆస్తి పన్ను డేటాబేస్‌తో లంకె చేసి విచారణ జరుపుతున్నారు. మున్సిపల్ రికార్డుల్లో లేని హౌస్ నెంబర్లతో జరిగిన రిజిస్ట్రేషన్లను రద్దు చేసే ప్రక్రియ ప్రారంభమైంది. గత రెండు ఏళ్లలో సుమారు 15 మంది సబ్-రిజిస్ట్రార్లను ఏసీబీ అరెస్ట్ చేయగా, పలువురిని సస్పెండ్ చేశారు. నాలా కన్వర్షన్ లేని రిజిస్ట్రేషన్లపై విజిలెన్స్ విచారణలు వేగవంతం అయ్యాయి.

# జీహెచ్‌ఎంసీలో 'పెన్షన్' బాగోతం



GREATER HYDERABAD MUNICIPAL CORPORATION
Tank Bund, Hyderabad - 500 063.
IDENTITYCARD

Emp No. : 13115
Name : MOHD SALEEM
Desig : RECORD ASSISTANT
Section : TRANSPORT

commissioner GHMC

అవినీతికి పాల్పడిన నిందితుడు మహమ్మద్ సలీం..

కార్యకర్తలపై సంబంధిత ఉన్నతాధికారులు తీవ్ర దురుసుగా ప్రవర్తించడం నగరంలో కలకలం రేపుతోంది.

### అసలేం జరిగింది..? కుంభకోణం నేపథ్యం:

చార్మినార్ జోన్ జీహెచ్‌ఎంసీ ఎంటమాలజీ విభాగంలో గతంలో పనిచేసి మరణించిన ఉద్యోగి దివంగత మొహమ్మద్ సాబర్ భార్య అయిన 'దివంగత శ్రీమతి హాజీ బేగం, పేరు మీద ఫ్యామిలీ పెన్షన్ మంజూరవుతూ వచ్చింది. సాబీర్ మరణానంతరం వారి కుమారుడు లిమహమ్మద్ సలీం, (రికార్డ్ అసిస్టెంట్, GHMC ఎంప్లాయ్ ఐడీ: 11315) కారుణ్య నియామకం కింద జీహెచ్‌ఎంసీలోనే ప్రభుత్వ ఉద్యోగం పొందారు.

### పదేళ్లపాటు 'నకిలీ' లీలలు

హాజీ బేగం మరణించినప్పటికీ.. ఆమె బ్రతికే ఉన్నట్లుగా నకిలీ లైఫ్ సర్టిఫికెట్లను సృష్టించి, జీహెచ్‌ఎంసీ అధికారుల అండదండలతో లి01/01/2012 నుండి 23/09/2021 వరకులి సుదీర్ఘ కాలం పాటు పెన్షన్ డబ్బులు డ్రా చేశారు. రూ.80 లక్షల స్వాహా: ప్రాథమిక అంచనాల ప్రకారం.. ఈ పదేళ్ల కాలంలో తక్కువలో తక్కువ రూ.80 లక్షల ప్రజా సొమ్మును అవినీతి అక్రమాల ద్వారా కాజేసినట్లు తెలుస్తోంది. లిగతంలో సస్పెన్షన్: 'ఫోరమ్ ఫర్ యాంటీ కరప్షన్' ఫిర్యాదు (నెం: 13629752) ఆధారంగా 07-10-2021న కమిషనర్ ఉత్తర్వుల ప్రకారం సదరు ఉద్యోగి మహమ్మద్ సలీంను గతంలో సస్పెండ్ చేశారు.

### నిలదీస్తే దుర్భాషలు.. అధికారుల అహంకార వైఖరి

ఈ భారీ అవినీతి వ్యవహారంలో సస్పెన్షన్ తర్వాత తీసుకున్న పూర్తి స్థాయి చర్యల నివేదిక (ATR) మరియు సదరు నకిలీ సర్టిఫికెట్లను ధృవీకరించిన అధికారుల వివరాలను కోరుతూ 'ఫోరమ్ ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్' ప్రతినిధులు సమాచార హక్కు చట్టం (RTI) కింద దరఖాస్తు చేసుకున్నారు.అయితే, సమాచారం ఇచ్చి విచారణకు సహకరించాల్సిన జీహెచ్‌ఎంసీ హెడ్ ఆఫీస్‌కు చెందిన అధికారులు హరి రతన్ (ఏఎంసీ), శంకరయ్య, బాలాజీలు సమాచారం ఇవ్వకుండా బాధితులను, సామాజిక కార్యకర్తలను వేధిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

### అధికారుల నిర్లక్ష్యపు మాటలు ఇవే:

- **"నీకు చర్యల నివేదిక ఇవ్వాల్సిన అవసరం మాకు లేదు."**
- **"మేము రిపోర్ట్ ఇవ్వము, ఏం చేసుకుంటావో చేసుకో."**
- **"పై అధికారికి ఫార్వార్డ్ చేశాం, తర్వాత వాళ్లే చూసుకుంటారు."**

**ప్రధాన డిమాండ్:** ఆ ముగ్గురు అధికారులపై తక్షణ విచారణ జరగాలి!

ఈ కుంభకోణంలో నిధుల దుర్వినియోగంపై నివేదిక ఇవ్వకుండా, దౌర్జన్యానికి దిగుతున్న అధికారుల తీరుపై ఫోరమ్ ప్రతినిధులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా క్రింది అంశాన్ని వారు హైలైట్ చేస్తున్నారు:

**శాఖాపరమైన విచారణ:** సమాచారం ఇవ్వకుండా నిర్లక్ష్యంగా ప్రవర్తించి, సమాచార హక్కు చట్టాన్ని కాలరాస్తూ, దౌర్జన్యానికి దిగిన లిఅడిషనల్ కమిషనర్ అడ్మిన్ శంకరయ్య, హరి రతన్ (ఏఎంసీ), బాలాజీలపై, తక్షణమే శాఖాపరమైన విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలి.

**క్రిమినల్ కేసులు:** ప్రభుత్వ పెన్షన్ నిధులను దారి మళ్లించిన బాధ్యులందరిపై, వారికి సహకరించిన తిమింగలాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి.


**రికవరీ:** స్వాహా చేసిన రూ.80 లక్షల ప్రభుత్వ సొమ్మును వడ్డీతో సహా రికవరీ చేయాలి. ఉన్నతాధికారులు, ప్రభుత్వం స్పందించాలి!

జీహెచ్‌ఎంసీ కార్యాలయం ప్రజా సేవకు కాకుండా, అవినీతి తిమింగలాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిందని సామాజిక కార్యకర్తలు మండిపడుతున్నారు. కమిషనర్ ఆర్.వి.కర్ణన్ గారూ.. మీ కళ్లెదుటే సాగుతున్న ఈ 'పెన్షన్' దోపిడీపై ఏసీబీ (ఘాజదీ), విజిలెన్స్ విభాగాలు ఎప్పుడు కదులుతాయి? మున్సిపల్ శాఖ మంత్రి, సీఎం ఎ. రేవంత్ రెడ్డి, మరియు మున్సిపల్ శాఖ సెక్రెటరీ జయేష్ రంజన్ గారు తక్షణమే ఈ వ్యవహారంపై దృష్టి సారించి, లంచగొండుల దౌర్జన్యానికి చరమగీతం పాడాలని, వ్యవస్థలో పారదర్శకత పెంచాలని 'ఫోరమ్ ఫర్ యాంటీ కరప్షన్' మరియు పౌర సమాజం డిమాండ్ చేస్తోంది.



అవినీతిని ప్రోత్సహిస్తున్న,జిహెచ్ఎంసి అడిషనల్ కమిషనర్ అడ్మిన్ శంకరయ్య..

# పనస వ్యర్థాలతో అల్ట్రాకెపాసిటర్లు



పనసపండులో మనం తినేది పిసరంతైతే.. వృథాగా పారబోసేది బోలెడంత. అయితే ఆస్ట్రేలియా యూనివర్శిటీ శాస్త్రవేత్తలు ఈ వ్యర్థానికి కొత్త అర్థం చెప్పారు. పనసతోపాటు దీని తోబుట్టువుగా భావించే డ్యూరియన్ పండు వ్యర్థాలను విద్యుత్తును నిల్వ చేసుకోగల అల్ట్రా కెపాసిటర్లుగా మార్చవచ్చునని వీరు ప్రయోగాత్మకంగా నిరూపించారు. అల్ట్రా కెపాసిటర్లకు, బ్యాటరీలకు కొంచెం తేడా ఉంటుంది. రెండింటిలోనూ విద్యుత్తును నిల్వ చేసుకోవచ్చుగానీ.. అల్ట్రా కెపాసిటర్లలో విద్యుత్తు విడుదల చాలా వేగంగా జరిగిపోతుంది. అంతే వేగంగా ఛార్జ్ కూడా అవుతుంది. వీటితో కొన్ని సెకన్లలోనే మన ఎలక్ట్రానిక్ పరికరాలను ఛార్జ్ చేసుకోవచ్చు. పనస, డ్యూరియన్ పండ్ల వ్యర్థాలను తాము ముందుగా కార్బన్ ఏరోజెల్‌గా మార్చామని, ఈ ఏరోజెల్ సాయంతో ఎలక్ట్రోడ్‌లను నిర్మించి పరీక్షించినప్పుడు ఆశ్చర్యకరమైన ఫలితాలు లభించాయని ఈ పరిశోధనల్లో పాల్గొన్న శాస్త్రవేత్త విన్సెంట్ జేమ్స్ తెలిపారు.ఇప్పటికే మార్కెట్‌లో అందుబాటులో ఉన్న అల్ట్రా కెపాసిటర్ల కంటే పనస, డ్యూరియన్ పండు వ్యర్థాలతో చేసిన అల్ట్రా కెపాసిటర్ల సామర్థ్యం చాలా ఎక్కువగా ఉన్నట్లు పరీక్షల్లో తేలిందని చెప్పారు. ఈ కొత్త అల్ట్రా కెపాసిటర్లను చాలా చౌకగా తయారు చేసుకోవచ్చు కాబట్టి.. ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్లెట్ల వంటి ఎలక్ట్రానిక్ పరికరాలను చౌకగా రీఛార్జ్ చేసుకునేందుకు ఇవి బాగా ఉపయోగపడతాయని విన్సెంట్ గోమ్స్ వివరించారు. భూతాపోన్నతి నేపథ్యంలో వాతావరణ మార్పులను అడ్డుకునేందుకు సంప్రదాయేతర ఇంధన వనరులను మరింత సమర్థంగా ఉపయోగించుకునేందుకు ఈ కొత్త అల్ట్రా కెపాసిటర్లు ఎంతో ఉపయోగపడతాయని విన్సెంట్ గోమ్స్ చెప్పారు.

## మోదీ పర్యటనలో భద్రతా లోపం

నమోదు చేశారు. పేలుడు పదార్థాలు ఎక్కడి నుంచి వచ్చాయనే దానిపై ఇంతవరకూ పోలీసులు ఎలాంటి అరెస్టులు చేయలేదు. దర్యాప్తునకు సహకరించేందుకు ఢిల్లీ నుంచి ఎన్ఐఏ టీమ్‌ను కూడా రప్పించారు.

## బలూచిస్థాన్‌లో రక్తపాతం

భారీ పేలుడు సంభవించిందని అధికారులు తెలిపారు. ఈ పేలుడు తీవ్రతకు రైలు బోగీ నుజ్జునుజ్జయి పక్కకు ఒరిగిపోయింది. పలు కోచ్‌లు పట్టాలు తప్పాయి. ఘటనా స్థలంలో సహాయక చర్యలు చేపట్టారు. రక్తంతో తడిసిన బాధితులను స్ట్రెచర్లపై తరలిస్తున్న దృశ్యాలు హృదయవిదారకంగా ఉన్నాయి. భద్రతా దళాలు ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకుని దర్యాప్తు ప్రారంభించాయి.విస్తీర్ణంలో పాకిస్థాన్‌లోనే అతిపెద్ద ప్రావిన్స్ అయినప్పటికీ, బలూచిస్థాన్ అభివృద్ధిలో చాలా వెనుకబడి ఉంది. ఈ ప్రావిన్స్‌లోని సహజ వనరులను కేంద్ర ప్రభుత్వం దోచుకుంటోందని, స్థానిక ప్రజలకు ప్రయోజనాలు కల్పించడం లేదని బలూచ్ వేర్పాటువాద గ్రూపులు చాలాకాలంగా ఆరోపిస్తున్నాయి.

## ఉచిత విద్యుత్ రద్దుకే వ్యవసాయ మోటార్లకు మీటర్లు..

వ్యవసాయ కనెక్షన్లతో పాటు అన్ని గృహ కనెక్షన్లకూ ప్రీపెయిడ్ మీటర్లు బిగించాలని నిర్ణయం తీసుకున్నారని కేటీఆర్ ఆరోపించారు. రాబోయే మూడు నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా ఇళ్లలోని పాత మీటర్లను తొలగించి, వాటి స్థానంలో ఈ కొత్త ప్రీపెయిడ్ మీటర్లు ఏర్పాటు చేయాలని చూస్తున్నారని తెలిపారు. గతంలో ప్రధాని మోదీ ఎంత ఒత్తిడి తెచ్చినా, రూ. 30,000 కోట్ల రుణం నిలిపివేసినా నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ మీటర్లు పెట్టడానికి అంగీకరించలేదని కేటీఆర్ గుర్తుచేశారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం మూడు నెలల్లోనే మీటర్లు బిగించాలని నిర్ణయించిందని మండిపడ్డారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందే కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఉచిత విద్యుత్ రద్దు అవుతుందని, మోటార్లకు మీటర్లు వస్తాయని తాము హెచ్చరించిన విషయం ఇప్పుడు నిజమవుతోందని అన్నారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించకముందే, ఇళ్లకు ప్రీపెయిడ్ మీటర్లు రాకముందే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించాలని ప్రజలకు కేటీఆర్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ అవినీతి, అరాచకాలతో పాలన సాగిస్తోందని, ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని, అవకాశం వచ్చినప్పుడు కచ్చితంగా బుద్ధి చెబుతారని ఆయన వ్యాఖ్యానించారు.

## బెంగాల్‌లో ఫాల్తా రీపోలింగ్‌లో బీజేపీ ఘనవిజయం

రెండో స్థానంలో నిలిచారు. కాంగ్రెస్ అభ్యర్థి అబ్దుర్ రజాక్‌కు 10,084 ఓట్లు, తృణమూల్ కాంగ్రెస్ అభ్యర్థి జహంగీర్ ఖాన్‌కు కేవలం 7,783 ఓట్లు మాత్రమే వచ్చాయి. ఫాల్తా ఫలితాలు రెండు విధాలుగా చారిత్రాత్మకమైనవి. 1988లో తృణమూల్ కాంగ్రెస్ పార్టీ స్థాపించిన తర్వాత ఒక ఎన్నికలో ఆ పార్టీ అభ్యర్థి నాలుగో స్థానానికి పరిమితం కావడం ఇదే తొలిసారి. అలాగే, 2011లో అధికారంలోకి వచ్చిన తర్వాత టీఎంసీ అభ్యర్థి డిపాజిట్ కోల్పోవడం కూడా ఇదే మొదటిసారి.ఏప్రిల్ 29న జరిగిన అసలు పోలింగ్‌లో ఫాల్తా నియోజకవర్గంలో తీవ్ర అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. బీజేపీ అభ్యర్థికి సంబంధించిన ఈవీఎం బటన్‌పై టేపులు వేయడం, వందలాది మంది ఓటర్లను ఓటు వేయకుండా అడ్డుకోవడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. దీనిపై ప్రత్యేక ఎన్నికల పరిశీలకుడు సుబ్రతా గుప్తా విచారణ జరిపి నివేదిక సమర్పించారు. ఆ నివేదిక ఆధారంగా కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) మే 21న ఫాల్తా నియోజకవర్గం మొత్తం రీపోలింగ్‌కు ఆదేశించింది.ఈ విజయంతో పశ్చిమ బెంగాల్ అసెంబ్లీలో బీజేపీ సభ్యుల సంఖ్య 208కి చేరింది. తృణమూల్ బలం 80గా ఉంది

## ప్రొఫెసర్ నాగేశ్వర్‌పై కేసులు తక్షణమే ఎత్తివేయండి

విమర్శలు గుప్పించడమే కాకుండా, ఏపీలోని పలు పోలీస్ స్టేషన్లలో ఆయనపై ఫిర్యాదులు చేయడంతో కేసులు కూడా నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో, తీవ్ర ఒత్తిడి ఎదుర్కొన్న ప్రొఫెసర్ నాగేశ్వర్, తాను చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్లు బేషరతుగా ప్రకటించారు. అయినప్పటికీ ఆయనపై నమోదైన కేసులను ఏపీ పోలీసులు ఇంకా కొనసాగిస్తుండడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై తాజాగా తెలంగాణ మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు స్పందించారు. ఎక్స్ వేదికగా ఆయన ఏపీ ప్రభుత్వ తీరును తప్పుబడుతూ ఒక పోస్ట్ చేశారు.ప్రొఫెసర్ నాగేశ్వర్ తన వ్యాఖ్యలను బేషరతుగా ఉపసంహరించుకున్నట్లు ప్రకటించిన తర్వాత కూడా, కక్షపూరిత ధోరణితో ఆయనపై కేసులు నమోదు చేసి వేధించడం ఎంతమాత్రం సరికాదని హరీశ్ రావు హితవు పలికారు. భావప్రకటనా స్వేచ్ఛను గౌరవించాలని, ప్రొఫెసర్‌పై పెట్టిన అన్ని కేసులను ఏపీ ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. హరీశ్ రావు చేసిన ఈ ట్వీట్‌పై ఏపీ ప్రభుత్వం, జనసేన శ్రేణులు ఎలా స్పందిస్తాయో వేచి చూడాలి.

## ఇరాన్ అణ్వాయుధాలను కోరుకోవడం లేదు

అశాంతిని కోరుకుంటున్నది తాము కాదు. జియోనిస్ట్ ప్రభుత్వం (ఇజ్రాయెల్) మాత్రమే యుద్ధాన్ని, అశాంతిని సజీవంగా ఉంచడానికి ప్రయత్నిస్తోంది" అని పెజెష్కియాన్ ఆరోపించారు. 'గ్రేటర్ ఇజ్రాయెల్' ప్రణాళికను ఇజ్రాయెల్ అనుసరిస్తోందని విమర్శించారు. దేశ గౌరవంతో చర్చల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడబోమని ఆయన తేల్చిచెప్పారు. ఇరాన్‌లో ఏ నిర్ణయమైనా సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ (ఎస్ఎన్ఎస్ సీ) పరిధిలోనే, సుప్రీం లీడర్ అనుమతితోనే జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. మరోవైపు, అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో ఆదివారం న్యూఢిల్లీలో మాట్లాడుతూ, ఇరాన్‌తో దౌత్యపరమైన చర్చల్లో గణనీయమైన పురోగతి సాధించామని తెలిపారు. రాబోయే గంటల్లో హర్మూజ్ జలసంధికి సంబంధించి 'శుభవార్త' వెలువడవచ్చని ఆయన సూచించారు. ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధాన్ని కలిగి ఉండకూడదన్న అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వైఖరిని రూబియో మరోసారి పునరుద్ఘాటించారు.

## కర్ణాటకపై సీఎం విజయ్ చూపు..

ఎన్నికల్లో టీవీకే సాధించిన చారిత్రాత్మక విజయాన్ని బెంగళూరులోని విజయ్ అభిమానులు పెద్ద ఎత్తున వేడుకలు జరుపుకుని తమ మద్దతును చాటుకున్నారు. ఈ సానుకూలతలను ఓట్లుగా మార్చుకుని, అక్కడి స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకోవాలని టీవీకే అధిష్ఠానం భావిస్తున్నట్లు ఇన్‌సైడ్ టాక్ నడుస్తోంది.కర్ణాటక రాజకీయాల్లోకి టీవీకే ఎంట్రీ ఇస్తుందనే వార్తలు బెంగళూరు రాజకీయ వర్గాల్లో ఇప్పుడే ప్రకంపనలు సృష్టిస్తున్నప్పటికీ... దీనిపై విజయ్ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. పార్టీని ఇతర దక్షిణాది రాష్ట్రాలకు విస్తరించే వ్యూహంలో భాగంగానే ఈ ముందడుగు ఉండబోతోందని, త్వరలోనే బెంగళూరు ఎన్నికల పోటీపై టీవీకే స్పష్టత ఇచ్చే అవకాశం ఉందని పరిశీలకులు అంచనా వేస్తున్నారు.

### ఇది జగన్ రెడ్డి వంకర బుద్ధికి నిదర్శనం: నారా లోకేష్



ఇది జగన్ రెడ్డి వంకర బుద్ధికి నిదర్శనమని విమర్శించారు. పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితుల కారణంగా ముడిసరుకుల ధరలు పెరగడం, రవాణాకు ఆటంకాలు ఏర్పడటంతో యూనిఫాం క్లాత్, బూట్లు, బ్యాగుల సరఫరా ఆలస్యమవుతోందని విద్యాశాఖ అధికారులు తెలిపినట్లు లోకేష్ వివరించారు. అయితే, జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభమయ్యే నాటికి విద్యార్థులందరికీ పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ కచ్చితంగా అందజేస్తామని హామీ ఇచ్చారు. మిగిలిన వస్తువులను కూడా వీలైనంత త్వరగా పంపిణీ చేసేందుకు అధికారులు తయారీ సంస్థలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నారని లోకేష్ పేర్కొన్నారు.

# సంపాదకీయం

భారత శక్తి

## ఆర్థిక స్థిరత్వం లేకపోతే అభివృద్ధి నీటి మీద బుడగ

ఎంత అభివృద్ధి చెందిన దేశం అయిన 'వనరుల స్వావలంబన', 'ఆర్థిక స్థిరత్వం' లేకపోతే ఆ దేశం అభివృద్ధి కేవలం నీటి మీద బుడగలాంటిదే. ఇప్పుడు ఇదే సూత్రం మన దేశానికీ కూడా వరిస్తుంది. ఇటీవల మన దేశ ప్రధాని 9 రకాల అంశాల పొదుపుపై చేసిన ప్రసంగంతో దేశం యావత్ ఒక్కసారిగా ఉలిక్కిపడ్డది. గత ఆదివారం సాయంత్రం ప్రధాని హైదరాబాద్‌లో ఈ ప్రకటన చేయగానే సోమవారం ఉదయం స్టాక్ మార్కెట్ సూచీలు బెంబేలెత్తాయి. ఇప్పటికీ స్టాక్ మార్కెట్‌ల ఒడిదుడుకులు కొనసాగుతున్నాయి. స్వయాన ప్రధానమంత్రి దేశ ప్రజలకు పొదుపు పాఠాలు చెప్పడం, దేశ ప్రజలను అప్రమత్తం చేయడం చూస్తే 'వనరుల స్వావలంబన' 'ఆర్థిక క్రమశిక్షణ' లేకపోతే మునుముందు ఆర్థిక సంక్షోభం తప్పదా? అనే అనుమానాలు కలుగక మానదు. అయితే, ప్రధాని ప్రకటనలను కొంతమంది వ్యతిరేక దృక్పథంతో చూస్తే, మరికొందరు సానుకూల దృక్పథంతో చూస్తున్నారు. వాస్తవానికి ప్రధాని చేసిన ప్రకటనలను పాజిటివ్ దృక్పథంతో చూడాలి. ఎందుకంటే, ప్రధాని పేర్కొన్న 9 అంశాలు మామూలు అంశాలు కాదు. దేశ గమనం వీటిమీదనే ఆధారపడి ఉన్నది. వాటిలో బంగారం కొనుగోలు, పెట్రోల్ వాడకం తగ్గించుకోవడం, సేంద్రియ ఎరువులు వాడడం, వంట నూనెల వాడకం తగ్గించుకోవడం చాలా కీలకమైనవి. దాదాపు ప్రతీ సగటు జీవిపై వీటి ప్రభావం ఉంటది. అసలు ప్రపంచంలో నాలుగవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ కలిగిన దేశంలో పెట్రోల్, బంగారం, నూనెలు, ఇతర విదేశీ ఉత్పత్తుల వాడకం గురించి దేశ ప్రధాని పొదుపు ప్రకటనలు చేయడం వెనుక ఆంతర్యం ఏమిటి? ఎక్కువ శాతం దిగుమతుల మీద ఆధారపడ్డ మనదేశంలో వనరుల స్వావలంబన, ఆర్థిక క్రమశిక్షణ అవసరమా? అనేవి ప్రస్తుత పరిస్థితులలో అందరూ ఆలోచించాల్సిన తరుణం. దేశ జనాభాకి తగినట్టుగా భారతదేశంలో వనరులు లేవు. అందుకే, కొన్ని కీలక వస్తువుల వినియోగంలో దేశం దిగుమతుల మీద ఆధారపడి ఉన్నది. వాటిలో ముఖ్యమైనది ముడిచమురు కాగా, రెండవది బంగారం. మొదటిగా ముడి చమురు పరిశీలిస్తే, 2025 -26 వాణిజ్య డేటా ప్రకారం, మొత్తం దేశ దిగుమతుల విలువ సుమారు 775 బిలియన్ డాలర్లు కాగా, వాటిలో సుమారు 135 బిలియన్ డాలర్ల విలువ గలిగిన చమురు దిగుమతులు కూడా ఉన్నాయి. ముడిచమురు, ఖనిజ ఇంధనం కలుపుకొని భారతదేశం మొత్తం దిగుమతులలో దాదాపు 30% పైననే ఉంటాయి. మొత్తం ముడి చమురు అవసరాలలో సుమారు 87.8% మనం ఇతర దేశాల నుండి దిగుమతి చేశామంటున్నాం. దేశ చమురు అవసరాలలో కేవలం 15% కంటే తక్కువ మాత్రమే దేశీయ ఉత్పత్తి సామర్థ్యం ఉన్నది. మరోవైపు, మొత్తం ముడి చమురు దిగుమతిలో సుమారు 45-50 శాతం కేవలం పశ్చిమాసియా దేశాల నుండి దిగుమతి అవుతుంది. ఇటీవల అమెరికా, ఇజ్రాయల్ ఇరాన్ మధ్య తలెత్తిన యుద్ధం ప్రభావంతో ముడి చమురు దిగుమతి తగ్గింది. అంతర్జాతీయ మార్కెట్ లో దాని ధరలు కూడా పెరిగాయి. యుద్ధానికి ముందు (జనవరి నెలలో) బ్యారెల్ ముడి చమురు విలువ సుమారు 61.41 డాలర్ కాగా, ప్రస్తుతం దాని విలువ సుమారు 100 డాలర్ పై నే ఉన్నది. యుద్ధం తరువాత, దాదాపు అన్ని దేశాలలో పెట్రోల్, డీజిల్ ధరలు సగటున 25 నుండి 50 శాతం వరకు పెరిగాయి.

కానీ మన దేశంలో మాత్రం ధరలు పెరగలేదు. ఆయా ధరల భారం సామాన్య ప్రజలపై పడకుండా కేంద్ర ప్రభుత్వం జాగ్రత్త పడుతున్నది. కానీ రానున్న రోజుల్లో ఆ భారం మరింతగా పెరిగే అవకాశం లేకపోలేదు.ఇకపోతే, బంగారం కూడా సుమారు ఒక ఏడాదిపాటు కొనుగోలు చేయవద్దని ప్రధాని చేసిన సూచన కొన్నివర్గాలకు రుచించడం లేదు. బంగారం మన దేశంలో ఒక సెంటిమెంట్ సాధనం. ప్రొడక్టీవ్ పర్పస్ కోసం కాకుండా కేవలం సెంటిమెంట్, అలంకరణ కోసం మాత్రమే బంగారం కొనుగోలు చేస్తున్నాము. ప్రపంచంలో ఉన్న మొత్తం బంగారం నిల్వలో, సుమారు 35 శాతం బంగారం మన దేశంలోనే ఉన్నది. 2024- 25లో 58 బిలియన్ డాలర్ విలువ గలిగిన 757.09 టన్నుల బంగారం దిగుమతి చేసుకోగా, 2025-26 లో 78.98 బిలియన్ డాలర్ల విలువ గలిగిన 721.03 టన్నుల బంగారం దిగుమతి చేసుకున్నాం. గత సంవత్సరంతో పోల్చితే, బంగారం దిగుమతి పరిమాణం తగ్గినప్పటికీ సుమారు 24% వరకు బంగారం ధర మాత్రం పెరిగింది. దిగుమతి టారిఫ్ పెంచడం, యుద్ధం చేయడం వంటి అనవసర నిర్ణయాలతో ట్రంప్ ప్రపంచాన్ని భయాందోళనకు గురిచేస్తున్నాడు. అందుకే పెట్టుబడి దారులు, స్టాక్ మార్కెట్‌లలో సంపదను సురక్షితమైన బంగారం వైపు తరలిస్తున్నారు. ఫలితంగా బంగారం ధరలు అంతర్జాతీయ మార్కెట్‌లో ఆకాశాన్ని అంటాయి. కానీ బంగారం కొనుగోలు మాత్రం భారత్‌లో తగ్గలేదు. వినియోగదారు కొనుగోలు చేసిన బంగారం తిరిగి వారి లాకర్‌లోకి చేరుకుంటుంది. కానీ దాని ద్వారా ఎటువంటి ఉత్పాదకత జరుగదు.

బంగారం దిగుమతి రాను రాను దేశానికీ భారం అవుతుంది. భవిష్యత్‌లో బంగారం దిగుమతులు పెరిగితే, అది దేశ ఆర్థిక వ్యవస్థకు తీవ్ర ఆటంకం చేస్తుంది. ఒకవైపు ప్రపంచ వ్యాప్తంగా బంగారం, ముడిచమురు ధరలు పెరుగుతున్నాయి. వాటిని దిగుమతి చేసుకోవడానికి అయ్యే ఖర్చును డాలర్ రూపంలో చెల్లించాలి. మన దేశానికి వచ్చే రేమిటన్స్ తగ్గిపోవడం, ట్రంప్ నిర్ణయాలతో మన ఎగుమతులు తగ్గి దేశానికి డాలరు రాక తగ్గిపోయింది. కానీ బంగారం, ముడి చమురు వంటి ఇతర వస్తువుల దిగుమతి ఖర్చును డాలర్ రూపంలో చెల్లించాల్సి వస్తుంది. మన దగ్గర తగిన విదేశీ నిల్వలు (డాలర్) లేకపోవడం వలన అంతర్జాతీయ మార్కెట్‌లో డాలర్‌ను కొనుగోలు చేయవలసి రావడం వలన రూపాయి విలువ తగ్గి డాలర్ విలువ పెరుగుతుంది. ట్రంప్ అధికారంలోకి రాక ముందు అంటే 2024 డిసెంబర్‌లో 1 డాలర్ విలువ 83 రూపాయలు కాగా, ఇప్పుడు అది సుమారు 95 రూపాయలకు చేరుకుంది. ఏప్రిల్ 17, 2026 నాటికి భారతదేశ విదేశీ మారక ద్రవ్యనిల్వలు 703.308 బిలియన్ డాలర్లు. పరిస్థితి ఇలాగే కొనసాగితే డాలర్ 100 రూపాయలకు చేరుతుంది. అప్పుడు దిగుమతులు మరింత భారం అవుతాయి.
ఆ భారం దేశ ప్రజలపై పడుతుంది. ముఖ్యంగా చమురు ధరలు పెరిగితే సరుకు రవాణా పెరిగి అన్ని రకాల వస్తువుల ధరలు పెరుగుతాయి. ఇప్పటికే టోకు ద్రవ్యోల్బణం 3.88% కి చేరింది. రిటైల్ ద్రవ్యోల్బణం 3.40% గా ఉంది. ప్రస్తుత పరిస్థితి కొనసాగితే, మరి కొద్దీ రోజుల్లోనే ద్రవ్యోల్బణం 4-4.5%కి చేరే ప్రమాదం ఉంది. ఇది సామాన్యుల బడ్జెట్‌పై తీవ్ర ప్రభావం చూపడమే కాకుండా బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, పారిశ్రామిక రంగాలు భారీగా నష్టపోతాయి. అందుకే, దిగుమతులు తగ్గించుకోవాలి. అంటే, ప్రజలు బంగారు, పెట్రోల్, డీజిల్, వంటనూనెలు, ఇతర దిగుమతుల పై ఆధారపడ్డ వస్తువుల వినియోగం తగ్గించుకుంటే, అంతమేర దిగుమతులు తగ్గి ఈ కష్టకాలం నుండి బయట పడవచ్చును.

# సరూర్‌నగర్‌లో అవినీతి టౌన్ ప్లానింగ్ అధికారిణి..

- మామూళ్ల మత్తులో అక్రమ నిర్మాణాలకు కొమ్ముకాస్తున్న వైనం! - జీరో సెట్‌బ్యాక్‌లతో నిబంధనలకు తిలోదకాలు..
- వ్రాతపూర్వక ఫిర్యాదులపై చర్యలు శూన్యం.. - అగ్నిప్రమాదాల పొంచి ఉన్నముప్పు.. పట్టించుకోని సరూర్నగర్ ,డెప్యూటీ కమిషనర్ కార్యాలయం.






ఇప్పుడు అక్రమ నిర్మాణం ముడుపుల మత్తులో సక్రమ నిర్మాణం..




అక్రమ నిర్మాణం..నిర్మాణ దశలో ఫిర్యాదు..

**ఎల్బీనగర్ మే 24 భారత శక్తి,** అనుమతి ఒకదానికి.. నిర్మాణం మరొకదానికి! సరూర్‌నగర్ సర్కిల్ పరిధిలో టౌన్ ప్లానింగ్ అధికారుల అండదండలతో అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. సరూర్‌నగర్ చౌరస్తా, బొడ్రాయి ఎదురుగా, (చౌడి) వైపు వెళ్లే మార్గంలోని మండల విద్యాధికారి కార్యాలయం (MEO ఆఫీస్) వెనుక రోడ్డులో ఉన్న ఇంటి నంబర్: 11-5-118 గల స్థలంలో భవన నిర్మాణ నిబంధనలను నిలువునా పూడ్చిపెడుతున్నారు. సదరు ఆస్తి యజమానికి గతంలో కేవలం ఒకే అంతస్తు నివాస భవనానికి మాత్రమే అనుమతి ఉంది. అయితే, ప్రస్తుతం ఎలాంటి సవరించిన అనుమతులు లేకుండానే, ఆ స్థలాన్ని నిబంధనలకు విరుద్ధంగా బహుళ అంతస్తుల వాణిజ్య భవనంగా మారుస్తూ కొత్త నిర్మాణాన్ని శరవేగంగా చేపడుతున్నారు.

### నిబంధనలు బలి.. ప్రాణాలకు ముప్పు!

ఈ నిర్మాణంలో కనీస నిబంధనలను గాలికొదిలేశారు. చుట్టూ వదలాల్సిన ఖాళీ స్థలాన్ని (సెట్‌బ్యాక్‌లు) అసలు వదలకుండా, ఏకంగా ప్రభుత్వ రహదారి అంచు వరకు ఆనుకుని భవనాన్ని నిర్మిస్తున్నారు. ఈ ప్రాంతంలోని రహదారి చాలా ఇరుకైనది కావడం, దానికి తోడు ఈ భవనానికి ఖాళీ స్థలం లేకపోవడంతో భవిష్యత్తులో తీవ్రమైన అగ్ని ప్రమాద ముప్పు పొంచి ఉంది. ఏదైనా అత్యవసర పరిస్థితి ఏర్పడితే, అగ్నిమాపక యంత్రాలు


Date:- 04/04/026

To,
The Deputy Municipal Commissioner,
saroor Nagar Circle, GHMC. M.M.C
The Zonal Commissioner,
LB Nagar Zone, GHMC. M.M.C
The Commissioner,
Malkajgiri Municipal Corporation.
The Director, HYDRAA (Hyderabad Disaster Response and Asset Protection Agency).
Vigilance Commissioner, MMC

Subject: Complaint against unauthorized commercial construction at Saroornagar Circle (H.No. 11-5-118) – Violation of setbacks and fire safety norms –Regarding.

Respected Sir/Madam,

I am writing to bring to your urgent attention a serious violation of building bylaws and illegal construction activity occurring at the following location:

House Number: 11-5-118

Location: Road behind MEO Office, towards Saroornagar Chowidi.

Circle: Saroornagar Circle.

Nature of Violation:

The property owner previously held a permission for only a ground-floor residential structure. However, they are currently carrying out new construction, converting the site into a multi-story commercial building without valid revised permissions.

Specific Issues:

Zero Setbacks: The construction is being carried out without leaving any mandatory setback space. The structure is built right up to the edge of the public road.

Fire Safety Hazard: Due to the lack of setbacks and the narrow nature of the approach road, the building poses a significant fire hazard. In the event of an emergency, it would be impossible for fire-fighting equipment or emergency vehicles to access the area.

Illegal Conversion: Residential permissions are being blatantly misused for commercial gains, which will lead to future traffic congestion and public inconvenience.

4/4/26

లేదా అత్యవసర వాహనాలు ఆ ప్రాంతానికి చేరుకోవడం పూర్తిగా అసాధ్యం. కేవలం వాణిజ్య లాభాల కోసమే నివాస అనుమతులను దుర్వినియోగం చేస్తూ స్థానిక ప్రజల ప్రాణాలను పణంగా పెడుతున్నారు. దీనివల్ల భవిష్యత్తులో తీవ్రమైన రద్దీ సమస్యలు, ప్రజలకు అసౌకర్యం కలగడం ఖాయంగా కనిపిస్తోంది.

### ముడుపుల మత్తులో టౌన్ ప్లానింగ్ అధికారిణి 'అర్చన'!

ఈ అక్రమ నిర్మాణంపై స్థానికులు నిర్మాణ దశలోనే డెప్యూటీ కమిషనర్ కార్యాలయం (సర్కిల్ నంబర్ 11) కు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. దీని వెనుక అసలు కారణం టౌన్ ప్లానింగ్ అధికారిణి అర్చన అనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఫిర్యాదు అందినప్పటికీ, సదరు అధికారిణి క్షేత్రస్థాయికి వచ్చి పరిశీలించకుండా అక్రమ నిర్మాణదారుడి నుంచి భారీగా ముడుపులు తీసుకుని, ఈ అక్రమ నిర్మాణానికి పూర్తి స్థాయిలో కొమ్ముకాస్తున్నట్లు స్థానికులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు.

### ఉన్నతాధికారులు స్పందించేనా?

నిర్మాణ దశలోనే ఫిర్యాదు చేసినా పట్టించుకోకుండా, లంచాల ఆశతో అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తూ.. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న టౌన్ ప్లానింగ్ అధికారిణి అర్చనపై ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు స్పందించి, తక్షణమే ఈ అక్రమ వాణిజ్య నిర్మాణాన్ని నిలిపివేసి, నిబంధనలను ఉల్లంఘించిన వారిపై, వారికి సహకరించిన సదరు అధికారిణిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# సరికొత్త చరిత్ర.. తమిళనాడు మంత్రికి తెలంగాణ నేల పై ఆత్మీయ స్వాగతం!

- 59 ఏళ్ల తర్వాత మంత్రివర్గంలో చోటు.. విశ్వనాథన్‌ను అభినందించిన పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

హైదరాబాద్ మే 24: భారత శక్తి: తమిళనాడు రాజకీయాల్లో సరికొత్త రికార్డు సృష్టించిన ఆ రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి పి. విశ్వనాథన్ ఆదివారం హైదరాబాద్ వచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ భేటీలో ఇరు రాష్ట్రాల నేతలు పలు ఆసక్తికర అంశాలపై చర్చించారు. తొలుత విశ్వనాథన్.. పొంగులేటికి పూలగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

### - ఘన సన్మానం -- జ్ఞాపకాల బహుమతి

తమిళనాడులోని వేలూరు శాసనసభ నియోజకవర్గం (అసెంబ్లీ స్థానం) నుండి ఘన విజయం సాధించి, మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన విశ్వనాథన్‌ను పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శాలువాతో సత్కరించారు. అనంతరం పర్యావరణ హితాన్ని చాటేలా ఒక పూల మొక్కను జ్ఞాపికగా అందజేసి అభినందనలు తెలిపారు.

"దాదాపు ఆరు దశాబ్దాల (59 సంవత్సరాల) సుదీర్ఘ నిరీక్షణ తర్వాత తమిళనాడు గడ్డపై కాంగ్రెస్ పార్టీ తరపున ఒకరు మంత్రివర్గంలో స్థానం దక్కించుకోవడం చారిత్రాత్మక ఘట్టం."
పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

### - ప్రజల ఆశయాలే ఊపిరిగా..

ఈ సందర్భంగా పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. విశ్వనాథన్ సాధించిన విజయం సాధారణమైనది కాదని కొనియాడారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా, వారి ఆశయాలకు అనుగుణంగా ప్రజాసేవలో ముందుండాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో తమిళనాడులో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు విశ్వనాథన్ తన శక్తివంచన లేకుండా కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ భేటీ ఇరు రాష్ట్రాల నేతల మధ్య ఆత్మీయతను, రాజకీయ బంధాన్ని మరింత బలోపేతం చేసింది.





# కాళేశ్వరంలో భక్తులకు అందుబాటులో ఉండి వైద్యం అందించాలి

**రేగొండ, కాళేశ్వరం, మే 24 (భారతశక్తి):** భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందిని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. మధుసూదన్, ములుగు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. గోపాల్ వైద్య సిబ్బందిని ఆదేశించారు.

ఆదివారం కాళేశ్వరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారులు సందర్శించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం క్యాంపులో అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించి, చికిత్స పొందుతున్న ఇన్‌పేషెంట్ల ఆరోగ్య పరిస్థితి గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోగులకు అందిస్తున్న చికిత్స, ఔషధాల లభ్యత, వైద్య సిబ్బంది విధుల నిర్వహణను సమగ్రంగా పరిశీలించారు.

ముఖ్యంగా వేడి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, అత్యవసర వైద్య సేవలు అందించేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ఎల్ ఓ సి అందజేత



మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 24 (భారత శక్తి) : మంచిర్యాల నియోజకవర్గం హాజీపూర్ మండల బుద్దిపల్లి (కొండాపూర్) గ్రామానికి చెందిన A.అంజయ్య ఆరోగ్య ఖర్చుల నిమిత్తం 2,50,000/- లక్షల రూపాయల ఎల్ ఓ సి చెక్కును ఆదివారం రోజున వారి కుటుంబ సభ్యులకు మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆరోగ్య ఖర్చుల నిమిత్తం అందజేయడం జరుగుతుందని అన్నారు.

## రైతులకు జీలుగ విత్తనాల పంపిణీ




**నిజామాబాద్, మే 24(భారత శక్తి ):** బాల్కొండ నియోజకవర్గం ముప్కాల్ మండలంలోని రెంజర్ల గ్రామంలో రైతులకు జీలుగా విత్తనాలను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు కోమటి శెట్టి గంగాధర్ మాట్లాడుతూ సొసైటీ పరిధిలోని గ్రామాలకు రైతులు జిలుగ విత్తనాలను తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు, గ్రామ ఉప సర్పంచ్, క్లస్టర్ రైతులు, రెంజర్ల, నాగంపేట్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, మండల వ్యవసాయ విస్తరణ అధికారి,సొసైటీ సెక్రటరీ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఇసుక లారీ పట్టివేత




**నిజామాబాద్, మే 24(భారత శక్తి ):** జగిత్యాల జిల్లా మల్లాపూర్ నుంచి నిర్మల్ కి ఇసుక లోడుతో వెళ్తున్న లారీని మెండోరా పోలీసులు పట్టుకున్నారు. ఇసుకకు సంబంధించి ఎలాంటి పత్రాలు లేకపోవడంతో లారీ యజమా ని ఈశ్వర్ తో పాటు లారీ డ్రైవర్ నాగరాజు పై కేసు నమోదు చేసినట్లు మెండోరా ఎస్సై సుహాసిని తెలిపారు. అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై చెప్పారు.

## ఉద్యాన శాఖకు సంబంధించి 665.6 హెక్టార్లలో పంట నష్టం అంచనా రూ. 2.31 కోట్లు:జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి



**వైయస్సార్ కడప, మే 24(భారత శక్తి ):** జిల్లా లో ఇటీవల కురిసిన వర్షాల వల్ల జరిగిన పంట నష్టం పై క్షేత్రస్థాయిలో అధికారులు పూర్తిస్థాయిలో పరిశీలించి సిద్ధం చేసిన ప్రాథమిక నివేదికలను ప్రభుత్వం నకు పంపడం జరిగిందని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. టెలి కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాల వలన జరిగిన పంట నష్టం పై జిల్లా కలెక్టర్ వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా లో ఇటీవల పెను గాలులు తో కురిసిన వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలకు సంబంధించి క్షేత్రస్థాయి లో పర్యటించి సిద్ధం చేసిన ప్రాథమిక నివేదికను ప్రభుత్వానికి పంపడం జరిగిందని, ఇంక నూ క్షేత్రస్థాయి లో వ్యవసాయ ఉద్యాన శాఖలకు సంబంధించిన సిబ్బంది పంట నష్టం అంచనా వివరాలను మరింత పగడ్బందీగా చేసి తుది పంట నష్టం వివరాలతో కూడిన నివేదిక ను సిద్ధం చేయాలని ఆదేశించారు.

### "6 హెక్టార్లలో వరి పంట నష్టం"

వ్యవసాయ శాఖ కు సంబంధించి ఒంటిమిట్ట మండలం లోని కొత్త మాధవరం,సలాబాద్ గ్రామాలలో కోత దశలో ఉన్న వరి పంట దెబ్బతిన్నట్లు, ప్రాథమిక అంచనాల ప్రకారం సుమారు 6 హెక్టార్లలో వరి పంట నేలకూలి,8 మంది రైతులకు నష్టం వాటిల్లినట్లు కలెక్టర్ వెల్లడించారు. ఉద్యాన శాఖకు సంబంధించి 665.6 హెక్టార్లలో పంట నష్టం అంచనా రూ. 2.31 కోట్లు ఉద్యాన పంటలకు సంబంధించి జిల్లాలో పులివెందుల,లింగాల, వేముల,వేంపల్లి,సింహాద్రిపురం తదితర మండలాల్లోని ఉద్యాన పంటలు 665.6 హెక్టార్ల లో 705 మంది రైతులకు నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనా ను ప్రభుత్వానికి నివేదించినట్లు తెలిపారు. ఇందులో ప్రధానంగా అరటిపంట 630 హెక్టార్లలో నష్టం వాటిల్లిందని పంట నష్టం అంచనా సుమారు 2 కోట్ల 31 లక్షలు గా ఉన్నట్లు ప్రాథమిక అంచనా అన్నారు. మండలాల వారీ గా గ్రామాలలో బృందాలను ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలో ఎన్యుమరేషన్ ప్రారంభించడం జరిగిందని పూర్తిస్థాయిలో తుది పంట నష్టం నివేదికల కొరకు క్షేత్రస్థాయిలో ఎన్యుమరేషన్ ప్రక్రియ ను పగడ్బందీగా చేపట్టాలని వ్యవసాయ ఉద్యానవన శాఖ అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. రైతులకు జరిగిన నష్టాన్ని అంచనా వేసి అవసరమైన చర్యలు తీసుకునే దిశగా వ్యవసాయ,ఉద్యాన శాఖ అధికారులు పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

## పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై సోమవారం రోజున జగిత్యాలలో కాంగ్రెస్ భారీ ధర్నా

**జగిత్యాల, మే 24 (భారత శక్తి):** దేశంలో పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలకు నిరసనగా సోమవారం రోజున ఉదయం 9 గంటలకు జగిత్యాల జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ధర్నా, నిరసన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఓల్డ్ హైస్కూల్ నుంచి తహసిల్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించబడుతుంది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ధర్మపురి మండల కాంగ్రెస్ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చిలుముల లక్ష్మణ్ కోరారు.

# శాంతియుత వాతావరణంలో బక్రీద్ పండుగ వేడుకలు జరుపుకోవాలి

## - జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి



**వై ఎస్ ఆర్ కడప, మే 24(భారత శక్తి ) :** ప్రతి ఒక్కరూ ఆచారాల వ్యవహారాలు, సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన పెంచుకుని,సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరిస్తూ బక్రీద్ పండుగను శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు. త్వరలో జరగనున్న బక్రీద్ పండుగ సందర్భంగా స్థానిక కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, రాజంపేట సబ్ కలెక్టర్,కేఎంసి కమిషనర్ హెచ్.ఎస్.భావన, ఏఎస్పీ రామ్నాథ్ హెగ్డే, డిఆర్వో మల్లికార్జునుడు లతో కలిసి జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి వివిధ శాఖల అధికారులు, అన్ని మతాల మత పెద్దలతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మత సామరస్యానికి ప్రతీక అయిన కడప జిల్లాలో బక్రీద్ పండుగ ఎలాంటి ఆటంకాలు లేకుండా ప్రశాంత వాతావరణంలో జరుగుతుందన్న ఆశా భావాన్ని వ్యక్తం చేశారు. అన్ని మతాలకు సంబంధించి ఎవరికీ ఎలాంటి ఇబ్బంది కలుగ చేయకుండా పండుగను సంతోషంగా జరుపుకోవాలని అన్నారు. ముఖ్యంగా జంతువధ శాలల వద్ద ప్రభుత్వం సూచించిన నియమ నిబంధనలను ప్రతి ఒక్కరు తప్పక పాటించాలన్నారు.ఎలాంటి మతపరమైన, సున్నితమైన అంశాలను సూక్ష్మ దృష్టిలో చూడకుండా అన్ని మతాల ప్రజలుసహనం, సంయమనంతోసంతోషంగా సాంప్రదాయాలను గౌరవించుకుంటూ బక్రీద్ పండుగ ను నిర్వహించుకోవాలన్నారు. ముఖ్యంగా ప్రస్తుతం అతి వేగవంతంగా తప్పుడు సమాచారం సోషల్ మీడియా ద్వారా స్ప్రెడ్ అయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ సోషల్ మీడియాను ఎక్కువగా ఉపయోగిస్తున్న యువతను కూడా కంట్రోల్ చేయాల్సిన అవసరం ఉందన్నారు. అందులో భాగంగానే అన్ని మతాల చెందిన యువకులకు బక్రీద్ పండుగ నిర్వహణ, సంప్రదాయాలపై పూర్తి స్థాయిలో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. స్లాటర్ హౌస్ ల వద్ద శానిటేషన్,మంచినీటి సరఫరా చేయాలని,అలాగే అంతరాయం లేని నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే ఎక్కడా ఎలాంటి సంఘటనలు జరగకుండా పోలీస్, రెవిన్యూ యంత్రాంగం తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రతి మండలంలో కూడా పీఎస్ కమిటీ సమావేశాలు ఏర్పాటు చేసి సంబందిత పంచాయతీ,రెవెన్యూ, పోలీసు అధికారులను సమన్వయం చేసుకుంటూ జిల్లాలో బక్రీద్ పండుగ ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ మాట్లాడుతూ బక్రీద్ పండుగ సందర్భంగా ఎక్కడ ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా అన్ని భద్రతా ఏర్పాట్లను చేస్తామని అన్నారు. ఏదైనా సమస్యలు ఉంటే దృష్టికి తీసుకురావాలని కోరారు. సమస్యాత్మక స్లాటర్ హౌస్ ల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. స్లాటర్ హౌస్ కు వెళ్లే జీవాలు తప్పక పశుసంవర్ధక శాఖ అధికారి ధ్రువీకరణ పొందాలని అన్నారు. బక్రీద్ పండుగను ఇతరులకు ఎవరికీ ఎలాంటి ఇబ్బంది కలుగకుండా సంతోషంగా జరుపుకోవాలని ఆయన అన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ జిల్లాలో బక్రీద్ పండుగ నిర్వహణకు సంబంధించి ఎస్ఓపి ప్రకారం చేపట్టాల్సిన చర్యలు, విధి విధానాలను వివరిస్తూ సంబంధిత జిల్లా అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీచేశారు.దఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి హిదాయతుల్లా, ప్రాసిక్యూట్ అడ్మిన్ డీడీ, రెవిన్యూ, పోలీస్, ఆరోగ్య శాఖ, పశుసంవర్ధక శాఖ, పంచాయతీ శాఖ, ఫైర్ శాఖ అధికారులు జిల్లా అధికారులు,పీస్ కమిటీ సభ్యులు, అన్ని మతాల మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



## వేములవాడ ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

### - జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా:కొలిపాక నరసయ్య



**రాజన్న సిరిసిల్ల, మే 24(భారత శక్తి):** వేములవాడ పట్టణంలోని మున్నూరు కాపు కళ్యాణ మండపంలో టీయూడబ్ల్యూజే హెచ్-143 వేములవాడ ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. జిల్లా అధ్యక్షుడు లాయక్ పాషా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు, సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన బాధ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా కొలిపాక నరసయ్య, ప్రధాన కార్యదర్శిగా సయ్యద్ అలీ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పాశం భాస్కర్ రెడ్డిలను సభ్యులు గజమాలలు, శాలువాలతో సత్కరించారు. అనంతరం నూతన అధ్యక్షుడు కొలిపాక నరసయ్య మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఏకగ్రీవంగా ఎన్నుకున్న సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.సంఘ బలోపేతానికి, జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి నిబద్ధతతో పని చేస్తానని, ప్రతి సభ్యుడు సహకరించాలని కోరారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు లాయక్ పాషా, అధ్యక్షుడు నర్సయ్య నూతన కార్యవర్గానికి శాలువాలతో సత్కరించారు.గౌరవ సభ్యులుగా కొత్వాల్ శ్రీనివాస్, జితేందర్ రావు, కట్టెకోల రాంప్రసాద్, నేరెళ్ల కరుణాకర్, ఉపాధ్యక్షులుగా దేవరాజ్, అబ్దుల్ జబ్బార్, విష్ణు, క్యాషియర్‌గా పంపరి నాగరాజు, సంయుక్త కార్యదర్శిగా ఫహద్ పాషా, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా చౌటపల్లి వెంకటేష్, జింక శ్రీధర్, ప్రచార కార్యదర్శులుగా డెబ్బేటి ప్రవీణ్, శ్రీ రామోజీ వేణు, కార్యవర్గ సభ్యులుగా షబ్బీర్, గంగాధర్, బూర్ల ప్రదీప్, సంటి రాజేందర్, పండుగ స్వామి, ఆసిమ్, లక్ష్మీనారాయణ, నవీన్, పి. వేణు, రాములను సత్కరించారు. జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ కోసం ఐక్యంగా పని చేస్తామని నూతన బాధ్యులు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి సన్మానోత్సవ సభలో పాల్గొన్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



**హన్మకొండ, భారత శక్తి ప్రతినిధి, మే 24:** హన్మకొండ హంటర్ రోడ్డులోని డి కన్వెన్షన్ సెంటర్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నూతనంగా రాజ్యసభ సభ్యులుగా ఎన్నికైన వేం నరేందర్ రెడ్డి ఘన సన్మానోత్సవ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా మంత్రివర్యులు శ్రీమతి కొండ సురేఖ , ధనసరి అనసూయ (సీతక్క) , ఎంపీలు, ఎమ్మెల్సీలు, సహచర ఎమ్మెల్యేలతో కలిసి వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు పాల్గొన్నారు. తొలుత ఎమ్మెల్యే నాగరాజు ఎంపీ వేం నరేందర్ రెడ్డి కి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. అదే విధంగా అదాలత్ లోని అమరవీరుల స్థూపానికి పూల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను నమ్మి పనిచేసే నాయకుల్లో వేం నరేందర్ రెడ్డి ముందుంటారని అన్నారు. ముఖ్యమంత్రి సలహాదారుడిగా పనిచేసిన సమయంలో పార్టీ మరియు ప్రభుత్వానికి మధ్య సమన్వయం కల్పిస్తూ, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు సముచిత స్థానం దక్కేలా కృషి చేశారని కొనియాడారు.తనకు వర్ధన్నపేట కాంగ్రెస్ పార్టీతరపున టికెట్ రావడంలో ఎంపీ వేం నరేందర్ రెడ్డి అన్న పాత్ర ఎంతో కీలకమని, ఎమ్మెల్యేగా ఎన్నికైన తరువాత నియోజకవర్గ అభివృద్ధికి నిధులు తీసుకురావడంలో కూడా ఆయన తనవంతు సహకారం అందించారని తెలిపారు.తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాల కోసం రాజ్యసభలో గళమెత్తే నాయకత్వ లక్షణాలు వేం నరేందర్ రెడ్డి లో ఉన్నాయని, రాష్ట్రానికి రావాల్సిన నిధులు, నియామకాల కోసం ఆయన సమర్థంగా పోరాడగలరని ఎమ్మెల్యే నాగరాజు పేర్కొన్నారు. ఇలాంటి నాయకుడు రాజ్యసభకు ఎన్నిక కావడం తెలంగాణ ప్రజలందరికీ గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో పలు కార్పొరేషన్ చైర్మన్లు, పీసీసీ ప్రతినిధులు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జిల్లా మండల డివిజన్ గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జమాయమ్మ జగ్గారెడ్డి క్రికెట్ టోర్నమెంట్ - సీజన్ 2 విజేతలకు బహుమతి అందజేసిన టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

### - ఎన్‌జీసీసీ టీ జే ఆర్ సంగారెడ్డి జట్టుకు రూ.1 లక్ష బహుమతి అందజేసిన నిర్మలా జగ్గారెడ్డి




**సంగారెడ్డి,భారత శక్తి ప్రతినిధి, మే 24:** సంగారెడ్డి పట్టణంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్టేడియంలో వారం రోజులుగా కొనసాగిన "జమాయమ్మ జగ్గారెడ్డి క్రికెట్ టోర్నమెంట్--సీజన్ 2" ఘనంగా ముగిసింది. స్థానిక యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించాలనే లక్ష్యంతో నిర్వహించిన ఈ టోర్నమెంట్‌కు క్రీడాభిమానుల నుంచి విశేష స్పందన లభించింది.ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నిర్మల జగ్గారెడ్డి విజేతలకు బహుమతులు అందజేశారు. ఫైనల్ మ్యాచ్‌లో అద్భుత ప్రదర్శన కనబరిచిన ఎన్‌జీసీసీ టీ జే ఆర్ సంగారెడ్డి జట్టు విజేతగా నిలిచి రూ.1 లక్ష నగదు బహుమతిని కైవసం చేసుకోగా, రన్నరప్‌గా నిలిచిన నిరంజన్--11 పటాన్‌చెరు జట్టుకు రూ.50 వేల నగదు బహుమతి అందజేశారు.అదేవిధంగా టోర్నమెంట్‌లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు బెస్ట్ బ్యాట్స్‌మన్, బెస్ట్ బౌలర్, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ విభాగాల్లో ప్రత్యేక నగదు పురస్కారాలు ప్రదానం చేశారు. కౌన్సిలర్ ఫైజ్ బావజీర్ పర్యవేక్షణలో, నిర్వాహకులు సర్ఫరాజ్, అజర్, ఫహీం, యబా, ఇమ్రాన్ సమన్వయంతో పోటీలు విజయవంతంగా నిర్వహించబడ్డాయి.

### "క్రీడలు యువతకు క్రమశిక్షణ నేర్పిస్తాయి"

ఈ సందర్భంగా నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ, ఆటల్లో గెలుపు--ఓటములు సహజమని, క్రీడాస్ఫూర్తితో పాల్గొనడమే ముఖ్యమని పేర్కొన్నారు. యువత క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలని, క్రీడలు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక దృఢత్వాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. క్రమశిక్షణ, సమయపాలన వంటి విలువలు క్రీడల ద్వారా అలవడతాయని ఆమె అన్నారు.

### ఇండోర్ స్టేడియానికి రూ.10 కోట్లు:

సంగారెడ్డిలో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి జగ్గారెడ్డి సహకారంతో రూ.10 కోట్ల నిధులు మంజూరైనట్లు నిర్మల జగ్గారెడ్డి వెల్లడించారు. త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా క్రీడాకారులకు మెరుగైన వసతులు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు.బిఈ కార్యక్రమంలో సంగారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత సంతోష్ కుమార్, వైస్ చైర్మన్ హఫీజ్ షేక్ షఫీ, ప్రజాప్రతినిధులు, క్రీడాకారులు, నిర్వాహకులు, యువకులు, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## మే 25 నుంచి 30 వరకు
# "మహిళా సంక్షేమ వారోత్సవం" నిర్వహణ

**- అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కార్యక్రమాలను విజయవంతం చేయాలి: జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**



**సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, మే 24:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మే 25 నుండి 30 వరకు జిల్లాలో "మహిళా సంక్షేమ వారోత్సవం" నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. మహిళల ఆర్థిక అభివృద్ధి, స్వయం ఉపాధి అవకాశాల విస్తరణ, స్వయం సహాయక సంఘాల బలోపేతం లక్ష్యంగా ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.జిల్లా వ్యాప్తంగా మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. మహిళా సంఘాల ఆర్థిక పురోగతికి దోహదపడే విధంగా అవగాహన కార్యక్రమాలు, రుణ మేళాలు, మార్కెటింగ్ అవకాశాలు, నైపుణ్యాభివృద్ధి శిక్షణలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మే 25న అన్ని ఏ ఎల్ ఎఫ్ ఎస్ , టి ఎల్ ఎఫ్ ఎస్ స్థాయిలో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి మహిళా ఆర్థిక వారోత్సవంపై అవగాహన కల్పించనున్నారు. గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లోనిసభ్యులతో సమావేశాలు ఏర్పాటు చేసి కార్యక్రమాలపై చర్చించనున్నారు. మే 26 నుండి 30 వరకు మహిళా సంఘాల ద్వారా ఉత్పత్తుల ప్రదర్శనలు, బ్యాంక్ లింకేజీ కార్యక్రమాలు, రుణ మేళాలు, డిజిటల్ లావాదేవీలపై అవగాహన, మార్కెటింగ్ అవకాశాలపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.మహిళా వ్యాపారవేత్తలకు అవసరమైన రిజిస్ట్రేషన్లు, లైసెన్సులు, ప్రభుత్వ పథకాల అనుసంధానంపై ప్రత్యేక సహాయం అందించనున్నారు.మే 27న మహిళా వ్యాపారవేత్తలకు మున్సిపాలిటీలలో ప్రత్యేక కౌంటర్ల ద్వారా సేవలు అందించనున్నారు. మే 28న ఐ ఎం ఎస్ కార్యక్రమాలపై అవగాహన, ఎస్ ఎస్ జి మహిళల నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించనున్నారు.మే 29న రుణ మేళాలు, మహిళా సంఘాలకు ఆర్థిక సహాయం, ఎస్ ఎస్ జి ఎస్ కు రుణాల మంజూరు కార్యక్రమాలు చేపట్టనున్నారు. మే 30న పీఎంఫమ్ పథకం కింద క్రెడిట్ లింక్ సబ్సిడీ రుణాలపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి అర్హులైన మహిళా సంఘాలకు ప్రయోజనాలు కల్పించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.మహిళల ఆర్థిక స్వావలంబనకు దోహదపడే ఈ వారోత్సవ కార్యక్రమాలను అన్ని శాఖలు సమన్వయంతో విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ కోరారు.

# అంతర్జాతీయ సంస్కృత శిఖరం: ప్రొఫెసర్ వెంపటి కుటుంబ శాస్త్రి



ఆధునిక కాలంలో సంస్కృత భాషా పరిరక్షణకు, అద్వైత వేదాంత విజ్ఞానాన్ని ప్రపంచవ్యాప్తం చేయడానికి పీఠం వేసిన మహామహోపాధ్యాయుడు ప్రొఫెసర్ వెంపటి కుటుంబశాస్త్రి. సాంప్రదాయ వేద విద్యలో లోతైన పాండిత్యంతో పాటు, ఆధునిక విమర్శనాత్మక పరిశోధనా శైలిని మేళవించిన అరుదైన విద్యావేత్త ఆయన. ప్రస్తుతం కాంచీపురంలోని శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి విశ్వమహావిద్యాలయ (SCSVMV) ఛాన్స్ లర్‌గా, న్యూఢిల్లీలోని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఫిలాసఫికల్ రీసెర్చ్ (ICPR) లో నేషనల్ ఫెలోగా సేవలు అందిస్తున్నారు.1950 ఆగస్టు 12న కృష్ణా జిల్లా గుడ్లవల్లేరులో జన్మించిన కుటుంబ శాస్త్రి గారు, తిరుమల ఎస్.వి. వేదపాఠశాలలో ఋగ్వేదంలో కఠినమైన సాంప్రదాయ శిక్షణ పొందారు. అనంతరం ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి 'విద్యాప్రవీణ', మద్రాస్ విశ్వవిద్యాలయం నుంచి 'శిరోమణి' పట్టాలు సాధించారు. రాష్ట్రీయ సంస్కృత సంస్థాన్ నుంచి పిహెచ్.డి (విద్యావారిధి) పూర్తి చేసిన ఆయన, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం నుంచి ఫిలాసఫీలో ఎం.ఏ, యోగాలో పీజీ డిప్లొమా కూడా పూర్తి చేశారు. ఆయన ప్రతిభకు గుర్తింపుగా బెంగళూరు ఎస్-వ్యాస వర్సిటీ, రామ్‌టెక్ కవికులగురు కాళిదాస్ వర్సిటీలు గౌరవ డి.లిట్ (D.Litt) పట్టాలను ప్రదానం చేశాయి.ప్రొఫెసర్ కుటుంబశాస్త్రి విద్యా పరిపాలన రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చారు. వారణాసిలోని సంపూర్ణానంద్ సంస్కృత విశ్వవిద్యాలయం, గుజరాత్‌లోని శ్రీ సోమనాథ్ సంస్కృత విశ్వవిద్యాలయాలకు వైస్ ఛాన్స్ లర్‌గా, న్యూఢిల్లీలోని రాష్ట్రీయ సంస్కృత సంస్థాన్ (ప్రస్తుతం సెంట్రల్ సంస్కృత యూనివర్సిటీ) వ్యవస్థాపక వైస్ ఛాన్స్ లర్‌గా సేవలు అందించి, దేశవ్యాప్తంగా సంస్కృత విద్యా ప్రణాళికను ఆధునీకరించారు. అంతర్జాతీయ స్థాయిలో 'ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సంస్కృత్ స్టడీస్' అధ్యక్షుడిగా వరుసగా రెండు పర్యాయాలు ఎన్నికై, ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో ప్రపంచ సంస్కృత మహాసభలను నిర్వహించి, భారతదేశ మేధో సంపత్తిని విశ్వవేదికపై చాటారు.గొప్ప పరిశోధకుడైన ఆయన 15 పుస్తకాలను, 50కి పైగా పరిశోధనా పత్రాలను రచించారు. ఆయన రాసిన 'తాత్పర్యం: యాన్ ఇంటర్-శాస్త్రిక్ స్టడీ' అనే గ్రంథం భారతీయ తత్వశాస్త్రంలో ఒక మైలురాయి. అన్నింటికంటే మిన్నగా, సంస్కృతాన్ని సామాన్యులకు సైతం చేరవేయాలనే తపనతో ఆయన రూపొందించిన 'సంస్కృత-స్వాధ్యాయః' అనే స్వయం అభ్యాసన పాఠ్యప్రణాళిక ద్వారా దేశవిదేశాల్లో దాదాపు 20 లక్షల మంది ప్రజలు సంస్కృత భాషను సులభంగా నేర్చుకోగలిగారు.ఆయన అద్భుత సేవలకు గుర్తింపుగా ఇప్పటికే 2014లో భారత రాష్ట్రపతి చేతుల మీదుగా సర్టిఫికేట్ ఆఫ్ ఆనర్', మహాకవి కాళిదాస సంస్కృత సాధన పురస్కారం, వేదవ్యాస పురస్కారం, లోకమాన్య తిలక్ సంస్కృత పురస్కారాల వంటి ఎన్నో అవార్డులు అందుకున్నారు. వివిధ పీఠాల శంకరాచార్యులు, మహా మండలేశ్వరుల ఆదరాభిమానాలను పొందిన ఆయన, ఇప్పుడు రాష్ట్రపతి భవన్‌లో మరో విశిష్ట జాతీయ పురస్కారాన్ని అందుకుని తెలుగు వారి కీర్తిని మరోసారి సమున్నతంగా నిలిపారు.

# అన్నమయ్య సంకీర్తనాచార్యుడు: గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ (మరణానంతరం)



15వ శతాబ్దపు పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల కృతులను ఆధునిక యుగంలో సజీవ భక్తి స్రవంతిగా మార్చిన ఘనత గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ గారికే దక్కుతుంది. కేవలం తాళపత్ర గ్రంథాలకే పరిమితమైన అన్నమయ్య కీర్తనలను అద్భుతమైన రాగయుక్తంగా స్వరకల్పన చేసి, ప్రజాబాహుళ్యంలోకి తీసుకెళ్లిన అత్యంత ప్రతిభావంతుడైన వాగ్గేయకారుడు ఆయన.1948 నవంబర్ 9న ఆంధ్రప్రదేశ్‌లో జన్మించిన బాలకృష్ణ ప్రసాద్, చిన్ననాడే తల్లిదండ్రుల వద్ద ప్రాథమిక సంగీత పాఠాలు నేర్చుకున్నారు. అనంతరం ప్రముఖ సంగీత సమ్రాట్ డాక్టర్ నేదునూరి కృష్ణమూర్తి గారి వద్ద శిష్యరికం చేసి, తన శాస్త్రీయ సంగీత పటిమను మరింత పదును పెట్టుకున్నారు. 1978లో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ ) ప్రారంభించిన 'అన్నమాచార్య ప్రాజెక్ట్' లో చేరి, దాదాపు మూడు దశాబ్దాల పాటు నిరంతరాయంగా సేవలు అందించారు. ఆ తర్వాత కూడా జీవితాంతం టిటిడి ఆస్థాన విద్వాంసునిగా కొనసాగుతూ అన్నమయ్య సంకీర్తనల వ్యాప్తికి అహర్నిశలు శ్రమించారు.ఆయన ఆరు దశాబ్దాల సుదీర్ఘ సంగీత ప్రస్థానంలో దేశవిదేశాలలో 6,000కు పైగా ప్రదర్శనలు ఇచ్చారు. 200లకు పైగా రాగాలలో 2,500కు పైగా భక్తి, శాస్త్రీయ రచనలు చేసిన స్వర నిధి బాలకృష్ణ ప్రసాద్ గారు. వీటిలో 1,000కి పైగా అన్నమయ్య సంకీర్తనలకు ఆయనే స్వయంగా స్వరకల్పన చేశారు. 21వ శతాబ్దపు అరుదైన వాగ్గేయకారుడిగా గుర్తింపు పొందిన బాలకృష్ణ ప్రసాద్, 22 నూతన శాస్త్రీయ రాగాలను సృష్టించడమే కాకుండా.. సంస్కృతం, తెలుగు భాషలలో 400కు పైగా కీర్తనలు, వర్ణాలు, తిల్లానాలను స్వయంగా రచించి స్వరపరిచారు.సంగీతాన్ని ఒక యజ్ఞంలా భావించిన ఆయన 'సంకీర్తన యజ్ఞం' అనే సరికొత్త సంప్రదాయానికి శ్రీకారం చుట్టారు. 2009లో హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో 1,60,000 మంది గాయకులను ఒకే వేదికపైకి తెచ్చి, ఆయన నేతృత్వంలో నిర్వహించిన 'లక్షగళార్చన' కార్యక్రమం గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించుకుంది. ప్రసిద్ధ తెలుగు చలనచిత్రం 'అన్నమయ్య' లోని పాటల స్వరశైలిపై కూడా ఆయన ముద్ర స్పష్టంగా కనిపిస్తుంది. ఆయన 10కి పైగా సంగీత స్వరలిపి గ్రంథాలను రచించారు, 100కు పైగా ఆల్బమ్స్ విడుదల చేశారు.సంగీత లోకానికి ఆయన చేసిన ఈ అనన్య సామాన్యమైన సేవలకు గాను భారత ప్రభుత్వం 'సంగీత నాటక అకాడమీ అవార్డు (2020)' తో గౌరవించింది. తిరుమల తిరుపతి దేవస్థానం, కంచి కామకోటి పీఠం, అహోబిల మఠంల నుంచి 'ఆస్థాన విద్వాన్' బిరుదులను పొందారు. 2025 మార్చి 9న ఈ సంగీత శిఖరం శివైక్యం చెందింది. రాష్ట్రపతి భవన్‌లో జరిగిన వైభవ వేడుకలో ఆయన తరపున వారి కుటుంబ సభ్యులు ఈ విశిష్ట పురస్కారాన్ని రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకున్నారు.

## బ్రాహ్మణపల్లిలో వైభవంగా
# వేణుగోపాలస్వామి కల్యాణోత్సవం

**- ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన ఇబ్రహీంపట్నం శాసనసభ్యుడు మల్రెడ్డి రంగారెడ్డి**


**- సంస్కృతి, సంప్రదాయాలకు ప్రభుత్వం పెద్దపీట: మల్రెడ్డి.**



అబ్దుల్లాపూర్‌మెట్, మే 24: భారత శక్తి ,మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో శ్రీ వేణుగోపాలస్వామి కల్యాణోత్సవం ఆదివారం ఆధ్యాత్మిక శోభతో కన్నులపండువగా సాగింది. ఈ వేడుకలకు ఇబ్రహీంపట్నం శాసనసభ్యుడు మల్రెడ్డి రంగారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆలయానికి చేరుకున్న రంగారెడ్డికి ఉత్సవ నిర్వాహకులు శాలువాతో ఘనంగా సత్కరించి, స్వాగతం పలికారు.

**- కనులపండువగా కల్యాణ ఘట్టం,**

అనంతరం రంగారెడ్డి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులతో కలిసి కొలువుదీరి స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించారు. ఈ సందర్భంగా



శాసనసభ్యుడు మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో వర్ధిల్లాలని, గ్రామాలు సుభిక్షంగా ఉండాలని ఆ వేణుగోపాలస్వామిని ప్రార్థించినట్లు తెలిపారు.

**- ఆలయాల పునరుద్ధరణకు ప్రత్యేక నిధులు**



"రాష్ట్ర ప్రభుత్వం ప్రాచీన సంస్కృతి, సంప్రదాయాలకు పెద్దపీట వేస్తోంది. అందులో భాగంగానే గ్రామీణ ప్రాంతాల్లోని ఆలయాల పునరుద్ధరణకు, ధూపదీప నైవేద్యాలకు ప్రత్యేకంగా నిధులను కేటాయిస్తోంది."

**మల్రెడ్డి రంగారెడ్డి, శాసనసభ్యుడు**

ఈ కల్యాణోత్సవ వేడుకల్లో గ్రామ ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. భక్తుల రాకతో ఆలయ ప్రాంగణమంతా ఆధ్యాత్మిక కోలాహలం నెలకొంది.

## పంట అవశేషాల దహనంపై
# గ్రామాల్లో అవగాహన కల్పించాలి

**- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**








జగిత్యాల, మే 24 (భారత శక్తి): రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లు వేగవంతంగా పూర్తి చేయడంతో పాటు పంట అవశేషాల దహనంపై గ్రామాల్లో విస్తృత అవగాహన కల్పించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ఆదివారం ధాన్యం కొనుగోళ్లపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ పాల్గొన్నారు ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ, రైతులకు 24 గంటల్లోనే ధాన్యం చెల్లింపులు జరుగుతున్నాయని తెలిపారు. పంట అవశేషాలను కాల్చడం వల్ల వాయు కాలుష్యం, అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని పేర్కొంటూ గ్రామాల్లో టామ్‌టామ్ ద్వారా 15 నుంచి 30 రోజుల పాటు విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. అవగాహన తర్వాత కూడా కొయ్యలు కాల్చితే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ మే నెలాఖరు వరకు ధాన్యం కొనుగోళ్లు 100 శాతం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్లకు సూచించారు. హమాలీలు, రవాణా, గన్నీల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇప్పటికే రైతుల ఖాతాల్లో భారీ మొత్తంలో చెల్లింపులు జమయ్యాయని చెప్పారు.రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ సన్‌ఫ్లవర్ కొనుగోళ్లకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని, వెంటనే అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు.రాష్ట్ర లిసంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూలి జగిత్యాల జిల్లాలో వరి దిగుబడి అధికంగా ఉన్నందున అవసరమైతే రాజన్న సిరిసిల్ల జిల్లాలోని గోదాములను వినియోగించుకునేలా అనుమతులు ఇవ్వాలని కోరారు. జిల్లాలో లారీలు, హమాలీల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు విజయవంతంగా పూర్తి చేయాలని సూచించారు. లిజిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూలి జిల్లాలో 441 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఇప్పటివరకు 2.93 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు పూర్తయ్యిందని తెలిపారు. 36,626 మంది రైతుల ఖాతాల్లో రూ.498.90 కోట్లు జమయ్యాయని వెల్లడించారు.

## స్టేట్ మొదటి ర్యాంక్ సాధించిన ఋషిని ఘనంగా
# సన్మానించిన రెడ్డి సంఘాల ప్రతినిధులు

**- 40 ఏండ్ల చరిత్రలో మొదటి సారి మొదటి ర్యాంక్ సాధించిన విద్యార్థిని**




ఎల్బీనగర్, మే 24 (భారత శక్తి): కృషీ, పట్టుదల, లక్ష్యం ఉంటే విజయం తప్పదని నిరూపించిన రెడ్డి బిడ్డకు దక్కిన అరుదైన గౌరవం.40 ఏండ్ల ఎంసెట్ ( ఎప్ సెట్ ) చరిత్రలో మొదటి సారి మొదటి ర్యాంక్ సాధించి, ఎవరికీ రాని మార్కులను పొందిన రెడ్డి జాతీ ఆణిముత్యపు బిడ్డ ఋషి. మొన్న జరిగిన తెలంగాణ ఎప్ సెట్ లో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించిన మల్లాడి ఋషిని ఆదివారం చంపాపేటలోని తెలంగాణ రెడ్డి సంఘం కేంద్ర కార్యాలయం తెలంగాణ రెడ్డి సంఘం అడ్ హాక్ కమిటీ చైర్మన్ బద్దూరి వెంకటేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో మల్లాడి ఋషికి సన్మానపత్రంతో పాటు అమ్మాయిని శాలువాతో సత్కరించి, 1,43,000/- రూపాయల చెక్కులను రెడ్డి సంఘం తరపున పెద్దలందరు కలసి అందించడం జరిగింది. తదుపరి వివిధ జిల్లాల నుండి విచ్చేసిన రెడ్డి ప్రతినిధులు కూడా అమ్మాయిని సన్మానించి, అన్ని రకాలుగా తమ వంతు సహాయాన్ని అందిస్తామని తెలియజేశారు.ఈ కార్యక్రమానికి రెడ్డి సంఘం ఫౌండర్ నావల్ల సత్యనారాయణ రెడ్డి, బొక్క భూపాల్ రెడ్డి, పిట్ట శ్రీనివాస్ రెడ్డి, కొట్టం మధుసూదన్ రెడ్డి, ప్రసాద్ రెడ్డి, ఎలిమినేటి సుమన్ రెడ్డి, ఎన్నెపల్లి లింగారెడ్డి, సూదిని దేవేందర్ రెడ్డి, కిరణ్ కుమార్ రెడ్డి, ఇంద్రకరణ్ రెడ్డి, తిరుమల్ రెడ్డి, పిన్నింటి రణధీర్ రెడ్డి, అంపజ్వాల శ్రీధర్ రెడ్డి, సతీష్ రెడ్డి, గోపాల్ రెడ్డి, రెడ్డి గర్జన పాపిరెడ్డి, రవీందర్ రెడ్డి, శేఖర్ రెడ్డి, మణికొండ రెడ్డి ఫౌండేషన్ ప్రతినిధులు, పోచంపల్లి రెడ్డి సంఘం ప్రతినిధులు, గంగుల శ్రీలత రెడ్డి, దేవిరెడ్డి విజితా రెడ్డి, నూకల పద్మారెడ్డి, నందికొండ గీతారెడ్డి, సరితా రెడ్డి, సంధ్యారెడ్డి, లహరి రెడ్డి, లతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమమే ధ్యేయంగా
# కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుంది

**- చిలుక మధుర ఉపేందర్ రెడ్డి**



ఎల్బీనగర్, మే 24 (భారత శక్తి): మహేశ్వరం నియోజకవర్గం ఆర్కే పురం డివిజన్ పరిధిలోని కొత్తపేట వాసవి కాలనీలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుండి మంజూరైన కళ్యాణ లక్ష్మీ చెక్కును సంబంధిత లబ్ధిదారులు వాసవి కాలనీవాసులు మాలే శ్రీనివాస్ గుప్తాకి అందజేసిన రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు చిలుక మధుర ఉపేందర్ రెడ్డి. ఈ సందర్భంగా మధుర ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా కొంత ఇబ్బందులను ఎదుర్కొంటున్నప్పటికీ, రాష్ట్ర అభివృద్ధికి మరియు ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు ఎటువంటి ఆటంకాలు కలగకుండా ముందుకు తీసుకెళ్లడం జరుగుతుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన స్వల్ప కాలంలోనే అనేక ప్రజా ప్రయోజనకరమైన పనులను చేపట్టిందని వారు తెలిపారు. ముఖ్యంగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం (మహాలక్ష్మీ పథకం), గృహ వినియోగదారులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రైతులకు రెండు లక్షల రూపాయల రుణమాఫీ, ఆరోగ్యశ్రీ పథకం ద్వారా అందించే వైద్య సేవలను 10 లక్షల రూపాయల పెంపు, పేద ప్రజల కోసం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, రేషన్ షాపుల్లో సన్న బియ్యం పంపిణీ, సన్న వడ్లపై బోనస్ అందిస్తూ, కటింగ్ లేకుండా ధ్యానం కొనుగోలు అలాగే హైదరాబాద్ నగరాన్ని ప్రత్యేక ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి చేస్తూ ఎన్నో హామీలను ప్రభుత్వం అమలు చేస్తుందని వారు వివరించారు.ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు పెద్దవూర సైదులు, విప్లవ్ తదితరులు పాల్గొన్నారు.

## ముత్యపు చిప్పల కోసం వెళ్లిన కుటుంబం.

**- నదిలో గల్లంతు.. - ఏడుగురు మహిళలు సహా 8మంది మృతి**



కర్ణాటకలో ఘోర విషాథం జరిగింది. నదిలో ముత్యపు చిప్పల కోసం వెళ్లిన ఒకే కుటుంబానికి చెందినఎనిమిది మంది మరణించారు. ఇంకో ఇద్దరు గల్లంతైనట్లు తెలుస్తోంది. మృతుల్లో ఏడుగురు మహిళలు ఉన్నారు. ఈ ఘటన కర్ణాటక, ఉత్తర కన్నడ జిల్లా, భట్కాల్ తాలూకా, షిరాలి గ్రామ సమీపంలోని తట్టే హక్కాలు నదిలో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తట్టే హక్కాలు అనే మంచినీటి నదిలోకి 14 మంది సభ్యుల బృందం ఆదివారం ముత్యాల చిప్పల కోసం వెళ్లింది. ఈ సీజన్‌లో ఇక్కడ ముత్యపు చిప్పలు ఎక్కువగా దొరుకుతాయి. వీటిని సేకరించేందుకు స్థానికులు చాలా మంది నదిలోకి వెళ్తుంటారు. బాధితులు నదిలోకి వెళ్లి ముత్యాల కోసం వెతికే సమయానికి నీటి ప్రవాహం తక్కువగా ఉంది. అయితే, ఉన్నట్లుండి నదిలో నీటి ప్రవాహం పెరిగింది. వేగంగా అలలు వీచాయి. పెరిగిన నీటి ప్రవాహం, అలల ధాటికి ఒక్కొక్కరు కొట్టుకుపోయారు. ఇది గమనించిన మిగతావారు సాయం చేయడానికి ప్రయత్నించారు. నదిలోపలికి వెళ్లి వారిని బయటకు తెచ్చేందుకు ప్రయత్నించగా, వారిలో ఇంకొందరు కూడా కొట్టుకుపోయారు. నీటి లోతును, వేగాన్ని సరిగ్గా అంచనా వేయకపోవడం వల్ల కొందరు, ఇతరుల్ని రక్షించేందుకు ప్రయత్నించి మరికొందరు నీటిలో గల్లంతయ్యారు. ఘటన సమాచారం అందుకున్న పోలీసులు, రక్షక బృందాలు సహాయక చర్యలు ప్రారంభించారు. ఈ క్రమంలో ఎనిమిది మృతదేహాల్ని గుర్తించారు. మరో ఇద్దరు గల్లంతయ్యారు. మృతుల్లో ఏడుగురు మహిళలున్నారు. మృతులంతా ఒకే కుటుంబానికి చెందిన వారు. ఇంకా సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. నదీ పరివాహక ప్రాంతంలో వర్షం పడటం వల్ల నీటి ప్రవాహం పెరిగి ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. బాధితుల్లో ఎంతమందికి ఈత వచ్చు అనే విషయంపై కూడా అధికారులు ఆరా తీస్తున్నారు.

## విద్యుత్ వినియోగదారులందరీపై ఆర్డీఎస్ఎస్ పిడుగు : మాజీ మంత్రి జగదీశ్వర్‌రెడ్డి




**హైదరాబాద్ :** రాష్ట్రంలోని విద్యుత్ వినియోగదారులందరీపై పెను భారం పడే పథకానికి ప్రభుత్వం అంగీకరించడం దారుణమని మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారుకేబినెట్‌లో ఆర్డీఎస్ఎం పథకానికి రేవంత్ సర్కార్ ఆమోదం తెలిపిందని తెలిపారు. ఆర్డీఎస్ఎస్ కేంద్ర పథకాన్ని తన గొంతులో ప్రాణం ఉండగా ఒప్పుకునేది లేదని గతంలో ముఖ్యమంత్రిగా పనిచేసిన కేసీఆర్ అడ్డుకున్నాడని తెలిపారు. కేంద్రం ఎన్ని ఒత్తిళ్లు తీసుకొచ్చిన అంగీకరించలేదని వెల్లడించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనే ఆర్‌డీఎస్ఎస్ కింద ఇళ్లకు, వ్యవసాయ మోటార్లకు పెట్టిన స్మార్ట్ మీటర్లను అక్కడి ప్రజలు పీకేసి తగలబెడుతున్నారని పేర్కొన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం అదే స్మార్ట్ మీటర్లను తెచ్చి తెలంగాణ ప్రజల నెత్తిన పెట్టాలని కేబినెట్ ఆమోదం తెలిపిందని ఆరోపించారు. ప్రస్తుతం ట్రాన్స్‌ఫార్మర్ల వద్దనే స్మార్ట్ మీటర్లు పెడుతామని అంటూనే ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద పెట్టే అవకాశముందని వివరించారు. స్థానిక ప్రయాణ మార్గదర్శి పేదలను ఉద్దరించేందుకు ఆర్డీఎస్ఎస్ కాదని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో మంచినీళ్ల నల్లాలకు కూడా స్మార్ట్ మీటర్లు పెడుతారని తెలిపారు. విద్యుత్ సంస్థను ప్రైవేటీకరించడానికే కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తుందని తెలిపారు. ఆర్డీఎస్ఎస్ వల్ల రైతులపై, వినియోగదారులపై పెనుభారం పడుతుందని అన్నారు. కాంగ్రెస్ ఒత్తిళ్లతో యూపీ ప్రభుత్వం ఆర్డీఎస్ఎస్‌ను ఉపసంహరించుకోగా అదే కాంగ్రెస్ తెలంగాణలో అమలుకు ఎందుకు ప్రయత్నిస్తున్నారని ప్రశ్నించారు. ఈ విషయంలో రాహుల్‌గాంధీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆర్డీఎస్ఎస్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, రైతులు, వినియోగదారులంతా సంఘటితమై ప్రభుత్వంపై ఆందోళనలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

## మరణించిన రైతులకు రూ.కోటి ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి


**-మాజీ మంత్రి జీవన్ రెడ్డి డిమాండ్**




హైదరాబాద్ : ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద మరణించిన రైతుల కుటుంబాలకు ప్రభుత్వం వెంటనే రూ. కోటి ఎక్స్‌గ్రేషియాను అందజేయాలని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి టీ.జీవన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అవలంభిస్తున్న నిర్లక్ష్య వైఖరీతోనే మరికొందరు రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం ధాన్యం కొనుగోలులో రైతులు పడుతున్న ఇబ్బందులను నిన్నటి కేబినెట్‌లో ఎందుకు చర్చించలేదని ప్రశ్నించారు. ధాన్యం కొనుగోలులో రైతులు క్వింటాల్‌కు రూ. 250 నష్టపోతున్నారని, దీనిని ఆర్‌అండ్‌ఆర్ ట్యాక్స్‌గా పరిగణించాల్సి వస్తుందని పేర్కొన్నారు .స్థానిక ప్రయాణ మార్గదర్శికాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత రైతులను ఘోరంగా మోసం చేస్తుందని ఆరోపించారు. రైతు డిక్లరేషన్ పేరుతో రాహుల్ గాంధీ రైతులను మోసం చేశాడని విమర్శించారు. కేసీఆర్ హయాంలో రైతులకు రైతు బంధు పంట పంటకు వస్తుండేదని అన్నారు. కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఏనాడు కరీంనగర్ రాలేదు , ధాన్యం కొనుగోలు పై రివ్యూ చేయలేదని ఆరోపించారు. అందాల పోటీలు, ఫుట్‌బాల్ పోటీల నిర్వహణపై పెట్టిన శ్రద్ధ రేవంత్ రెడ్డి రైతాంగ సమస్యలపై ఒక్క రివ్యూ చేయలేదని మండిపడ్డారు. ధాన్యం ఇంకా 50 శాతం కల్లాలోనే ఉంది. అకాల వర్షాలకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మొక్క జొన్న కొనుగోలులో పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని తెలిపారు. ఫ్యూచర్ సిటీపై హరీష్ రావు చేసిన వ్యాఖ్యలతో మంత్రి శ్రీధర్ బాబు ఉలిక్కి పడుతున్నాడని పేర్కొన్నారు. ఫార్మా సిటీ భూములను రేవంత్ రెడ్డి అనుచరులకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. ధాన్యం కొనుగోలు విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి స్పష్టత లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందో రాదో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌కు అర్థమవుతుందని అన్నారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి పోవాలా. కేసీఆర్ రావాల అనే నినాదం ప్రజల నుంచి మొదలైందన్నారు. మే 31వ తేదీ లోపు రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు చేయలేక పోతే జూన్ 2 న తెలంగాణ ఆవిర్భావ వేడుకల రోజున రేవంత్ రెడ్డి జెండా ఆవిష్కరించే హక్కు లేదని స్పష్టం చేశారు.

## సంగారెడ్డి జిల్లాలో దారుణం..

**- భర్తను చంపి జేసీబీతో గొయ్యి తీసి పూడ్చిపెట్టిన భార్య**



హైదరాబాద్ : సంగారెడ్డి జిల్లాలో దారుణం చోటు చేసుకుంది. అక్రమ సంబంధానికి అడ్డు వస్తున్నాడని భర్తను ప్రయుడితో కలిసి హతమార్చింది. ఈ విషాదకర సంఘటన నారాయణఖేడ్ మండలం గంగాపూర్‌లో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఉన్నాయి. గ్రామానికి చెందిన ముత్యం రెడ్డి భార్య వివాహేతర సంబంధానికి అడ్డువస్తాడని భావించి ప్రియుడు చింటుతో కలిసి అంతమొందించాలని భావించింది. అందులో భాగంగా ప్రియుడు, ఆమె కలిసి భర్తను చంపి జేసీబీతో గొయ్యి తీయించి మృతదేహాన్ని పూడ్చిపెట్టింది. అనంతరం భర్త కనిపించడం లేదంటూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి విచారణ చేపట్టిన పోలీసులు తమదైన శైలిలో విచారించడంతో 9 రోజుల తర్వాత నేరాన్ని ఒప్పుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేశారు.

## యాదగిరిగుట్టపై యాదాద్రి పరిరక్షణ కమిటీ సభ్యులు ఆందోళన



యాదగిరిగుట్ట, మే24 : యాదగిరిగుట్టపై వర్తక సంఘాన్ని రద్దు చేయాలంటూ ఆదివారం యాదాద్రి పరిరక్షణ కమిటీ ఆందోళన చేపట్టింది. తహసీల్దార్ కార్యాలయం నుంచి స్వామి వారి వైకుంఠ ద్వారం వరకు ర్యాలీ నిర్వహించారు. దేవస్థాన అధికారులు వర్తక సంఘాన్ని రద్దు చేసి టెండర్లకు పిలవాలని డిమాండ్ చేశారు. పాత బస్ స్టాండ్ వద్ద రోడ్డు పై బైఠాయించి రాస్తా రోకో చేపట్టారు. ఈ నెల 31 వ తేదీన వర్తక సంఘం గడువు ముగిసిపోతుందని, వెంటనే కొండపైన దుకాణాలకు టెండర్లు వేయాలని డిమాండ్ చేశారు. టెండర్లు వేసే వరకు తమ ఆందోళన కొనసాగుతుందని హెచ్చరించారు. సెలవు దినం కావడంతో భారీగా భక్తుల వాహనాలు నిలిచిపోయాయి. ఆందోళన చేస్తున్న సభ్యులను పోలీసులు చెదరగొట్టారు.

## గీత కార్మికులకు నష్టపరిహారం చెల్లించాలి కొప్పుల



పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రంలో తాటి వనాలు కాలిపోయిన నేపథ్యంలో గీత కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ డిమాండ్ చేశారు. శనివారం ధర్మారం శివారులోని సలాంద్రి సమీపాన ఉన్న తాటి వనాలు అగ్ని ప్రమాదంలో ఆహుతయ్యాయి. విషయం తెలుసుకున్న ఈశ్వర్ ఆదివారం కాలిన తాటి వనాలను పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11 ఎకరాలలోని తాటివనాలు అగ్ని ప్రమాదంలో కాలిపోవడం బాధాకరమన్నారు. తాటి వనాలు కాలిపోవడంతోస్థానిక గీత కార్మికులకు తీవ్ర నష్టం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గీత కార్మికులకు తగిన పరిహారం అందజేసి కాలిపోయిన తాటి వనాల స్థానంలో కొత్త వనాలను పెంచాలని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో గీత కార్మికులకు అన్ని విధాలుగా అండగా ఉందని మాజీ సీఎం కేసీఆర్ 5 కోట్ల తాటివనాలను పెంచారని ఈశ్వర్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఈశ్వర్ వెంట నంది మేడారం ప్యాక్స్ చైర్మన్ ముత్యాల బలరాం రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్లు కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, గుర్రం మోహన్ రెడ్డి, పార్టీ ధర్మారం పట్టణ తాజా మాజీ అధ్యక్షుడు తుమ్మల రాంబాబు, నాడెం శ్రీనివాస్, గాజుల రాజు, ఆవుల లత, కాంపల్లి అపర్ణ, గుజ్జేటి కనక లక్ష్మి, మార్క సంధ్య తదితరులు పాల్గొన్నారు.

## టీటీడీకి రూ.20 లక్షలు విరాళం



**తిరుమల :** అనాథ రక్షకుడు, ఆపద్బాంధవుడు కొలువుదీరిన తిరుమలవేంకటేశ్వరస్వామికి దాతల విరాళాలుకొనసాగుతున్నాయి. గుంటూరుకు చెందిన మాదాల శేషగిరిరావు అనే భక్తుడు ఆదివారం టీటీడీ వేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్టుకు రూ.10,01,116 విరాళంగా అందించారు. అదేవిధంగా అదే జిల్లాకు చెందిన వడ్లమూడి మిత్రేష్ అనే భక్తుడు శ్రీ వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు రూ.10,01,111 విరాళంగా అందించారు. ఈ మేరకు దాతలు శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో ఆలయ డిప్యూటీ ఈవోశ్రీ లోకనాథంకు విరాళం డీడీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు నన్నపనేని సదాశివరావు పాల్గొన్నారు.

## వెన్నుపోటు పొడిచిన కాంగ్రెస్ పార్టీని ఎప్పటికి నమ్మొద్దు : ఉదయనిధి స్టాలిన్



చెన్నై : వీసీకే అధినేత, సీఎం విజయ్ మైనారిటీ ప్రభుత్వానికి కాంగ్రెస్ మద్దతు ఇవ్వడంపై డీఎంకే నాయకుడు, యువజన విభాగం కార్యదర్శి ఉదయనిధి స్టాలిన్ ఆ పార్టీపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా ఉదయనిధి మాట్లాడుతూ.. డీఎంకే కార్యకర్తల మద్దతు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ నాయకత్వంతో సీట్లు గెలుచుకున్నప్పటికీ కాంగ్రెస్ నాయకులలో కనీస కృతజ్ఞత, మర్యాద కూడా లేదని మండిపడ్డారు. అధికారం కోసం పార్టీని నమ్మించి వెన్నుపోటు పొడిచే కాంగ్రెస్‌ను డీఎంకే క్యాడర్ ఎప్పటికీ నమ్మకూడదని, వారిని దరిదాపుల్లోకి కూడా రానివ్వొద్దని పిలుపునిచ్చారు. ఐకాంగ్రెస్ ఐదుగురు ఎమ్మెల్యేలను గెలవడానికి డీఎంకే కార్యకర్తలే కారణమన్నారు. ఎంకే స్టాలిన్ ముఖ్యమంత్రిగా ఉండాలని ప్రజలు కోరుకున్నందుకే వారికి ఓటు వేశారు. కానీ ఈరోజు, కొన్ని పదవుల కోసం, మాకు సమాచారం ఇవ్వకుండా వారు పారిపోయారు. తమిళనాడు ప్రజలు వారికి అతి త్వరలోనే తగిన గుణపాఠం నేర్పిస్తారన్నారు. భారతదేశవ్యాప్తంగా బీజేపీ ఎదుగుదలకు కాంగ్రెస్సే కారణమని కూడా ఆయన ఆరోపించారు. ఇన్నాళ్లు మోదీ, అమిషా వళ్ల కాంగ్రెస్ ఓడిపోయింది అనుకున్నామని కానీ, నేటి పరిస్థితులు చూస్తుంటే కేవలం కాంగ్రెస్ మోసపూరిత విధానాల వల్లే దేశంలో బీజేపీ గెలుస్తుందన్నారు. గతంలో కాంగ్రెస్ గెలిచిన సీట్లు కూడా కేవలం స్టాలిన్ పెట్టిన భిక్షేనని గుర్తు చేశారు. జెన్ జెడ్ యూత్‌కు రాజకీయంగా అవగాహన కల్పించాలన్నారు. అలాగే తొలిసారి ఓటు వేసిన వారికి కూడా రాజకీయ చైతన్యం కల్పించాలని డీఎంకే యువజన విభాగం నేతలకు సూచించారు.

## తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలి



**వనపర్తి :** ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే రైతులు ఇబ్బంది పడుతున్నారని, తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరతో కొనుగోలు చేయాలని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి డిమాండ్ చేశారు. వనపర్తి మార్కెట్ యార్డులో వర్షాలకు తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. రైతులకు సంఘీభావం తెలిపి న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రోజుల తరబడి కల్లాల వద్ద రైతులు పడిగాపులు కాస్తున్నా కాంటా పెట్టడం లేదని మండిపడ్డారు. కండ్లముందే ధాన్యం నీటి పాలవుతుంటే రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హతలేని ట్రాన్‌పోర్ట్ ఏజెన్సీలకు కాంటాక్టులు ఇవ్వడం వల్ల రైతులకు ఈ దుస్థితి దాపురించిందని ఆరోపించారు. ప్రజల సమస్యలపై ప్రశ్నించే గొంతుకలపై కేసులు పెట్టడం చేతనైతది కానీ శ్రీధర్ రెడ్డి హత్య జరిగి రెండేండ్లు అయిన నేటికి హంతకులను పట్టుకోకపోవడం ప్రభుత్వ చేతగానితనానికి నిదర్శనం అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మొత్తం ధాన్యం కొనుగోలు చేశాం అని బాధ్యతారహితంగా ప్రకటనలు చేశార్నారు. కేసీఆర్ హయాంలో తడిసిన ధాన్యాన్ని ప్రతి గింజా కొని రైతులను ఆదుకున్నారురని గుర్తు చేశారు. 5లక్షల 42వేల హెక్టార్లలో ధాన్యం పండింది. కానీ కొనే నాథుడేలేడన్నారు. సివిల్ సప్లైస్ అధికారి స్టీఫెన్ రవీంద్ర అర్హతలేని ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కో మిల్లర్ మంత్రి కుమారునికి రేంజ్ రోవర్ కార్ బహుమతిగా ఇచ్చారని, దీనిపై విచారణ చేపట్టాలన్నారు. పక్షపాతం చూపకుండా అక్రమాలకు పాల్పడుతున్న రైస్ మిల్లులపై చర్యలు తీసుకోవాలన్నారు. కోటి నలభై లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం మార్కెట్ కు వస్తుంది. 45లక్షల మక్కజొన్న మార్కెట్ కు వచ్చింది. రైతులను గాలికి వదిలేసిన చరిత్ర రేవంత్ రెడ్డిది అని మండిపడ్డారు. అక్రమార్కులకు ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. 90శాతం ధాన్యం ఆరు పెద్ద మిల్లులకు పోతుందన్నారు. 90శాతం పాడి ఆరు పెద్ద మిల్లులకు పోతుంది విచారణ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వనపర్తి జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, మార్కెట్ మాజీ చైర్మన్లు లక్ష్మారెడ్డి, పలుస రమేష్ గౌడ్, మార్క్ ఫెడ్ డైరెక్టర్ విజయ్ కుమార్, మాజీ వైస్ చైర్మన్ కర్రెస్వామి, మండల పార్టీ మాజీ అధ్యక్షులు మాణిక్యం, వనం రాములు, జోహెబ్ హుస్సేన్, మహేశ్వర్ రెడ్డి, చిట్యాల రాము, సయ్యద్ , జెమిల్, బాగ్యరాజ్ తదితరులు ఉన్నారు.

## సంగారెడ్డి జిల్లాలో విషాదం.. రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి




హైదరాబాద్ : సంగారెడ్డి జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. వివరాల్లోకి వెళ్తే.. బైక్ అదుపు తప్పి చెట్టును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో విక్రమ్(27), అనిల్(30) అక్కడికక్కడే మృతి చెందారు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# అబ్బాయిలూ.. 'ప్రెట్టీ ఈజ్ నాట్ ఎవ్రీథింగ్'



అందమైన పింక్ గులాబీతో పోలుస్తాం. 'అందాన్నే చూడకండి' అంటూ పింక్‌కి బ్లాక్‌ని జోడించి బ్లాక్‌పింక్ అని తమ బ్యాండ్‌కి పేరు పెట్టుకున్నారు. బ్లాక్‌పింక్ అని కాకుండా, పింక్‌బ్లాక్ అంటే మళ్లీ అది బ్లాక్‌కి పింక్ అందాన్ని అంటు కట్టినట్లు. అందుకే బ్లాక్‌ని ముందుకు తీసుకున్నారు. తెలివైన అమ్మాయిలే.'లవ్‌సిక్ గర్ల్స్' ఐదో ట్రాక్. అమ్మాయిల్ని ప్రేమ సతాయింపులు ఎంత జబ్బున పడేస్తాయో చూడండి. 'ప్రేమ మనల్ని వలపన్ని కిటీకీలు లేని గదిలో బంధించింది. ప్రతిసారీ బాధిస్తోంది. గుండెలు పగిలి ఏడ్చేలా చేస్తోంది. చివరికి ఏడుపు కూడా రానంతగా మొద్దుబారుతున్నాం..” అని పాడతారు. 'బెట్ యు వాన్నా', 'క్రేజీ ఓవర్ యు', 'లవ్ టు హేట్ మీ', 'యూ నెవర్ నో' మిగతా నాలుగు ట్రాక్స్.

మనసును తాకండి. అందమే అంతా కాదు. అబ్బాయిలూ.. 'ప్రెట్టీ ఈజ్ నాట్ ఎవ్రీథింగ్'. ఆశల్ని తుంచేయకండి. నవ్వుల్ని ఆర్పేయకండి. అమ్మాయిల్ని.. జబ్బున పడేయకండి. కొత్త కొరియన్ 'పాప్'! గర్ల్ బ్యాండ్ పాడుతోంది. ప్రపంచం ఇష్టంగా వింటోంది. “నీ కళ్ల ముందే కూలిపోతున్నా.. పాతాళంలోకి జారిపోతున్నా.. అయినా రెండు చేతులతో నా ఆశను పట్టుకుని పైకి ఎగబాకుతున్నా.”పాడుతున్నారు 'బ్లాక్‌పింక్' గర్ల్స్. “నన్ను చూడు, నీకు ఏమనిపిస్తోంది?” అని.. కొనసాగింపుగా అడుగుతున్నారు జెన్నీ, జిసూ, లిసా, రోజ్. ఎవరిని అడుగుతున్నారు! ఆడపిల్లకు ఆశలు కల్పించి పారిపోయే మగధీరుడొకడు ఉంటాడు కదా, అతడిని.కొరియన్ గర్ల్ పాప్ బ్యాండ్ 'బ్లాక్‌పింక్' కొత్త ఆల్బమ్ 'ది అల్బమ్' లోని ఎనిమిది పాటల్లో ఒకటైన 'హౌ యు లైక్ దట్' లోని కూలిన ఆశల గీతమిది. అక్టోబర్ 2న ఈ నలుగురమ్మాయిల బ్యాండ్ విడుదల చేసిన 'ది ఆల్బమ్' అక్టోబర్ 26 నాటికి ప్రపంచవ్యాప్తంగా 10 లక్షల 20 వేల కాపీలకు పైగా అమ్ముడై చరిత్ర సృష్టించింది. దక్షిణ కొరియా అంటే ఇంతవరకు ఆ ఏడుగురు అబ్బాయిల బి.టి.ఎస్. బాయ్ బ్యాండ్ మాత్రమే. వారే పాప్ హీరోలు, వారే పాప్ కింగులు. ఇప్పుడీ గర్ల్ బ్యాండ్ 'బ్లాక్‌పింక్' ధాటికి ఆ ఏడుగురు 2013 నుంచీ నిర్మించుకుంటూ వస్తున్న 'పాప్' లోక దుర్భేద్య మహా సామ్రాజ్యం బీటలు వారబోతున్న దృశ్యం లీలగా ఆవిష్కృతం కాబోతున్నట్లే ఉంది. బ్లాక్‌పింక్ వరుసగా మూడో వారం 'బిల్‌బోర్డ్ 200' లిస్టులో తొలి పదిస్థానాలలో ఉంటూ వస్తోంది! ఆల్బమ్'లోని రెండో ట్రాక్ 'ది ఐస్ క్రీమ్'! 'దాహంగా ఉన్నట్లున్నావు.. కొంచెం దగ్గరకు రా..' అని కోన్‌ల లా మూతిని తెరిచి మూడు నిముషాల మూడు సెకన్లలో అబ్బాయిల్ని ఫ్రీజ్ చేసేసే బ్లాక్‌పింక్ గర్ల్స్.. మూడో



ట్రాక్ 'ప్రెట్టీ శావేజ్'లో 'బాయ్స్.. మేం వైలెంట్‌గానే ఉంటాం. తట్టుకోగలిగితే ఉండండి' అని కొంచెం రూడ్‌గానే చెబుతారు. 'రూడ్ కాదు, అందరికన్నా రూడ్' అని ఇప్పటికే, ఈ నాలుగేళ్లలో ఈ నలుగురు పిల్లలకు పేరొచ్చేసింది! 2016లో ప్రారంభించారు బ్లాక్‌పింక్ పాప్ బ్యాండ్‌ని. ఈ ఎనిమిది ట్రాక్‌లకు ముందు ఐదు సింగిల్స్ ఉన్నాయి.

అసలు వాటితోనే వాళ్లేమిటో చూపించారు.ఆ ఎనర్జీని తట్టుకోవాలంటే మళ్లీ వాళ్ల దగ్గరికే వెళ్లాలి 'ది ఐస్ క్రీమ్' కోసం! మొత్తం 174 సౌత్ కొరియన్ గర్ల్ గ్రూప్స్ ఉన్నాయి. వాటిల్లో పది లక్షల ఆల్బమ్ కాపీలు అమ్ముడై రికార్డు నెలకొల్పిన తొలి బ్యాండ్ 'బ్లాక్‌పింక్'! ఏమిటి బ్లాక్‌పింక్ అంటే?! ఈ అమ్మాయిలు కల్పించిన అర్థం.. 'అందమే అంతా కాదు' అని! అమ్మాయిల్ని 'ఎక్కడికెళదామో చెప్పు, అన్నీ సర్దుకుని నేనే నీ దగ్గరకు వచ్చేస్తాను..' (బెట్ యు వాన్నా), 'నువ్వంటే నాకు పిచ్చి. నీ మనసులోనూ నేను ఉన్నానని తెలుసు. అయినా కానీ నువ్వు గీసుకున్న గీతను దాటి రానులే' (క్రేజీ ఓవర్ యు), 'నెగిటివ్ డేస్, నెగిటివ్ నైట్స్.బేబీ యు ఆర్ వేస్టింగ్ ఆల్ యువర్ టైమ్' (లవ్ టు హేట్ మీ), 'నేను ప్రకాశవంతంగా నవ్వుదామని ప్రయత్నించిన రోజు.. చీకటి మరింతగా గాఢమైన నన్ను మింగేయాలని చూస్తుంటుంది ఎందుకనో..' (యూ నెవర్ నో).. అని జెన్నీ, జిసూ, లిసా, రోజ్.. అమ్మాయిలు ఎంతగా ప్రేమిస్తారో, ఆ ప్రేమ వల్ల అంతగా హర్ట్ అవుతూ ఉంటారని 'ది అల్బమ్' ట్రాకులలో పాడతారు. 'ప్రెట్టీ ఈజ్ నాట్ ఎవ్రీథింగ్' అని చెబుతారు. అందుకే 'బ్లాక్‌పింక్' ఇంతగా హిట్ అయినట్లుంది

# మొలకలు తింటే ఇమ్యునిటీ తొందరగా పెరుగుతుంది

## - కంటి చూపు సమస్యలకూ మంచిదే




రాత్రి నానబెట్టి తెల్లారాక మూట కట్టి ఉంచాలి. రెండో రోజు తెరిచి చూస్తే మొలకలు వస్తాయి. వీటినిద్దున్నే పెసలు, శెనగలు వంటి మొలకెత్తిన గింజలు తినడం వల్ల చాలా ఉపయోగాలున్నాయి. మొలకెత్తిన గింజల్లో ప్రొటీన్, మెగ్నీషియం, ఫాస్ఫరస్, మాంగనీస్, ఫోలేట్, విటమిన్- సి, విటమిన్- కె సరిపడినన్ని ఉంటాయి. మన బాడీకి చాలా అవసరం అయిన యాంటీ ఆక్సిడెంట్లు, అమైనో యాసిడ్స్ ఉంటాయి.పొద్దున్నే తినడం వల్ల ఎక్కువ ఆకలి వేయదు. దీంతో మధ్యాహ్నం భోజనం తక్కువగా తింటాం. బరువు తగ్గాలనుకున్నవాళ్లకి ఈ మొలకల డైట్ బాగా ఉపయోగ పడుతుంది. డైజెషన్ సమస్యలున్నవాళ్లకిమొలకలు మెడిసిన్‌లా పనిచేస్తాయి. ఇందులో ఇనుము, క్యాల్షియం, జింక్ వంటివి పుష్కలంగా ఉంటాయి. వీటిలో ఉండే ఒమెగా-3 ఫ్యాటీ యాసిడ్లు రక్తనాళాల్లో చెడు కొలెస్ట్రాల్‌ని తగ్గిస్తాయి. డయాబెటిస్ తో బాధపడుతున్న వాళ్లకి మంచి ఫుడ్. మొలకలు రెగ్యులర్ గా తినటం వల్ల మెదడుకు బ్లడ్ సర్క్యులేషన్ సరిగా ఉంటుంది. డిప్రెషన్ లో ఉన్న వాళ్లు మొలకలను రెగ్యులర్ ఫుడ్ మెనులో చేర్చుకుంటే మంచిది.మొలకల్లో ఇమ్యూనిటీ పవర్ ని పెంచే గుణాలున్నాయి, మొలకల్లోని విటమిన్ సి తెల్ల రక్తకణాలను యాక్టివ్ గా చేస్తుంది.విటమిన్ ఎ కంటిచూపును బాగుచేస్తుంది.కంటి సమస్యలకు మొలకలు తింటే దివ్య ఔషధంలా ఉపయోగపడుతుంది.పచ్చిగా తింటే గ్యాస్ ట్రబుల్ వస్తుందని.. తేన్పులు వస్తున్నాయనుకునే వారు మొలకలను ఉడకబెట్టుకుని కొద్ది కొద్దిగా తినడం బెటర్.ఒక్క మాటలో చెప్పాలంటే మటన్..చేపలు తిన్నంత బలం వస్తుంది.

# మీకు తగ్గ బైకేనా?




అందరికీ బండి అవసరమే! కానీ కొనేటప్పుడు కొన్ని విషయాలు పరిగణనలోకి తీసుకోవాలి. కమ్యూటర్ బైక్‌తో లాంగ్‌టూర్‌కి వెళ్లాలంటే కుదురుతుందా? ఆఫ్‌రోడ్డు కోసమే తయారైన వాటిని తారురోడ్డుపై చక్కర్లు కొట్టిస్తే లాభమేంటి? అందుకే.. టూవీలర్ కొనేముందే ఇవి గమనించాలి.

**ఏ రకం?:** కమ్యూటర్లు, క్రూజర్లు, స్పోర్ట్ బైక్‌లు, టూరర్‌లు, స్ట్రీట్ బైక్‌లంటూ విపణిలో రకరకాలైనవి అందుబాటులో ఉన్నాయి. బండి కొనేముందే వాటి పనితీరు ఎలా ఉంటుందో తెలుసుకోవాలి. ఎవరికి ఏవి నప్పుతాయో సమాచారం సేకరించాలి.

**వాడుకునే సమయం:** కొందరు రోజులో ఎక్కువదూరం ప్రయాణిస్తారు. ఇంకొందరు వారానికోసారైనా బండి బయటికి తీయరు. ఇలాంటప్పుడు వాడే సమయానికి అనుగుణంగా ఎంపిక ఉండాలి. అత్యధిక దూరం ప్రయాణించేవారు ఎక్కువ మైలేజీ ఇచ్చే బండికి ఓటేయాలి. తక్కువ తిరిగేవారు మంచి ఫీచర్లు, సౌకర్యాలు చూడాలి. నిర్వహణ ఖర్చులూ లెక్కేయాలి.లి ఇంజిన్ ఏది?: 100సీసీ నుంచి 500సీసీ ద్విచక్రవాహనాలు అందుబాటులో ఉన్నాయి. మంచి పికప్ కావాలంటే ఎక్కువ సీసీవి ఎంచుకోవాలి. మైలేజీ ముఖ్యం అనుకుంటే తక్కువ వాటితో వెళ్లిపోవచ్చు. **శరీరానికి తగ్గట్టు:** ఆరడుగుల ఆజానుబాహుడు వంద సీసీ కమ్యూటర్ బైక్ మీద కూర్చుంటే బాగుండదు. బక్కపల్చని కుర్రాడు భారీ టూవీలర్ నడిపితే నప్పదు. సౌకర్యవంతంగానూ ఉండవు. బండి కొనేటప్పుడు పర్సనాలిటీకి తగ్గవి ఎంచుకోవడం ముఖ్యం. **కొత్తదా, పాతదా?:** ద్విచక్రవాహనం కొనడం ఎవరికైనా మరపురాని విషయమే. కొత్తది కొనాలా? పాతది తీసుకోవాలా? అనేదే మొదటి సందేహం. బ్రాండ్ న్యూ అయితే రైడింగ్ సాఫీగా సాగిపోతుంది. చాలా ప్లస్‌పాయింట్లు ఉంటాయి. ధర కూడా ఎక్కువే. భరించగలిగే స్తోమత లేకపోతే మంచి కండిషన్‌లో ఉన్న పాతది ఎంపిక చేసుకోవాలి.లి సర్వీస్ సంగతి: కొన్ని బ్రాండ్లు స్టైలిష్‌గా ఉంటాయి. రైడింగ్ బాగుంటుంది. సర్వీసింగ్ సెంటర్లు తక్కువ. విడిభాగాలు మార్కెట్లో అంత

# ఇవి తింటున్నారా? అయితే మీ లివర్ జాగ్రత్త!




'తినేది మీరు.. తాగేది మీరు'.. 'అంత్య నిష్ఠూరం కంటే ఆది నిష్ఠూరం మేలు' ఇవి సామెతలు మాత్రమే కాదు.. అక్షర సత్యాలు. సరైన ఆహార నియమాలు పాటించకపోతే తర్వాత చాలా బాధ పడాల్సి ఉంటుంది. ఫ్యాటీ లివర్ వంటి అనారోగ్య సమస్యలు వస్తుంటాయి. కాలేయంలో కొవ్వు శాతం పెరిగిపోవడాన్ని ఫ్యాటీ లివర్ అంటారు. ఫలితంగా కాలేయం పనితీరు మందగిస్తుంది. కొన్ని ఆహార పదార్థాలకు దూరంగా ఉంటే దీనిని నియంత్రించవచ్చు.



**మద్యం** : ఫ్యాటీ లివర్, కాలేయ సంబంధిత వ్యాధులకు ప్రధాన కారణం మద్యం సేవించడం. ఎక్కువ మోతాదులో మద్యం తీసుకోవడం వల్ల కాలేయంలో కొవ్వు పేరుకుపోతుంది. ఇది తీవ్రమైన దుష్పరిణామాలకు దారితీస్తుంది. మితంగా మద్యం సేవించడం మంచిదేనని కొందరు చెప్పినా, దానికి దూరంగా ఉండటమే ఉత్తమం.



**తీపి పదార్థాలు** : చక్కెరతో తయారు చేసిన పిండి పదార్థాలను ఎక్కువగా తింటే ఊబకాయం వస్తుంది. అలాగే రక్తంలో చక్కెర శాతం ఎక్కువైతే శరీరం, కాలేయంలో కొవ్వు శాతం పెరిగిపోతుంది. భయంకరమైన డయాబెటిస్ బారిన పడతారు. మీ తీపి కోరికలను పండ్ల రూపంలో ఆస్వాదించండి. చక్కెరతో తయారు చేసే పదార్థాలకు వీలైనంత దూరంగా ఉండండి.

**వేయించిన పదార్థాలు** : మసాలాలతో వేయించిన



ఆహారంలో కొవ్వు, కేలరీలు అధికంగా ఉంటాయి. వీటిని ఎక్కువగా తీసుకుంటే శరీరంలో కొవ్వు పెరిగిపోతుంది. వీటికి ప్రత్యామ్నాయంగా కాల్చిన, ఉడకబెట్టిన ఆహారాన్ని తీసుకోవడం మంచిది.

**ఉప్పు** : ఉప్పును ఎక్కువగా వినియోగిస్తే రక్తపోటు



పెరగడంతో పాటు, కాలేయం పనితీరు దెబ్బతింటుంది. రోజుకు 1500 మిల్లీ గ్రాములకు మించి ఉప్పు తీసుకోవడంతో వృద్ధులకు రక్తపోటు, కాలేయం, గుండె సంబంధిత సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. మొదట్లో ఉప్పును తక్కువగా వాడటం ఇబ్బందికరంగా ఉన్నా.. తరువాత అలవాటైపోతుంది.

**పాలిష్ బియ్యం** : నాణ్యంగా కనపడటానికి చాలామంది వ్యాపారులు ముడి బియ్యాన్ని అనేక సార్లు



పాలిష్ చేస్తారు. దీంతో బియ్యంపైన ఉండే ఫైబర్ పోతుంది. ఇటువంటి బియ్యంతో తయారు చేసిన ఆహారాన్ని తీసుకోవడం మంచిది కాదు. ఇది జీర్ణమైనప్పుడు రక్తంలో చక్కెర లవణాలు అమాంతం పెరిగిపోతాయి.

**సోడా, పళ్ల రసాలు** : సోడా, పళ్ల రసాలలో శుద్ధి చేసిన చక్కెర, ఫ్రక్టోజ్ ఉండవు. ఇవి కాలేయ సంబంధిత వ్యాధులకు కారణమవుతాయి. దీనికి ప్రత్యామ్నాయంగా కూరగాయలు, పండ్లను తీసుకోవడం మంచిది. అలాగే వంద శాతం పండ్లు, స్వచ్ఛమైన నీటితో తయారు చేసిన రసాలను తీసుకోవచ్చు. నిమ్మరసం ఆరోగ్యానికి మంచిది.





**ఫాస్ట్ ఫుడ్** : వీటిని త్వరగా తయారు చేసుకోవచ్చు. మరింత రుచిగా కూడా ఉంటాయి. అయినప్పటికీ వీటి కారణంగా శరీరంలో కేలరీలు, కొవ్వు శాతం పెరిగిపోతుంది. గుండె, కాలేయ సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం ఉంది.

# రాజ్మా రైస్



**కావాల్సిన పదార్థాలు :** రాజ్మా గింజలు : ఒక కప్పు, బియ్యం : మూడు కప్పులు, తరిగిన క్యాబేజీ, క్యాప్సికమ్ : ఒక్కో కప్పు చొప్పున, పచ్చి మిర్చి : ఆరు, జీలకర్ర : అర టీ స్పూన్,ఆవాలు : పావు టీ స్పూన్, తరిగిన కొత్తిమీర : అర కప్పు, కరివేపాకు : రెండు రెమ్మలు, నిమ్మరసం : ఒక టీ స్పూన్, నూనె : రెండు టేబుల్ స్పూన్లుపసుపు : చిటికెడు, అజినోమోటో : చిటికెడుఉప్పు : తగినంత తయారు చేసే విధానం: రాజ్మా గింజలను ఒకరోజు ముందుగానే నానబెట్టుకోవాలి. మరుసటి రోజు ఆ గింజలను శుభ్రంగా కడిగి కుక్కర్లో నీళు ,, కొద్దిగా ఉప్పు వేసి ఉడికించుకోవాలి. బియ్యాన్ని కూడా పావుగంట సేపు నానబెట్టుకొని, కొద్దిగా ఉప్పువేసి అన్నం వండుకోవాలి. బియ్యం ఉడుకుతుండగానే పావు టీస్పూన్ నూనె వేస్తే, అన్నం పొడిగా వస్తుంది. ఆ తర్వాత ఒక మందపాటి మూకుడు తీసుకొని, నూనెపోసి వేడి చేసుకోవాలి. అందులో తరిగిన మిర్చి, జీలకర్ర, ఆవాలు, పసుపు, కరివేపాకు, తరిగిన క్యాబేజీ, క్యాప్సికమ్, అజినోమోటో వేసుకొని కాసేపు వేయించాలి. ఆ తర్వాత ఉడకబెట్టిన రాజ్మా గింజలు, కాస్తంత ఉప్పువేసి బాగా కలపాలి. మూకుడుపై మూతపెట్టి, సన్నని మంటమీద నాలుగైదు నిమిషాలపాటు ఉడకనివ్వాలి. ఆ తర్వాత ఉడికించి పెట్టుకున్న అన్నం అందులో వేసి, బాగా కలుపుకోవాలి. చివరగా నిమ్మరసం, కొత్తిమీర వేసి మరోసారి కలుపుకొని దించేయాలి. అంతే, నోరూరించే రాజ్మా రైస్ రెడీ!

# పిల్లల్లో రోగ నిరోధక శక్తిని పెంచే ఆహారాలివే..!



హైదరాబాద్ : చిన్నారులకు సహజంగానే రోగ నిరోధక శక్తి తక్కువగా ఉంటుంది. అందుకనే వారికి త్వరగా వ్యాధులు వస్తాయి. ముఖ్యంగా ఈ సీజన్‌లో దగ్గు, జలుబు, జ్వరం వస్తుంటాయి. అయితే మన ఇంట్లో ఉండే సహజ సిద్ధమైన పదార్థాలను వారికి రోజూ తినిపిస్తే చాలు.. దాంతో వారి రోగ నిరోధక శక్తి పెరిగి వ్యాధులు రాకుండా ఉంటాయి. మరి ఆ పదార్థాలు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందామా..!

**1. పెరుగు :** చిన్నారులకు నిత్యం పెరుగును కచ్చితంగా తినిపించాలి. దీంతో వారి శరీరంలో ఉండే చెడు బాక్టీరియా నశిస్తుంది. జీర్ణక్రియ సాఫీగా జరుగుతుంది. పెరుగులో ఉండే కాల్షియం పిల్లల ఎముకలను దృఢంగా చేస్తుంది.

**2. నిమ్మజాతి పండ్లు :** నిమ్మజాతికి చెందిన నారింజ, బత్తాయి తదితర పండ్లను చిన్నారులకు ఇవ్వడం వల్ల వాటిలో ఉండే విటమిన్ సి పిల్లల్లో రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. దగ్గు, జలుబు, జ్వరం వంటి శ్వాసకోశ వ్యాధులను రాకుండా చూస్తుంది.

**3. నట్స్ :** పిల్లలకు రోజూ జీడిపప్పు, బాదం, పిస్తాపప్పు తదితర నట్స్‌ను తినిపించడం వల్ల వాటిలో ఉండే పోషకాలు వారిలో రోగ నిరోధక శక్తిని పెంచుతాయి. అలాగే పిల్లలు బలంగా తయారవుతారు. వారికి సంపూర్ణ పోషణ లభిస్తుంది. అనారోగ్యాలు రాకుండా ఉంటాయి.

**4. క్యారెట్లు :** పిల్లలకు విటమిన్ ఎ, జింక్ సమృద్ధిగా లభించాలంటే వారికి నిత్యం క్యారెట్లను తినిపించాలి. వీటితో కంటి చూపు మెరుగు పడుతుంది. శరీర రోగ నిరోధక శక్తి పెరిగి ఇన్‌ఫెక్షన్లు రాకుండా ఉంటాయి.

# భోజనం చేసిన వెంటనే యోగా చేస్తే..!

యోగికి ఎటువంటి వ్యాధి లేనట్లుగా, యోగా చేసేవారి ఆరోగ్యానికి ఏ ఢోకా ఉండదని చెబుతున్నారు నిపుణులు. యోగాతో పాటు, ఆహారానికి కూడా మంచి ప్రాముఖ్యత ఇవ్వాలి. ఆరోగ్యంగా ఉండాలంటే ఆహారం ఎలా ఉండాలి? ఆహారం తినడానికి, యోగా చేయడానికి మధ్య ఎంత సమయం ఉండాలి? ఆరోగ్యంగా ఉండాలంటే రోజువారీ కార్యకలాపాల్లో శారీరక వ్యాయామాన్ని భాగం చేసుకోవడం చాలా అవసరం. ముఖ్యంగా చిన్నపాటి యోగాసనాలు ఆరోగ్యానికి చెప్పలేనంత మేలు చేస్తాయి. యోగా శరీర వశ్యతను పెంచడంలో సహాయపడటమే కాకుండా, మొత్తం ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుంది. యోగికి ఎటువంటి వ్యాధి లేనట్లుగా, యోగా చేసేవారి ఆరోగ్యానికి ఏ ఢోకా ఉండదని చెబుతున్నారు నిపుణులు. యోగాతో పాటు, ఆహారానికి కూడా మంచి ప్రాముఖ్యత ఇవ్వాలి. ఆరోగ్యంగా ఉండాలంటే ఆహారం ఎలా ఉండాలి? ఆహారం తినడానికి, యోగా చేయడానికి మధ్య ఎంత సమయం ఉండాలి? అనే విషయాల గురించి సీనియర్ డైటీషియన్, డయాబెటిస్ నిపుణుడు డాక్టర్ నిషా జైన్ మాట్లాడుతూ.. యోగా చేయడానికి ముందు మీ కడుపు సాధ్యమైనంత వరకు ఖాళీగా ఉండాలని అన్నారు. భోజనానికి, యోగాకు మధ్య కనీసం 8 నుంచి 10 గంటల గ్యాప్ నిర్వహించడం మంచిదని సూచించారు. సాయంత్రం త్వరగా భోజనం తినవచ్చు. ఆ తర్వాత ఆ మరుసటి రోజు ఉదయం పూట యోగా క్షేమంగా చేయవచ్చు. అయితే పగటిపూట యోగా చేస్తుంటే మాత్రం తినడానికి, యోగాకి మధ్య కనీసం 1 గంట గ్యాప్ అవసరమని చెప్పారు. అంటే భోజనం తిన్న 1 గంటలోపు యోగా చేయకుండా ఉండాలని అంటున్నారు. యోగా చేసే ముందు తేలికైన ఆహారాలు తినవచ్చని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. యోగా చేసే ముందు గ్రీన్ టీ, బ్లాక్ కాఫీ, అరటిపండ్లు, ఆపిల్స్ తినవచ్చు. నట్స్, డ్రైఫ్రూట్స్ వంటి ఆహారాలు తినవచ్చు. ఈ ఆహారాలు శరీరంలో నెమ్మదిగా శక్తిని విడుదల చేస్తాయి. ఇది యోగా సమయంలో శరీరాన్ని చురుగ్గా ఉంచుతుంది కూడా. ముఖ్యంగా యోగా చేసే ముందు వేయించిన లేదా కారంగా ఉండే ఆహారాన్ని పూర్తిగా మానేయడం మంచిది. ఇది కడుపు ఉబ్బరం,



కడుపులో భారమైన అనుభూతి, వికారం వంటి లక్షణాలను కలిగిస్తుంది. యోగా చేసిన 30 నిమిషాల తర్వాత పుష్కలంగా నీరు తాగాలి. ఇది శరీరాన్ని తిరిగి హైడ్రేట్ చేస్తుంది. దీనితో పాటు, కొబ్బరి నీరు లేదా నిమ్మకాయ నీరు కూడా తాగవచ్చు. అలాగే యోగా తర్వాత ప్రోటీన్ ఆహారాలు కూడా తీసుకోవచ్చు. ఇందుకోసం ఉడికించిన గుడ్లు తినవచ్చు.

## ఖాళీ కడుపుతో బెండకాయ
# నీరు తాగితే..?



మనకు సులభంగా దొరికే కూరగాయల్లో బెండకాయ ఒకటి. ఇది మన వంటకాల్లో తరచుగా వాడతాం. తక్కువ కేలరీలు, ఎక్కువ పోషకాలు ఉన్న బెండకాయ నీళ్లు ఆరోగ్యానికి చాలా మంచివని నిపుణులు చెబుతున్నారు. బెండకాయను రాత్రి నీటిలో నానబెట్టి ఆ నీటిని ఉదయం ఖాళీ కడుపుతో తాగితే శరీరానికి చాలా మంచిదని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. కానీ దీన్ని ఎంత మోతాదులో తీసుకోవాలి, ఎవరు తాగాలి, ఎవరు తాగకూడదు అన్నదానిపై పూర్తి అవగాహన ఉండాలి. బెండకాయలో ఎక్కువగా ఉండే ఫైబర్ పేగుల పనితీరును మెరుగుపరుస్తుంది. దీని వల్ల మలబద్ధకం తగ్గుతుంది. అజీర్తి లాంటి సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. బెండకాయలో గ్లూకోజ్ను శరీరం తీసుకోకుండా తగ్గించే గుణం ఉంది. ఇది షుగర్ను అదుపులో ఉంచడంలో సాయపడుతుంది. ఇందులో ఉండే యాంటీఆక్సిడెంట్లు, ఫైబర్ చెడు కొలెస్ట్రాల్ ను తగ్గిస్తాయి. గుండెకు రక్షణ ఇస్తాయి. రక్తనాళాల్లో వాపు తగ్గి గుండె సంబంధిత సమస్యల నుంచి కాపాడుతుంది. బెండకాయలో కాల్షియం, మెగ్నీషియం, విటమిన్ %ఖ% లాంటి పోషకాలు చాలా ఉంటాయి. ఇవి ఎముకలు గట్టిగా అయ్యేలా చేస్తాయి. ఈ నీళ్లు తాగిన తర్వాత కడుపు నిండినట్లు అనిపిస్తుంది. దీని వల్ల ఆకలి తగ్గి ఎక్కువ ఆహారం తీసుకోవడం తగ్గుతుంది. దాంతో బరువు అదుపులో ఉంటుంది. బెండకాయలో యాంటీఆక్సిడెంట్లు, యాంటీ ఇన్ ఫ్లమేటరీ గుణాలు ఉండటం వల్ల చర్మ సమస్యలు తగ్గుతాయి. ముడతలు, మొటిమలు తగ్గడంలో సాయపడతాయి. చర్మం కాంతివంతంగా మారుతుంది. వాంతులు, గ్యాస్, కడుపు ఉబ్బరం.. ఎక్కువ ఫైబర్ వల్ల కొందరికి అజీర్తి లాంటి ఇబ్బందులు రావచ్చు. అలర్జీ వచ్చే అవకాశం.. కొందరు బెండకాయకు అలర్జీ కలిగి ఉంటారు. అలాంటి వారు ఈ నీటిని తాగకూడదు. ఫ్రక్టోజ్ వల్ల అసౌకర్యం.. బెండకాయలో ఉండే ఫ్రక్టోజ్ వల్ల కొందరికి గ్యాస్, అసౌకర్యం కలగవచ్చు. కిడ్నీలో రాళ్లు ఉన్నవారు జాగ్రత్త.. ఇందులో ఉండే ఆక్సలేట్ పదార్థం రాళ్లు ఏర్పడటానికి కారణం అవుతుందని పరిశోధనలు చెబుతున్నాయి.

బెండకాయ నీళ్ల తయారీ విధానం: ఐదు తాజా బెండకాయలు తీసుకోండి. వాటి చివర్లు కట్ చేసి మధ్యలో చీల్చండి.వీటిని రెండు గ్లాసుల నీటిలో రాత్రంతా నానబెట్టండి.ఉదయం ముక్కలను తీసివేసి ఆ నీటిని ఖాళీ కడుపుతో తాగండి. బెండకాయ నీళ్లు సహజంగా ఆరోగ్యాన్ని పెంచే ఒక మంచి మార్గం. కానీ దీన్ని రోజూ తీసుకునే ముందు మీ ఆరోగ్య పరిస్థితులను ఆలోచించుకోండి. అవసరమైతే డాక్టర్ సలహా తీసుకోవడం మంచిది.

## ఈ అలవాట్లు ఉంటే
# పాతిక ఏళ్లకే వృద్ధాప్యం..



కొంత మంది పాతికేళ్లకే నలభై ఏళ్ల మాదిరి కనిపిస్తుంటారు. ముఖ్యంగా అబ్బాయిల్లో ఈ లక్షణాలు ఎక్కువగా కనిపిస్తుంటాయి. నిజానికి.. మన రోజువారీ ఆహార అలవాట్లు ఆరోగ్యాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తాయని నిపుణులు అంటున్నారు. అంతేకాదు వృద్ధాప్యానికి కూడా ఈ అలవాట్లే కారణమవుతాయని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. మన రోజువారీ ఆహార అలవాట్లు ఆరోగ్యాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తాయి. అంతేకాదు వృద్ధాప్యానికి కారణమవుతాయని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. ఏమి తింటారు అనే దాని నుంచి స్ట్రెస్‌ని ఎలా ఎదుర్కొంటారు అనే దాని వరకు.. అన్ని అంశాలు మీ వయస్సు ఎంత వేగంగా క్షీణిస్తుందో నిర్ణయించగలవట. అలాగే ఈ అలవాట్లు దీర్ఘకాలిక ఆరోగ్యంపై కూడా పెద్ద ప్రభావాన్ని చూపుతుందని చెబుతున్నారు. ధూమపానం: వృద్ధాప్య ప్రక్రియను వేగవంతం చేసే విషయంలో ధూమపానం అత్యంత హానికరమైన అలవాట్లలో ఒకటి. ఇది చర్మం స్థితిస్థాపకతను దెబ్బతీస్తుంది. ఇది రక్త ప్రవాహాన్ని తగ్గిస్తుంది. ముడతలు, నిస్తేజమైన చర్మానికి దారితీస్తుంది. ఇది కాలేయంతో సహా మొత్తం శరీర ఆరోగ్యంపై చెడు ప్రభావాన్ని చూపుతుంది. మద్యం సేవించడం: అధికంగా మద్యం సేవించడం వల్ల వృద్ధాప్య సంకేతాలు కనిపిస్తాయి. మద్యం చర్మాన్ని డీహైడ్రేట్ చేస్తుంది. వాపుకు కారణమవుతుంది. అధికంగా మద్యం సేవించడం వల్ల కాలక్రమేణా కాలేయ పనితీరు దెబ్బతింటుంది. అధిక వేడి: విటమిన్ డి కోసం సూర్యరశ్మి చాలా అవసరం. అయినప్పటికీ.. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల మధ్య సూర్యరశ్మిని నివారించడం మంచిది. ఎందుకంటే ఇది చర్మం వృద్ధాప్యాన్ని వేగవంతం చేస్తుంది. సన్ స్క్రీన్ ఉపయోగించకపోతే, చర్మాన్ని సూర్య రశ్మి నుంచి కాపాడుకోవడానికి రక్షణ దుస్తులు ధరించకపోతే సూర్యరశ్మి వల్ల మచ్చలు, సన్నని గీతలు, ముడతలు చర్మంపై ఏర్పడి వృద్ధాప్య ప్రక్రియను వేగవంతం చేస్తాయి. దీర్ఘకాలిక నిర్జలీకరణం: సరైన హైడ్రేషన్.. అంటే తగినంత నీరు తాగకపోతే డీహైడ్రేషన్ సమస్యలు వస్తాయి. తగినంత నీరు త్రాగకపోవడం వల్ల చర్మం పొడిబారి, పొలుసులుగా మారి నిర్జీవంగా కనిపిస్తుంది. ప్రాసెస్ చేసిన ఆహారాలు, చక్కెర తీసుకోవడం: చక్కెర, ప్రాసెస్ చేసిన ఆహారాలు జీవక్రియను ప్రభావితం చేయడమే కాకుండా చర్మ సమస్యలు, వాపుకు కూడా కారణమవుతాయి.

ఇది చర్మం జీవం కోల్పోవడం, ముడతలు వంటి వృద్ధాప్య అకాల సంకేతాలకు దారితీస్తుంది. ఒత్తిడి: వృద్ధాప్యానికి ఒత్తిడి ప్రధాన కారణం. దీర్ఘకాలిక ఒత్తిడి హార్మోన్ల సమతుల్యతను దెబ్బతీస్తుంది. నిద్రను ప్రభావితం చేస్తుంది. ముఖంపై మచ్చలు లేదా కళ్ళ కింద నల్లటి వలయాలకు దారితీస్తుంది. ఒత్తిడిని నిర్వహించడానికి, మొత్తం ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి "భ్రమరి ప్రాణాయామం" చేయడం మంచి మార్గం.


## ఉదయాన్నే ఈ తెల్లటి
# రసం తాగి చూడండి..



ప్రతి రోజు ఉదయం ఒక గ్లాసు తెల్ల గుమ్మడికాయ రసం తాగడం ఆరోగ్యానికి చాలా మంచిది. చాలా మంది ఉదయాన్నే కాఫీ, టీ తాగుతారు. వాటికి బదులు ఈ సహజ రసం తీసుకుంటే శరీరానికి మేలు చేస్తుంది. మనసుకు ప్రశాంతతను ఇస్తుంది. తెల్ల గుమ్మడికాయలో చాలా పోషకాలు ఉంటాయి. ఇవి నరాలకు శక్తిని ఇస్తాయి. మెదడును ప్రశాంతంగా ఉంచడంలో సహాయపడుతాయి. దాంతో ఉదయాన్నే ఈ రసం తాగితే ఒత్తిడి తగ్గుతుంది. ఆందోళన లేకుండా రోజంతా ఉత్సాహంగా ఉంటారు. ఈ రసం మూత్రపిండాలకు ఎంతో మేలు చేస్తుంది. మూత్రంలో వచ్చే ఇన్ ఫెక్షన్లు, మూత్రంలో రక్తం రావడం, పైల్స్ వల్ల రక్తం పోవడం లాంటి సమస్యలను తగ్గిస్తుంది. తెల్ల గుమ్మడికాయ రసం చల్లగా ఉంటుంది. శరీరాన్ని ప్రశాంతంగా ఉంచుతుంది.అల్సర్ తో బాధపడేవారు తెల్ల గుమ్మడికాయ రసాన్ని తేనెతో కలిపి ఉదయం తాగితే కడుపు లోపల గాయాలు త్వరగా తగ్గుతాయి. కడుపులోని పురుగులను బయటకు పంపిస్తుంది. కొత్త ఇన్ ఫెక్షన్లు రాకుండా ఆపుతుంది.బరువు తగ్గాలని అనుకునే వారికి ఇది బాగా ఉపయోగపడుతుంది. రోజూ ఉదయం ఈ రసం తాగడం వల్ల శరీరంలోని అదనపు నీరు బయటకు పోతుంది. ఇది బరువు తగ్గించడమే కాకుండా.. శరీరాన్ని తేలికగా, శక్తివంతంగా ఉంచుతుంది. శరీరంలో వేడి ఎక్కువగా ఉన్నవారికి కూడా ఇది చాలా మంచిది.

ఈ రసం తాగితే శరీరం చల్లబడుతుంది. తేమగా మారుతుంది. వేసవిలో వేడి సమస్యలతో బాధపడే వారికి ఇది మంచి పరిష్కారం.తెల్ల గుమ్మడికాయ రసాన్ని తేనెతో కలిపి ఉదయం, సాయంత్రం తాగితే రక్తం శుభ్రపడుతుంది. ఇది శరీరం లోపల అవయవాలకు సాయపడుతుంది. రక్తం కారడాన్ని నియంత్రించడంలో కూడా తోడ్పడుతుంది. ఈ గుమ్మడికాయలో విటమిన్ బి, సి, కాల్షియం, పొటాషియం, ఫాస్ఫరస్, ఫైబర్, ఐరన్, నీరు ఎక్కువగా ఉంటాయి. ఇవన్నీ ఆరోగ్యానికి అవసరమైన ముఖ్యమైన పదార్థాలు. ప్రతి ఉదయం ఒక గ్లాసు తెల్ల గుమ్మడికాయ జ్యూస్ తాగడం మన శరీరానికి, మనసుకు చాలా మంచిది. ఇది ఒక చిన్న అలవాటు. కానీ దీని వల్ల చాలా గొప్ప ఫలితాలు ఉంటాయి.

# చియా సీడ్స్,
# నల్లఎండు ద్రాక్ష
## కలిపి నానపెట్టిన నీటితో ఇన్ని లాభాలా..?



వాటి నీరు గుండెపోటు ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఈ రెండింటిలో కాల్షియం, మెగ్నీషియం, పొటాషియం వంటి ఖనిజాలు ఉన్నాయి. ప్రతిరోజూ వాటి నీటిని తాగడం వల్ల ఎముకలు బలోపేతం అవుతాయి. ఎండుద్రాక్షలో విటమిన్ సి, చియా విత్తనాలలో యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. వీటి నీరు రోగ నరోధక శక్తిని పెంచుతుంది. జలుబు, ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశాలు తగ్గుతాయి. నల్ల ఎండుద్రాక్ష, చియా సీడ్స్ కలిపి తయారు చేసిన వాటర్ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ఈ రెండింటినీ కలిపి తాగడం వల్ల శరీరానికి లోపలి నుంచి పోషణ, శక్తి లభిస్తాయని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. నల్ల ఎండుద్రాక్షలో ఐరన్, చియా విత్తనాలలో ఫైబర్, ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. వీటి నీటిని తాగడం వల్ల శరీరంలో హిమోగ్లోబిన్ పెరిగి రక్తహీనత సమస్య తొలగిపోతుంది. చియా విత్తనాలలో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఎండుద్రాక్ష కూడా జీర్ణక్రియకు సహాయపడుతుంది. ఇవి నానబెట్టిన నీరు మలబద్ధకం, గ్యాస్, అజీర్తి వంటి సమస్యలను తొలగిస్తుంది. నల్ల ఎండుద్రాక్ష, చియా విత్తనాలు రెండూ సహజ చక్కెర మరియు ప్రోటీన్ కలిగి ఉంటాయి, ఇవి శరీరానికి తక్షణ శక్తిని ఇస్తాయి. ఉదయాన్నే వీటి నీటిని తాగడం వల్ల రోజంతా చురుగ్గా ఉండవచ్చు. చియా విత్తనాలు ఎక్కువసేపు కడుపు నిండుగా ఉంచుతాయి. ఎండుద్రాక్ష స్వీట్ తినాలన్న కోరికను తగ్గిస్తుంది. వాటి నీరు కొవ్వును వేగంగా కరిగిస్తుంది. బరువు తగ్గడానికి సహాయ పడుతుంది. నల్ల ఎండుద్రాక్ష, చియా విత్తనాలు రెండూ యాంటీఆక్సిడెంట్లను కలిగి ఉంటాయి. ఇవి నానబెట్టిన నీటిని ప్రతిరోజూ ఉదయం తాగడం వల్ల చర్మం ఆరోగ్యంగా, ప్రకాశవంతంగా మారుతుంది. ఎండుద్రాక్ష, చియా విత్తనాలలో ఒమేగా -3 కొవ్వు ఆమ్లాలు, పొటాషియం ఉంటాయి. ఇవి కొలెస్ట్రాల్ ను నియంత్రిస్తాయి. వాటి నీరు గుండెపోటు ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఈ రెండింటిలో కాల్షియం, మెగ్నీషియం, పొటాషియం వంటి ఖనిజాలు ఉన్నాయి. ప్రతిరోజూ వాటి నీటిని తాగడం వల్ల ఎముకలు బలోపేతం అవుతాయి. ఎండుద్రాక్షలో విటమిన్ సి, చియా విత్తనాలలో యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. వీటి నీరు రోగ నరోధక శక్తిని పెంచుతుంది. జలుబు, ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశాలు తగ్గుతాయి.

# జ్వరానికి అసలు కారణం ఏంటి..?

మన శరీరానికి చాలా రకాల ఇన్ ఫెక్షన్లు వస్తాయి. వాటిలో ముఖ్యంగా వైరస్ లు, బ్యాక్టీరియా వల్ల వచ్చేవి ఎక్కువగా ఉంటాయి. ఒక వ్యక్తిని పరీక్ష చేసిన తర్వాత డాక్టర్ ఇది వైరల్ ఫీవర్ అని చెప్పడం మనం తరచూ వింటాం. కానీ అది వైరస్ వల్ల వచ్చిందని ఎలా అర్థం చేసుకోవాలి..? బ్యాక్టీరియా వల్ల వచ్చిందా లేదా వైరస్ వల్ల వచ్చిందా అని ఎలా తెలుసుకోవాలి..? ఈ రెండింటి మధ్య తేడాలు తెలుసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవడం చాలా అవసరం. వైరస్ లు, బ్యాక్టీరియా ఇన్ ఫెక్షన్లు ఈ రెండు జబ్బులు సూక్ష్మజీవుల వల్ల వస్తాయి. కానీ అవి శరీరంపై పని చేసే విధానం వేరుగా ఉంటుంది. బ్యాక్టీరియా అనేది సొంతంగా బతకగల ఒకే కణం జీవి. కొన్ని రకాల బ్యాక్టీరియా శరీరానికి హానికరం కావు. కానీ కొన్ని రకాల బ్యాక్టీరియా జబ్బులు కలిగిస్తాయి. ఉదాహరణకు టీబీ (ట్యూబర్క్యులోసిస్), యూరినరీ ట్రాక్ట్ ఇన్ ఫెక్షన్లు, గొంతు నొప్పి లాంటివి ఈ రకానికి చెందుతాయి. ఇవి యాంటీబయోటిక్ మందులతో నయం అవుతాయి. వైరస్ లు చాలా చిన్న జీవులు. ఇవి శరీరంలోకి వెళ్ళిన తర్వాత మంచి కణాలను ఆక్రమించి పెరుగుతాయి. వాటి వల్ల జలుబు, దగ్గు, జ్వరం, కోవిడ్ లాంటి జబ్బులు వస్తాయి. వైరల్ ఇన్ ఫెక్షన్ కు యాంటీబయోటిక్స్ పని చేయవు.వైరల్, బ్యాక్టీరియా ఇన్ ఫెక్షన్లకు కొన్ని లక్షణాలు ఒకేలా కనిపించవచ్చు. ఉదాహరణకు జ్వరం, గొంతు నొప్పి, అలసట, ఒళ్ళు నొప్పులు రెండింటిలోనూ రావచ్చు. కానీ వైరల్ ఇన్ ఫెక్షన్లు సాధారణంగా నెమ్మదిగా వస్తూ 5 నుంచి 10 రోజుల్లో తగ్గిపోతాయి. అయితే బ్యాక్టీరియల్ ఇన్ ఫెక్షన్లు రోజురోజుకూ తీవ్రంగా మారతాయి. వాటిని వదిలేస్తే ఇతర శరీర భాగాలకు వ్యాపించే ప్రమాదం ఉంటుంది.చాలా సార్లు డాక్టర్లు లక్షణాలను చూసి చెబుతారు. అయితే కచ్చితంగా తెలుసుకోవాలంటే రక్త పరీక్ష, మూత్ర పరీక్ష లాంటివి అవసరం. కొన్నిసార్లు గొంతు స్రావాన్ని కూడా చూడాలి. కొన్ని వైరల్ జబ్బులు పొక్కులు లాగా కనిపిస్తాయి.. ఉదాహరణకు ఆటలమ్మ, అమ్మవారు లాంటివి. కానీ కొన్నింటిని గుర్తించడానికి టెస్టులు అవసరం.. ఉదాహరణకు కోవిడ్, హెపటైటిస్.



చికిత్స పూర్తిగా జబ్బుకు కారణాన్ని బట్టి నిర్ణయించాలి. వైరస్ వల్ల వచ్చిన ఇన్ ఫెక్షన్ లకు ఎక్కువగా విశ్రాంతి, ద్రవ పదార్థాలు తీసుకోవడం, కొన్ని ఉపశమనం ఇచ్చే మందులు వాడటమే చేస్తారు. బ్యాక్టీరియల్ ఇన్ ఫెక్షన్లు అయితే డాక్టర్ సూచన మేరకు యాంటీబయోటిక్స్ తీసుకోవాలి. కానీ వాటిని అనవసరంగా వాడకూడదు. అది రోగనిరోధక శక్తిని తగ్గిస్తుంది. అలాగే జాగ్రత్తలు తీసుకోవడం వల్ల జబ్బులు రాకుండా చూసుకోవచ్చు. ఈ రెండు రకాల జబ్బులను కొన్ని సాధారణ జాగ్రత్తలతో ఆపవచ్చు. జబ్బుతో ఉన్నవారికి దూరంగా ఉండడం.గోరువెచ్చని నీళ్లు తాగడం.చేతులు కడగకుండా ముఖాన్ని తాకకూడదు. మాస్క్ వాడటం, శుభ్రత పాటించడం ముఖ్యమైనవి. వైరల్, బ్యాక్టీరియా ఇన్ ఫెక్షన్ల లక్షణాలు కొంతవరకు ఒకేలా కనిపించినా.. చికిత్స పూర్తిగా వేరుగా ఉంటుంది. సరైన పరీక్షల ద్వారానే సరైన వైద్యం అందుతుంది. అందుకే మనం జాగ్రత్తగా ఉండి.. ఏ లక్షణాలు కనిపించినా డాక్టర్లను కలిసి కారణాన్ని కచ్చితంగా తెలుసుకొని చికిత్స తీసుకోవాలి.

## ఆ క్రెడిట్ మాత్రం దర్శకుడికే!



నందు, అవికా గోర్ జంటగా నటించిన విభిన్న కథాచిత్రం ‘అగ్లీ స్టోరీ’. ప్రణవ స్వరూప్ దర్శకత్వంలో సుభాషిణి, కొండా లక్ష్మణ్ నిర్మించిన ఈ చిత్రం శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా ఈ సినిమా థాంక్స్ మీట్‌ని హైదరాబాద్‌లో శనివారం మేకర్స్ నిర్వహించారు. థియేటర్లలో స్పందన బాగుందని కథానాయకుడు నందు ఆనందం వ్యక్తం చేశారు. తన నటనను అంతా మెచ్చుకుంటున్నారని, భర్త క్రూరత్వాన్ని భరించాల్సిన అవసరం భార్యకు లేదని తెలిపే సినిమా ఇదని, ఈ సినిమాలో తన పాత్రకు ఇంత స్పందన రావడానికి కారణం దర్శకుడేనని, 95శాతం ఆ క్రెడిట్ అతనికే దక్కుతుందని నందు అభిప్రాయపడ్డారు. ‘నా భార్య గీతామాధురికి ఈ సినిమాలోని పాటలు నచ్చాయి. ఒక హారర్ సినిమా చూసిన ఫీలింగ్ కలిగిందంటూ, తనకు నచ్చిన సన్నివేశాల గురించి చెప్పింది’ అని తెలిపారు నందు. ఇంకా దర్శకుడు ప్రణవ స్వరూప్, బెక్కం వేణుగోపాల్ కూడా మాట్లాడారు.

## ఇప్పటి బాలీవుడ్ లో అలాంటి బంధాలకు

# చోటు లేదు

### – అమీషా పటేల్



బాలీవుడ్ సీనియర్ నటి అమీషా పటేల్, చిత్ర పరిశ్రమలోని ప్రస్తుత పరిస్థితులపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇప్పటి నటీనటుల మధ్య ఒకప్పటిలా నిజమైన స్నేహబంధాలు, అమాయకత్వం కనిపించడం లేదని ఆమె అభిప్రాయపడ్డారు. ఆదివారం తన తొలి సినిమా ‘కహో నా... ప్యార్ హై’ సహనటుడు హృతిక్ రోషన్‌తో దిగిన ఒక పాత ఫోటోను ఆమె సోషల్ మీడియాలో పంచుకున్నారు. ఫుకెట్‌లో సినిమా షూటింగ్ సందర్భంగా ఒక రెస్టారెంట్‌లో హృతిక్‌తో కలిసి డిన్నర్ చేస్తున్న ఫోటోను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేస్తూ, అప్పటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. “ఒకప్పటి ఆ అమాయకత్వం, సహ నటుల మధ్య ఉండే నిజమైన బంధాలు ఇప్పటి బాలీవుడ్ లో లేవు. కానీ అలాంటి స్నేహాలు, బంధాలు ఏర్పరచుకోవడం నా అదృష్టం” అని ఆమె తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఈ ఫోటో, ఆమె వ్యాఖ్యలు నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఇదే సమయంలో, భారతీయ సెలబ్రిటీలు ఎదుర్కొంటున్న ట్రోలింగ్‌పై కూడా అమీషా స్పందించారు. హాలీవుడ్ స్టార్లతో పోలిస్తే మన దేశంలోనే సెలబ్రిటీలను ఎక్కువగా ట్రోల్ చేస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. “ఒకరినొకరు కిందికి లాగే మనస్తత్వం భారతీయులలో పెరిగిపోయింది. పెద్ద ఈవెంట్లలో మన స్టార్ల డ్రెస్సింగ్ లేదా వారి తీరును మనవాళ్లే టార్గెట్ చేయడం సిగ్గుచేటు” అని ఆమె ఎక్స్ వేదికగా విమర్శించారు.

## విభిన్న కథతో

# సందిగ్ధం



నిహాల్, ప్రియాదేశ్‌పాగ్, అర్జున్ సీహెచ్, కాజల్ తివారి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ‘సందిగ్ధం’ చిత్రం ఈ నెల 29న ప్రేక్షకుల ముందుకురానుంది. పార్థసారధి కొమ్మోజు దర్శకత్వంలో సంధ్య తిరువీధుల ఈ చిత్రాన్ని నిర్మించారు. శనివారం ట్రైలర్‌ను విడుదల చేశారు. డిఫరెంట్ కాన్సెప్ట్‌తో ఈ చిత్రాన్ని తీశామని, కథలోని కొత్తదనం ఆకట్టుకుంటుందని దర్శకుడు తెలిపారు.ఎన్నో కష్టాలను అధిగమించి సినిమాను ప్రేక్షకుల ముందుకుతీసుకొస్తున్నామని హీరో నిహాల్ అన్నారు. ఈ సినిమాలో మ్యూజిక్‌తో పాటు బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కూడా అద్భుతంగా ఉంటుందని సంగీత దర్శకుడు గౌతమ్ రవిరామ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: నందన్‌కృష్ణ, సంగీతం: గౌతమ్ రవిరామ్, దర్శకత్వం: పార్థసారధి కొమ్మోజు.

## తప్పిపోయి రాలే.. వెతుక్కుంటూ వచ్చా



అఖిల్ అక్కినేని నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ లవ్‌స్టోరీ ‘లెనిన్’. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. మురళీకిశోర్ అబ్బూరి దర్శకుడు. అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ నిర్మాతలు.

జూన్ 26న ప్రపంచవ్యాప్తంగా సినిమా విడుదల కానున్నది. మే 23తో అక్కినేని నాగార్జున సినీ ప్రయాణం ప్రారంభించి, ఆయన తొలి సినిమా ‘విక్రమ్’ విడుదలై 40ఏండ్లు పూర్తయిన సందర్భంగా ‘లెనిన్’ టీజర్‌ని మేకర్స్ విడుదల చేశారు.‘మనోడు వస్తున్నాడు’ అనే డైలాగ్‌తో ‘లెనిన్’ టీజర్‌పై హైప్ పెరిగిందని మేకర్స్ చెబుతున్నారు. ‘నేను తప్పిపోయి రాలేదు మచ్చా.. మీ అందరినీ వెతుక్కుంటూ వచ్చిన..’ అని టీజర్‌లో చిత్తూరు యాసలో హీరో చెప్పిన డైలాగ్ ఆ పాత్రలోని ఇంటెన్సిటీని తెలియజేస్తున్నది. స్టేజ్‌పై ఎన్టీఆర్ పౌరాణిక డైలాగ్‌లను భాగ్యశ్రీ బోర్సే చెప్పిన తీరు, అఖిల్, భాగ్యశ్రీల కెమిస్ట్రీ యువతను ఆకట్టుకునేలా ఉన్నాయి. అఖిల్ బాడీ లాంగ్వేజ్, రగ్డ్ లుక్.. టీజర్‌లో హైలైట్‌గా ఉన్నాయి. శివాజీ కీలక పాత్ర పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: లియోన్ బ్రిట్టో, సంగీతం: తమన్, సమర్పణ: అన్నపూర్ణ స్టూడియోస్, నిర్మాణం: మనం ఎంటర్‌ప్రైజెస్ ఎల్ఎల్‌పీ, సితార ఎంటర్‌టైన్మెంట్స్.

## జిమ్‌లో శ్రియా రెడ్డి

### ‘కర్రసాము’ విన్యాసాలు..

నటి శ్రియా రెడ్డి తన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా షేర్ చేసిన కొన్ని వీడియోలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. కాలికి గాయమై కట్టు కట్టి ఉన్నప్పటికీ ఆమె జిమ్‌లో కఠినమైన కసరత్తులు చేస్తూ కనిపించారు. కేవలం వర్కవుట్లు మాత్రమే కాకుండా ఆమె చేసిన కర్రసాము విన్యాసాలు అందరినీ ఆశ్చర్యపరుస్తున్నాయి. శ్రియా రెడ్డి మొత్తం మూడు వీడియోలను అభిమానులతో పంచుకున్నారు. మొదటి దాంట్లో ఒంటి చేత్తో కర్రను గిరగిరా తిప్పుతూ అదరగొట్టారు. రెండో వీడియోలో రెండు చేతులతో రెండు కర్రలను చాలా వేగంగా తిప్పుతూ తన నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఇక మూడో దాంట్లో జిమ్‌లో కఠినమైన వర్కవుట్లు చేస్తూ కనిపించారు. ఆమె ఫిట్‌నెస్ పట్ల నెటిజన్లు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఈ వీడియోలతో పాటు శ్రియా రెడ్డి పెట్టిన పోస్ట్ నెటిజన్లను ఆలోచింపజేస్తోంది. “మళ్లీ ఫామ్‌లోకి రావడానికి ఒక్కో అడుగు వేస్తున్నా. మన బలాన్ని మనం మర్చిపోవడాన్నే ‘హనుమాన్ కాంప్లెక్స్’ అంటారు. జీవితం తిరిగి గుర్తుచేసే వరకు మన శక్తి ఏంటో మనకు తెలియదు. సముద్రాన్ని దాటే ముందు హనుమంతుడికి కూడా జాంబవంతుడు ఆయన శక్తిని గుర్తుచేయాల్సి వచ్చింది. మనల్ని మనం నమ్మడానికి కొన్నిసార్లు మనకూ ఒకరు కావాలి” అని ఆమె రాసుకొచ్చారు.



## ‘పెద్ది’ ఈవెంట్‌లో జాన్వీ కపూర్ మెరుపులు..


## రాయల్ లుక్‌లో అదరగొట్టిన బ్యూటీ





గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, జాన్వీ కపూర్ జంటగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం ‘పెద్ది’ ప్రమోషన్లు వేగం పుంజుకున్నాయి. మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో శనివారం రాత్రి ఈ చిత్ర మ్యూజిక్ లాంచ్ ఈవెంట్‌ను చిత్రబృందం ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమానికి హీరో రామ్ చరణ్, దర్శకుడు బుచ్చిబాబు సానాతో పాటు హాజరైన కథానాయిక జాన్వీ కపూర్, తన అద్భుతమైన ఫ్యాషన్‌తో అందరి దృష్టిని ఆకర్షించారు. ముఖ్యంగా ఆమె ధరించిన లెహెంగా, ఈ సీజన్‌లో పెళ్లి చేసుకోబోయే వధువులకు ఒక అద్భుతమైన ఎంపికగా నిలుస్తుందని ఫ్యాషన్ వర్గాలు ప్రశంసిస్తున్నాయి. ఈ వేడుక కోసం జాన్వీ కపూర్, ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ అనామికా ఖన్నా రూపొందించిన ముదురు వంగ పువ్వు రంగు (డీప్ పర్పుల్) లెహెంగా సెట్‌లో రాజకుమారిలా మెరిసిపోయారు. స్టైలిస్ట్ మేగన్ కాన్సెసియో పర్యవేక్షణలో, సంప్రదాయ భారతీయ హస్తకళను ఆధునిక డిజైన్‌తో మిళితం చేసి, ఒక ‘ఆధునిక భారతీయ యువరాణి’ రూపాన్ని ఆవిష్కరించారు. ఈ లెహెంగా సెట్‌లోని క్రాప్డ్ బ్లౌజ్ జాన్వీ అందాన్ని మరింత పెంచింది. రౌండ్ నెక్‌లైన్, హాఫ్ స్లీవ్స్‌తో ఉన్న ఈ బ్లౌజ్‌పై సున్నితమైన సీక్విన్‌లు, క్లిష్టమైన జరీ ఎంబ్రాయిడరీ, చిన్న తెల్లని పూసలతో చేసిన అలంకరణ అద్భుతంగా ఉంది. ఈ డిజైన్ ఆమె మిడ్‌రిఫ్‌ను హైలైట్ చేస్తూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దీనికి జతగా, అదే రంగులో ఉన్న హై-వెయిస్టెడ్ ఏ-లైన్ లెహెంగా స్కర్ట్‌పై సంప్రదాయ గోల్డ్ జరీ వర్క్ చూపరులను కట్టిపడేసింది. ఇక, ఒక భుజంపై పిన్ చేసి, నడుము వద్దకు అందంగా చుట్టిన పల్చటి షిఫాన్ దుపట్టా ఆమె లుక్‌కు సంపూర్ణతను తెచ్చిపెట్టింది. కేవలం దుస్తులే కాదు, ఆమె ధరించిన ఆభరణాలు కూడా ప్రత్యేకంగా నిలిచాయి. ‘మహేష్ నోతన్‌దాస్’ జ్యువెలరీ నుంచి ఎంచుకున్న భారీ గోల్డ్ నెక్ పీస్, దానికి వేలాడుతున్న ముత్యాలు రాయల్ లుక్‌ను ఇచ్చాయి. బ్లౌజ్‌పై పొరలుగా అమర్చిన ముత్యాల బ్రూచ్‌లు, చెవులకు అలంకరించిన భారీ జుంకాలు, వాటికి అనుసంధానంగా ఉన్న కణ్ ఫూల్ (ఇయర్ కఫ్), చేతులకు ధరించిన హథ్ ఫూల్ (హ్యాండ్ హార్నెస్), భారీ స్టేట్‌మెంట్ రింగ్... ఇలా ప్రతి ఆభరణం ఆమెను ఒక ఆధునిక యువరాణిలా మార్చేసింది. సౌరవ్ రాయ్, విధి పెరీరా తీర్చిదిద్దిన సంప్రదాయ జడ, మధ్యలో పాపిడితో నీట్‌గా కనిపించింది. ఇక మేకప్ విషయానికొస్తే, గోల్డ్ షిమ్మరింగ్ ఐషాడో, స్మడ్జ్ బ్లాక్ ఐలైనర్, నుదుట చిన్న వంగ పువ్వు రంగు బొట్టుతో ఆమె ముఖం ప్రకాశవంతంగా కనిపించింది. మొత్తం మీద, గ్లామర్‌తో కూడిన ఈ సంప్రదాయ లుక్‌లో జాన్వీ కపూర్ పెళ్లిళ్ల సీజన్‌లో జరిగే వేడుకలకు సరికొత్త ఫ్యాషన్ ఐకాన్‌గా నిలిచారు. కాగా, బుచ్చిబాబు సానా దర్శకత్వంలో స్పోర్ట్స్ డ్రామాగా తెరకెక్కుతున్న ‘పెద్ది’ చిత్రానికి ఆస్కార్ విజేత ఏ.ఆర్. రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. ఈ సినిమా జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది.

# ద్వివిధుడి వధ



ద్వివిధుడనే వానరుడు నరకాసురుడికి నమ్మకమైన స్నేహితుడిగా ఉండేవాడు. కృష్ణుడి చేతిలో నరకుడు హతమైపోయాక, తన మిత్రుణ్ణి చంపిన కృష్ణుడి మీద, అతడి పరివారమైన యాదవుల మీద పగబట్టాడు. కృష్ణుడి ఆనర్త దేశంలో అడపా దడపా నానా బీభత్సం సృష్టించేవాడు. పొలాల మీద పడి పంటలు నాశనం చేసేవాడు. ఊళ్లకు ఊళ్లను తగులబెట్టేవాడు. ఉద్యానవనాల్లోకి చొరబడి వాటిని ధ్వంసం చేసేవాడు. ద్వారక మీదకు రాళ్లు రువ్వేవాడు. ఆలమందలను చెదరగొట్టేవాడు. ఇలా నానా ఆగడం చేసి, చెట్ల మీద నుంచి గెంతుతూ ఎవరకీ దొరక్కుండా క్షణాల్లో పారిపోయేవాడు. ఇలా ఉండగా, ఒకసారి బలరాముడు ప్రియురాళ్లతోను, వాళ్ల చెలికత్తెలతోను కలసి రైవత పర్వతం మీదకు వనవిహారానికి వెళ్లాడు. సముద్రం మీద నుంచి వీచే చల్లగాలి హాయిగొలుపుతుండగా, అందరూ కొండ మీద చదునైన చోట కూర్చుని సేదదీరసాగారు. బలరాముడు హాయిగా మధువు తాగుతూ, ఆ తన్మయత్వంలో పాటలు పాడసాగాడు. బలరాముడి సంగీతానికి అనుగుణంగా ప్రియురాళ్లు నాట్యం చేయసాగారు. వారి వినోద కాలక్షేపం పాన గానాలతో ఆహ్లాదభరితంగా సాగుతుండగా, ఎక్కడి నుంచి చూశాడో ద్వివిధుడు చెట్ల మీద నుంచి దూకుతూ రైవత పర్వతం మీదకు చేరుకున్నాడు. కొండ మీదనున్న చెట్లపై వేలాడుతూ, ఒక చెట్టు మీద నుంచి మరో చెట్టు మీదకు దూకుతూ కోతిచేష్టలు మొదలుపెట్టాడు. చెట్లను బలంగా ఊపుతూ, వాటికి ఉన్న పండ్లను దులిపేశాడు. పూలను రాల్చేశాడు. ఆడవాళ్ల ఎదుటికొచ్చి చిందులు వేశాడు. వాళ్లు అతణ్ణి వింతగా చూశారు. కొందరు నవ్వారు. ఇంత జరుగుతున్నా బలరాముడు తన మైకంలో, తన లోకంలో తానుండి హాయిగా గానాలాపన సాగిస్తూనే ఉన్నాడు. తాను ఎంత ఆగడం చేస్తున్నా, బలరాముడు చలించకపోవడంతో ద్వివిధుడు చిర్రెత్తిపోయాడు. ఏకంగా బలరాముడి ఎదుటికే వచ్చి, జబ్బలు చరుచుకుని రంకెలు వేశాడు. కాళ్లు నేలకు తాటిస్తూ, కయ్యానికి కాలు దువ్వాడు. ఈ చేష్టలను బలరాముడు అరమూత కళ్లతో ఒకసారి చూసి, తన మానాన పాడుకోసాగాడు. ద్వివిధుడు మరింతగా కోపంతో పెట్రేగి ఊగిపోయాడు. పళ్లు పటపట కొరికాడు. బలరాముడి ముందున్న మధుపాత్రను పైకెత్తి నేలకేసి కొట్టాడు. మధుపాత్ర వగిలి, మంధుంవు నేలపాలైంది. ఏదో ఘనకార్యం చేసినట్టు వికటాట్టహాసం చేశాడు. రెప్పలెత్తి చూశాడు బలరాముడు. మామూలు కోతిని అదిలించినట్లుగానే, పక్కనే ఉన్న ఒక చిన్నరాయిని తీసుకుని అదిలించాడు. బలరాముడి ధోరణికి ద్వివిధుడు బాగా రెచ్చిపోయాడు. ఈసారి ఆడవాళ్ల గుంపులోకి దూకాడు. వాళ్లను మిర్రి మిర్రి చూస్తూ కిచకిచలాడాడు. బెదిరిస్తున్నట్లుగా పైపైకి వచ్చాడు. గంతులు వేశాడు. వాళ్లు ఇదంతా వినోదంగా అనుకుంటున్నంతలోనే ఒక్కసారిగా వాళ్ల జడలు గుంజి, చీరలు చించేశాడు. మీదపడి దొరికిన వాళ్లను దొరికినట్లుగా గోళ్లతో రక్కాడు. వానరం ఆగడం మితిమీరడంతో వాళ్లంతా హాహాకారాలు చేస్తూ, ఏడుపు మొదలుపెట్టారు. అప్పుడు వాణ్ణి తేరిపార చూశాడు బలరాముడు. దేశంలో ఆగడాలు సాగిస్తున్న వానరుడు వీడేనని గుర్తించాడు. ఆడవాళ్ల మీద ఆగడం సాగిస్తుండటంతో ఏమాత్రం సహించలేకపోయాడు. ఇక ఆలస్యం చేయకుండా, ఒక చేత నాగలి, మరో చేత ముసలం పట్టుకుని పైకి లేచాడు. బలరాముడు ఆయుధాలతో పైకి లేవడం గమనించిన ద్వివిధుడు, ఒక భారీ గుగ్గిలం చెట్టును పెరికి, బలరాముడి మీదకు విసిరాడు. ఎడమచేత్తో దాన్ని అడ్డుకున్నాడు బలరాముడు. ఒక మద్దిచెట్టును విసిరాడు. దాన్ని ముసలంతో నేలకూల్చేశాడు బలరాముడు. ఒక్క ఊపుతో ముందుకు దూసుకొచ్చాడు ద్వివిధుడు. ముసలంతో చాచిపెట్టి వాడి నెత్తి మీద కొట్టాడు బలరాముడు. వాడి తల పగిలి నెత్తురోడసాగింది. అయినా లక్ష్యపెట్టలేదు వాడు. భయంకరంగా పెడబొబ్బలు పెడుతూ, చెట్టు మీద చెట్టు పెరికి బలరాముడి మీదకు దండెత్తాడు. చుట్టు పక్కల చెట్లన్నీ ఖాళీ అయిపోయాక, పెద్ద పెద్ద బండరాళ్లు విసిరి ఊపిరాడనివ్వకుండా చేశాడు. అంతటితో ఆగకుండా బలరాముడి మీదకు దూకి, నేలకేసి అదిమి పిడిగుద్దులు కురిపించాడు. ఉపేక్షిస్తున్న కొద్దీ వానరం రెచ్చిపోతుండటంతో బలరాముడికి కోపం తలకెక్కింది. ఆగ్రహంతో కళ్లెర్రచేసి, కాలసర్పంలా బుసకొట్టాడు. ద్వివిధుడి మీద పిడుగుల్లా పిడిగుద్దులు కురిపించాడు. ఇద్దరూ కచాకచీ బాహాబాహీ ఒకరితో ఒకరు తలపడ్డారు. రైవతపర్వతం అదిరిపోయేలా రంకెలు వేస్తూ భీకరంగా ఒకరినొకరు కొట్టుకుంటూ, ఒకరినొకరు నేలపైకి పడదోసుకుంటూ యుద్ధం సాగించారు. ఒకరినొకరు తన్నుకుంటూ, చరుచుకుంటూ, పిడిగుద్దులు గుద్దుకుంటూ కలియబడ్డారు. అదను చూసుకుని బలరాముడు ద్వివిధుణ్ణి ఒడుపుగా పట్టుకుని, నేలకేసి తోశాడు. పైకి లేచే లోగానే అతడిపై కలబడ్డాడు. అతడి గుండెల మీద కూర్చుని, లేవనివ్వకుండా అతణ్ణి కట్టడి చేశాడు. ప్రతిఘటించేలోపే వ్యవధినివ్వకుండా పిడిగుద్దులు కురిపించాడు. గుండెల మీద పిడుగులాంటి పోటు పిడికిటితో పొడిచాడు. దెబ్బకు నెత్తురు కక్కుకుంటూ, భీకరంగా అరుస్తూ ప్రాణాలు వదిలాడు ద్వివిధుడు.

బలరాముడి చేతిలో వానరం హతమవడంతో అతడితో కొండ మీదకు వచ్చిన ఆడవాళ్లంతా ఊపిరి పీల్చుకున్నారు. బలరాముడిని పొగుడుతూ ఆనందంతో పాటలు పాడారు. యుద్ధంలో అలసిపోయిన బలరాముడికి సపర్యలు చేశారు. కొండ మీద కాసేపు సేదదీరాక, తిరిగి ద్వారకకు మళ్లారు.

# భయారణ్యం..

## ఇదో ఆత్మహత్యల అడవి



ప్రపంచంలోని చాలా వింతలు, రహస్యాలు తదనంతర కాలంలో వణుకు పుట్టించే గాథలుగా ప్రచారంలోకి వస్తాయి. అలాంటిదే జపాన్ లోని ఓకిగహారా అడవి. దీనికే సూసైడ్ ఫారెస్ట్ అనే పేరూ ఉంది. ఈ అడవిలోకి అడుగుపెట్టిన మొదట్లోనే 'మీ పిల్లలు, కుటుంబం గురించి ఒకసారి ఆలోచించండి, మీ జీవితం మీ తల్లిదండ్రులు మీకు ఇచ్చిన విలువైన బహుమతి' అనే కొటేషన్స్ కనపడతుంటాయి. ఎందుకంటే ఈ అడవి ప్రపంచంలోని ఆత్మహత్యల ప్రదేశాలలో రెండవ స్థానంలో ఉంది. జపాన్ రాజధాని టోక్యో నుంచి రెండు గంటల దూరంలో ఫుజీ పర్వతానికి వాయవ్యంలో ఉన్న ఈ అడవి.. 35 చదరపు కి.మీ. మేర విస్తరించి ఉంది. ఇది చాలా దట్టంగా, అందంగా ఉంటుంది. అధికారిక రికార్డుల ప్రకారం.. ఈ అడవిలో సుమారు 105 మృతదేహాలు లభించాయి. ఈ అడవిలో మొబైల్ ఫోన్ పని చేయదు. దాంతో అడవిలో చిక్కుకున్న వారు బయటికి రావడం అసాధ్యం. రాత్రిపూట అడవి నుంచి అరుపులు, వింత శబ్దాలు వస్తాయని స్థానికులు చెబుతుంటారు. ఈ వనంలో 300 సంవత్సరాల కిందటి పురాతన జాతుల చెట్లు ఉన్నాయని సమాచారం. అయితే ఈ అడవిలో ఉన్న మిస్టరీ ఏంటో నేటికీ కనిపెట్టలేకపోయారు.

# రోబో రెస్టారెంట్ : రోబోలతో ఆహారం సరఫరా!



న్యూఢిల్లీ : కరోనా మహమ్మారితో భౌతిక దూరం పాటించడం అనివార్యం కావడంతో వెయిటర్స్‌గా రోబోలను ప్రవేశపెడుతూ నోయిడాలో ఓ రెస్టారెంట్ వెలిసింది. నోయిడాలోని సెక్టార్ 104లో యల్లో హౌస్ పేరుతో రోబో రెస్టారెంట్‌ను లాంఛ్ చేయడంతో ఢిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతంలో రోబోటిక్ వెయిటర్స్‌తో తొలి రెస్టారెంట్ అందుబాటులోకి వచ్చింది. జైపూర్‌లో మూడు రెస్టారెంట్లను విజయవంతంగా నిర్వహించిన మల్టీక్యూజిన్ రెస్టారెంట్ చైన్ నోయిడాకు విస్తరించింది. రెస్టారెంట్‌లో రెండు రోబోలు ఫుడ్ సర్వ్ చేస్తూ టేబుల్స్ దగ్గర సేవలు అందిస్తాయి. ఈ రోబోలు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారంగా పనిచేస్తాయని రెస్టారెంట్ యజమాని జిషు ఆనంద్ తెలిపారు. ప్రతి టేబుల్ నుంచి డేటాను రోబోల్లో ఫీడ్ చేస్తారు. టేబుల్ నెంబర్‌ను ఫోన్ లేదా ట్యాబ్లెట్‌లో ఎంటర్ చేయగానే రోబోలు ఆయా టేబుల్స్ వద్దకు వెళ్లి ఆహారాన్ని అందిస్తాయి. రెండు, మూడు గంటల చార్జింగ్‌తో రోబోలు రోజంతా సేవలు అందిస్తాయి.


# అసలే ఎండాకాలం..

## చుండ్రు సమస్యా?

- సులభైన 2 చిట్కాలు మీకోసం



అరకప్పు మెంతులను రాత్రంతా నానబెట్టి ఉదయం నీళ్లు తీసేసి మెత్తగా రుబ్బుకోవాలి. దీనిలో కొద్దిగా నిమ్మరసం వేసి కలిపి కుదుళ్ల నుంచి జుట్టు చివర్ల వరకు పట్టించాలి. అరగంట తరువాత సాధారణ షాంపుతో తలస్నానం చేయాలి. అరకప్పు నానిన మెంతులను పేస్టులా రుబ్బుకోవాలి. దానికి, పావు కప్పు



అలోవెరా పేస్టు కలిపి కుదుళ్ల నుంచి చివర్ల వరకు పట్టించాలి. అరగంట తరువాత సాధారణ షాంపుతో కడిగేయాలి. ఈ రెండు ప్యాక్‌లలో ఏదైనా ఒకదానిని వారానికి రెండుసార్లు తలకు అప్లై చేయడం వల్ల చుండ్రు తగ్గుముఖం పడుతుంది. దురద కూడా తగ్గుతుంది.



# ఉత్సాహాన్నిచ్చే పోటాషియం కావాలా?

## బనానా కివీ స్మూతీ రెడీ చేసుకోండి!








**కావలసినవి:** పాలు కప్పు, అరటిపండు ఒకటి, కివి ఒకటి, తేనె మూడు టేబుల్ స్పూన్లు, లేతపాలకూర కప్పు, ఆవకాడో అర చెక్క, ఐస్‌క్యూబ్స్ కప్పు.
**తయారీ:** అరటిపండు, కివి తొక్కతీసి ముక్కలుగా తరగాలి పాలకూరను శుభ్రంగా కడిగి పక్కన పెట్టుకోవాలి ఇప్పుడు బ్లెండర్ తీసుకుని అరటిపండు, కివి ముక్కలు వేయాలి. దీనిలోనే పాలకూర, అవకాడోను ముక్కలు తరిగి వేయాలి. వీటన్నింటిని మెత్తగా గ్రైండ్ చేయాలి అన్నీ మెత్తగా నలిగాక పాలు, ఐస్‌క్యూబ్స్ వేసి మరొసారి గ్రైండ్ చేసి ..గ్లాసులో పోసుకోవాలి. దీనిలో తేనె వేసి బాగా కలిపి సర్వ్ చేసుకుంటే చాలా రుచిగా ఉంటుంది. తక్కువ క్యాలరీలు తీసుకోవాలనుకున్నవారికి ఈ స్మూతీ మంచి డ్రింక్ గా పనిచేస్తుంది. దీనిలో క్యాలరీలు, సోడియం తక్కువగా ఉండి పోషకాలు అధికంగా ఉంటాయి. విటమిన్ బి, సి, పీచుపదార్థంతోపాటు పొటాషియం కూడా పుష్కలంగా ఉంటుంది. పొటాషియం జీవనశైలిని మరింత ఉత్సాహపరుస్తుంది. గుండె ఆరోగ్యాన్ని పెంపొందిస్తుంది. కండరాలను సంరక్షిస్తుంది. అరటి, కివిలలో రెండు రకాల పీచుపదార్థాలు ఉంటాయి. ఇవి జీర్ణక్రియను క్రమబద్ధీకరిస్తాయి.

# కొత్త ప్రక్రియలతో

## ఆస్తమాను ఇలా అధిగమించవచ్చు..!




ఆస్తమా అదుపు చేయడానికి మందులు, స్టెరాయిడ్స్, ఇన్‌హేలర్స్ వంటి సంప్రదాయ మందులు వాడటం మామూలే. ఇప్పటికీ ఇవి అందుబాటులో ఉన్నాయి. అయితే మరికొన్ని కొత్త కొత్త ప్రక్రియల ద్వారా ఆస్తమాను అదుపు చేయడం ఇప్పుడు మరింత తేలికగా మారింది. ఈ కొత్త ప్రక్రియలను తెలుసుకుందాం. తీవ్రమైన ఆస్తమా వ్యాధిగ్రస్తులకు ఇప్పుడు బ్రాంకియల్ థర్మోప్లాస్టీ, బయలాజిక్ మెడిసిన్ అనే రెండు ఆధునిక చికిత్స ప్రక్రియలు అందుబాటులోకి వచ్చాయి. వీటి సహాయంతో ఆస్తమా కాస్తంత తీవ్రమైన సమస్యగా ఉన్నవారు కూడా సాధారణ జీవితం గడపడం సాధ్యమవుతుంది. బ్రాంకియల్ థర్మోప్లాస్టీ ప్రక్రియలో ఒక ప్రత్యేకమైన పరికరం సహాయంతో శ్వాసనాళపు గోడల్ని వేడి చేస్తారు. ప్రోబ్ అనే పరికరాన్ని బ్రాంకోస్కోప్ సహాయంతో లోపలికి పంపుతారు. అది అక్కడ వేడిమిని వెలువరిస్తుంది. ఆ వేడిమి తో శ్వాసమార్గంలో చేరిన అదనపు మ్యూకస్‌ను తొలగిస్తుంది. ఫలితంగా శ్వాస తీసుకునే నాళం విశాలంగా తెరుచుకుంటుంది. దాంతో హాయిగా శ్వాస పీల్చుకోవడం సాధ్యపడుతుంది. ఈ ప్రక్రియను మూడు వారాల పాటు నిర్వహించాల్సి ఉంటుంది. ఈ మూడు దఫాల చికిత్స పూర్తయ్యేసరికి తీవ్రమైన ఆస్తమా వ్యాధి లక్షణాలు బాగా తగ్గిపోతాయి. మంచి ఉపశమనం దొరుకుతుంది. జీవననాణ్యత గణనీయంగా పెరగడంతో పాటు, ఆస్తమా అటాక్స్ తగ్గుతాయి. దాంతో ఆసుపత్రిలో చేరాల్సిన అవసరాలూ తగ్గుతాయి. ఈ చికిత్స ఫలితాలు చాలా కాలం... అంటే దాదాపుగా ఎనిమిదేళ్లు ఉంటాయి. ఇన్‌హేలర్స్ వాడినప్పటికీ పెద్దగా ప్రయోజనం కనిపించని, పద్దెమినిమిదేళ్లు పైబడిన యుక్తవయస్కులైన బాధితులకు ఎవరికైనా ఈ చికిత్స అందించవచ్చు. అలాగే ఇప్పుడు బయోలాజిక్ మెడిసిన్స్ అనే కొత్తరకం మందులు కూడా అందుబాటులోకి వచ్చాయి. ఆస్తమా వ్యాధిగ్రస్తుల్లో శ్వాసనాళాల వాపు కారణంగా ఆ నాళాలు సన్నబడతాయి. ఆ వాపును ఈ మందులు తగ్గించడం ద్వారా ఆస్తమాను అదుపు చేస్తాయి.

# కాలేయం కోసం

## కాస్త శ్రద్ధ ఇలా...

?



మధ్యవయసు దాటాక వయసుతో పాటు దేహంలో కొవ్వు కూడా పెరుగుతుంది. ఇదే కొవ్వు కాలేయంలోని నార్మల్ కణాల్లో కూడా పెరుగుతూ, పేరుకుపోతూ ఉండవచ్చు. అదే ఫ్యాటీలివర్. కొన్నిసార్లు అది రక్తప్రవాహానికీ అడ్డురావచ్చు. అప్పుడు కాలేయం ఆకృతి, దాని స్వాభావికమైన రంగు దెబ్బతినవచ్చు. కాస్త గట్టిగా లేదా జిగురు జిగురుగా, పచ్చరంగుకు మారవచ్చు. ఆ కండిషన్‌నే సిర్రోసిస్ అంటారు. కొన్నిసార్లు దేహంలోకి చాలా ప్రమాదకరమైన విషాలు ప్రవేశించడం వల్ల గానీ, కొన్ని వ్యాధులు లేదా ఇన్ఫెక్షన్స్ వల్ల, తగినంత ఆహారం తీసుకోకుండా, మితిమీరిన ఆల్కహాల్ తీసుకోవడం వల్ల కూడా సిర్రోసిస్ రావచ్చు. అలాంటి సమయంల్లో దేహంపైన సాలీడు ఆకృతిలో రక్తనాళాలు బయటకు కనిపించవచ్చు. ఆకలి లేకపోవడం, నీరసం, నిస్సత్తువ, పొట్టలో విపరీతంగా గ్యాస్ పేరుకుపోవడం, కళ్లు పసుపు రంగులో ఉండటం వంటి లక్షణాలు కనిపిస్తుంటే డాక్టర్‌ను సంప్రదించాలి. అప్పుడు డాక్టర్‌లు లివర్ ఫంక్షన్ టెస్ట్ వంటి కొన్ని పరీక్షలు చేసి కాలేయం పనితీరు తెలుసుకుంటారు. కాలేయం పనితీరు బాగుంటే ఫరవాలేదు. ఒకవేళ ఫ్యాటీలివర్ ప్రాథమిక దశలో ఉన్నా అంతగా ప్రమాదం ఉండదు. బరువు పెరగడాన్ని నియంత్రించుకోవాలి. మద్యం పూర్తిగా మానేయాలి. అన్నిరకాల పోషకాలు అందేలా... ముఖ్యంగా విటమిన్ బి లాంటివి అందేలా మంచి ఆహార నియమాలు పాటించాలి. రోజూ కొద్దిగా వ్యాయామం చేయాలి. ఇలా ఆరోగ్యకరమైన జీవనశైలి అనుసరిస్తూ ఉంటే కొద్దిపాటి మందులతోనే కాలేయం బాగుపడుతుంది, బాగుంటుంది. సాధారణంగా కాలేయం తాను దెబ్బతిన్న భాగాన్ని తనంతట తానే బాగుచేసుకుంటుంది.

## నేడు జిల్లా కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహణ

**- జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి:డిఆర్ఓ మల్లికార్జునుడు**

**వై ఎస్ ఆర్ కడప,మే 24(భారత శక్తి ):** నేడు జిల్లా కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కు ప్రజలు వినియోగించుకోవాలని డి ఆర్ ఓ మల్లికార్జునుడు ఆదివారం ఒక ప్రకటన లో తెలిపారు.అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా,లేదా తమ ఫిర్యాదులకుసంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి వీవవనిశీయిఎ.ఖజూ.స్త్రశీజ.ఱఅ (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని విజ్ఞప్తి చేశారు. నేడు కలెక్టరేట్ లోని సభా భవన్ నందు ప్రజాసమస్యలపరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని,ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్ లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని,ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లాఅధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం లో తమ వివరాలతో పాటు వారి సమస్యలకుసంబంధించి అర్జీలను అంద జేయాలన్నారు.అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పునుతీసుకురావాలని సూచించారు.సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్ కి మెసేజ్ వస్తుందని,అర్జీదారులు వారి ఫోన్ ను చెక్ చేసుకోవాలన్నారు. నోటీసులు,ఎండార్స్మెంట్ ను వాట్సఅప్ లో పంపిస్తున్నామని, ఎండార్స్మెంట్ బై రిజిస్టర్ పోస్ట్ మీరు ఇస్తున్న అడ్రస్ కు పంపిస్తున్నామన్నారు. అర్జీ ఇచ్చేటప్పుడు దానిని కరెక్ట్ గా పూరించాలన్నారు. రిపీటెడ్ అర్జీదారులు పాత రసీదును తీసుకురావాలన్నారు. జిల్లా ప్రజలుపిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్విని యోగం చేసుకోవాలని కోరారు.“ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (PGRS)” అర్జీల స్వీకరణ కార్య క్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామన్నారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో కూడా సమర్పించుకోవచ్చునన్నారు

**డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం:** డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 9.30 నుండి ఉ.10 గంటల వరకు జరుగుతుందన్నారు.

ప్రజలు 08562-244437 ల్యాండ్ లైన్ నెంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలను విన్నవించుకోవచ్చునన్నారు.ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఆర్వో ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.


## సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి:మాజీ మంత్రి ఎర్రబెల్లి



**జనగామ(భారత శక్తి)మే24:** దేవరుప్పుల మండలకేంద్రంలో ని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి పార్టీ ముఖ్య కార్యకర్తలతో సభ్యత్వ నమోదు కార్యక్రమంపై మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ అధినేత కెసిఆర్ ఆదేశానుసారం రాష్ట్రంలో పార్టీ బలోపేతం దిశగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందని ,గతంలో పాలకుర్తి నియోజకవర్గం సభ్యత్వ నమోదు మొదటి స్థానంలో ఉండగా కెసిఆర్ ప్రశంసలు కూడా అందుకోవడం జరిగిందని,ఇప్పుడు అదే స్థాయిలో భూతు, గ్రామ స్థాయి నుండి పార్టీ బలోపేతం కోసం సభ్యత్వాలు నిర్వహించి మళ్లీ మొదటి స్థానంలో నిలిచే విధంగా కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు. అంతే కాకుండా సభ్యత్వ నమోదు కార్యక్రమంలో అహర్నిశలు పార్టీ కోసం కృషి చేస్తున్న ప్రతి కార్యకర్త సముచిత స్థానం కల్పించి వారికి అండగా ఉంటామని,దేవరుప్పుల మండలంలో బిఆర్ఎస్ పార్టీకి సమన్వయంతో పార్టీ ముందుకు సాగుతునందుకు ఎంతోఆనందంగా ఉందని,పార్టీ ఎలాంటి పని అప్పజెప్పిన సమన్వయంతో కలిసి పని చేసి నియోజవర్గంలోనే అనేక మంది సర్పంచులను గెలిపించడం జరిగిందని అన్నారు.రాబోయే రోజుల్లో బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని,అందుకు తగ్గట్టుగా గ్రామంలో మరింత కష్టపడాలని కార్యకర్తలను ఎర్రబెల్లి కోరారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ జిల్లా నాయకుడు పల్లా సుందర్ రాంరెడ్డి,బిఆర్ఎస్ మండల అధ్యక్షకార్యదర్శులు తీగల దయాకర్ గౌడ్, చింత రవి,కోతి ప్రవీణ్, పాము మోహన్, మహ్మద్ కాశీమ్ బిఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ధరావత్ రాంసింగ్ నాయక్, మాజీ జీసీసీ చైర్మన్ ధరావత్ గాంధీ నాయక్,సుందర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఏల సుందర్,మండల నాయకులు, యువజన నాయకులు, కార్యకర్తలు,గ్రామ ఇంచార్జులు తదితరులు పాల్గొన్నారు.

## జిన్నారం వడ్ల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ఎమ్మెల్సీ డా. సి. అంజిరెడ్డి

- వడ్ల రవాణా నిర్లక్ష్యంపై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్సీ..
- మున్సిపల్ వైస్ చైర్మన్ వంగేటి ప్రతాపరెడ్డి
- తక్షణమే రైతుల సమస్యలు పరిష్కరించాలని అధికారులకు ఆదేశం



**జిన్నారం మున్సిపల్, మే 24 (భారత శక్తి న్యూస్):** సంగారెడ్డి జిల్లా జిన్నారం మున్సిపల్ కేంద్రంలోని వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్సీ డా.సి.అంజిరెడ్డి సందర్శించి రైతుల సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిన్నారం మున్సిపల్ వైస్ చైర్మన్ వంగేటి ప్రతాపరెడ్డి ఆధ్వర్యంలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎమ్మెల్సీ దృష్టికి తీసుకెళ్లారు.రైతులు ఆరు కాలం కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించినప్పటికీ, వడ్లను రవాణా చేసేందుకు సరిపడా వాహనాలు ఏర్పాటు చేయకపోవడంతో రెండు మూడు రోజులుగా వందలాది క్వింటాళ్ల ధాన్యం కేంద్రాల్లోనే నిల్వ ఉండిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో ధాన్యం తడిసిపోయే ప్రమాదం ఉందని రైతులు ఎమ్మెల్సీకి వివరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ డా. సి. అంజిరెడ్డి మాట్లాడుతూ రైతుల సమస్యలపై జిల్లా ఉన్నతాధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా వెంటనే వాహనాల ఏర్పాటు చేసి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సూచించారు.రైతులకు న్యాయం జరగకపోతే రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు, ధర్నాలు చేపడతామని హెచ్చరించారు. రైతుల సంక్షేమమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొంటూ, ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా కొనుగోలు కేంద్రాల్లో సరైన వసతులు కల్పించి రైతులు స్వేచ్ఛగా తమ ధాన్యాన్ని అమ్ముకునేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, బిజెపి నాయకులు వందేటి రాజిరెడ్డి, నరసింహారెడ్డి,పూడూరి సుధాకర్, గొర్ల శ్రీనివాస్ యాదవ్, దుబ్బ శ్రీనివాస్, బిజెపి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి సన్మానోత్సవ సభకు హాజరైన ఎమ్మెల్యే కడియం శ్రీహరి





**జనగామ (భారత శక్తి)మే24:** హన్మకొండ హంటర్ రోడ్డులోని డి కన్వెన్షన్ లో ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి సన్మానోత్సవ సభకు మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి హాజరయ్యారు. ఈ సందర్భంగా వేం నరేందర్ రెడ్డి కి పుష్ప గుచ్ఛం అందజేసి శాలువా తో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ నాకు అత్యంత ఆత్మీయ సోదరుడు వేం నరేందర్ రెడ్డి అని తెలిపారు. నేను రాజకీయాలలో వచ్చిన తర్వాత మొట మొదటగా పరిచయం అయిన కుటుంబం వేం నరేందర్ రెడ్డి కుటుంబం అని అన్నారు. 42ఏళ్లుగా వేం నరేందర్ రెడ్డి నాకు విడదీయలేని అనుబంధం ఉందని తెలిపారు. వరంగల్ ఎంపీగా డాక్టర్ కడియం కావ్య ఎంపిక కావడానికి వేం నరేందర్ రెడ్డి ప్రోత్సాహమే కారణం అని, డాక్టర్ కడియం కావ్య రాజకీయ ప్రస్థానానికి బాటలు వేసిన వేం నరేందర్ రెడ్డి కి వ్యక్తిగతంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.దేశానికే ఆదర్శవంతమైన సంక్షేమ పథకాలను తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. అతి త్వరలోనే రాష్ట్రంలోని కోటి 10లక్షల కుటుంబాలకు ఇందిరా కుటుంబ భీమా పథకం ద్వారా 5లక్షల ఆర్థిక సహాయం అందించనున్నట్లు తెలిపారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం కన్న గొప్ప పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వేం నరేందర్ రెడ్డి సహకారంతో ఉమ్మడి జిల్లా కు వేల కోట్ల నిధులు మంజూరు అవుతున్నాయని ఈ నిధులతో ప్రజలకు మరింత వసతులు, అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. అందువల్ల ఉమ్మడి జిల్లాలోని 12నియోజకవర్గాలలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి బహుమతిగా ఇవ్వాలని అన్నారు. దేశంలో కుల, మత విద్వేషాలతో రాజకీయాలు చేస్తున్నారని, రాజ్యాంగాన్ని అవమాన పరుస్తున్నారని అన్నారు. దేశంలో కుల, మత వివక్షలు లేని సమాజం రావాలంటే రాహుల్ గాంధీ ప్రధాని కావాలని, రాజ్యాంగం పరిరక్షణ జరగాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని స్పష్టం చేశారు. రాబోయే ఎన్నికలలో రాష్ట్రంలో, దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చే విధంగా ప్రతీ ఒక్క కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యుడు పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కొండాసురేఖ, ధనసరి అనసూయ సీతక్క, వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్ రెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డి, కె ఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ, జాటోత్ రామ్ చందర్ నాయక్, ఎమ్మెల్సీ బసవరాజ్ సారయ్య, కార్పొరేషన్ చైర్మన్లు, పిసిసి ప్రతినిధులు, జిల్లా పార్టీ అధ్యక్షులు, ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# నిర్మల్‌కు గర్వకారణం.. స్వప్న మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌కు ‘జీ తెలుగు న్యూస్ హెల్త్‌కేర్ ఎక్సలెన్స్ అవార్డ్--2026





**నిర్మల్ జిల్లా ప్రతినిధి, మే 24(భారత శక్తి)** జీ తెలుగు న్యూస్ ఆధ్వర్యంలో హైదరాబాద్ నగరంలోని రేడిస్సన్ బ్లూ లో వైభవంగా నిర్వహించిన “హెల్త్‌కేర్ ఎక్సలెన్స్ అవార్డ్స్--2026” కార్యక్రమంలో నిర్మల్ పట్టణానికి చెందిన ప్రముఖ వైద్య సంస్థ స్వప్న మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ కు ప్రతిష్టాత్మక అవార్డు దక్కడం జిల్లాకు గర్వకారణంగా నిలిచింది. వైద్య రంగంలో అత్యున్నత సేవలు అందిస్తూ ప్రజల విశ్వాసాన్ని సంపాదించిన ఆసుపత్రి అధినేతలు ప్రముఖ వైద్యులు డా . స్వప్న శశికాంత్ మరియు డా. శశికాంత్ లకు ఈ గౌరవ పురస్కారం అందజేశారు.ఈ అవార్డు కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల ముఖ్య అతిథిగా హాజరై విజేతలను అభినందించారు. అలాగే కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి . కిషన్ రెడ్డి , తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనరసింహ , సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి వడ్లూరి లక్ష్మణ్ గౌరవ అతిథులుగా పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పేరొందిన వైద్య నిపుణులు, ఆసుపత్రుల ప్రతినిధులు, ఆరోగ్య రంగ ప్రముఖులు సమక్షంలో ఈ పురస్కార ప్రదాన కార్యక్రమం అత్యంత ఘనంగా జరిగింది.నిర్మల్ జిల్లా ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడంలో స్వప్న మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ కీలక పాత్ర పోషిస్తోందని నిర్వాహకులు పేర్కొన్నారు. అత్యవసర చికిత్సలు, ఆధునిక నిర్ధారణ పద్ధతులు, అనుభవజ్ఞులైన వైద్య బృందం, రోగులకు అందిస్తున్న నాణ్యమైన సేవలు, వైద్య రంగంలో పాటిస్తున్న ఉన్నత ప్రమాణాల దృష్ట్యా ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ ప్రజల ఆరోగ్య పరిరక్షణలో ఆసుపత్రి విశేష కృషి చేస్తోందని ప్రశంసించారు.ఈ సందర్భంగా మాట్లాడిన డాక్టర్ స్వప్న, డాక్టర్ శశికాంత్ దంపతులు తమ సేవలను గుర్తించి ప్రతిష్టాత్మక అవార్డుతో సత్కరించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. గ్రామీణ మరియు పట్టణ ప్రాంత ప్రజలకు అందుబాటు ధరల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించడమే తమ లక్ష్యమని తెలిపారు. ఈ అవార్డు తమపై మరింత బాధ్యతను పెంచిందని, భవిష్యత్తులో మరిన్ని అత్యాధునిక వైద్య సౌకర్యాలను అందుబాటులోకి తీసుకువచ్చి నిర్మల్ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.జీ తెలుగు న్యూస్ చీఫ్ ఎడిటర్ ఎస్ . భరత్ కుమార్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమం రాష్ట్ర వైద్య రంగానికి ప్రేరణగా నిలిచిందని పలువురు అభిప్రాయపడ్డారు. వైద్య సేవలను వ్యాపార దృక్పథంతో కాకుండా సేవా భావంతో అందిస్తున్న ఆసుపత్రులను గుర్తించి ప్రోత్సహించడం అభినందనీయమని అన్నారు.స్వప్న మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌కు ఈ ప్రతిష్టాత్మక అవార్డు రావడంతో నిర్మల్ జిల్లా వైద్య వర్గాలు, ప్రజాప్రతినిధులు, సామాజిక సంస్థలు, వివిధ రంగాల ప్రముఖులు హర్షం వ్యక్తం చేస్తూ డాక్టర్ స్వప్న శశికాంత్ దంపతులకు అభినందనలు తెలిపారు. జిల్లాలో వైద్య రంగానికి ఇది మరో గౌరవంగా నిలిచిందని పేర్కొన్నారు.

## అపొస్తలిక్ డయాసిస్ ఆఫ్ సీలాన్ (ఏ. డి. సి )

### శ్రీలంక లో రెవరెండ్ ఆర్డినేషన్ పొందిన దుర్గం కరుణ శ్రీ (హెప్సిబా)

- మే 24 నేడు ప్రపంచ పెంతెకోస్తు దినోత్సవం
- బేతెస్థ మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు- బిషప్ డాక్టర్ దుర్గం ప్రభాకర్



**సూర్యాపేట(భారత శక్తి ప్రతినిధి) మే 24:** సూర్యాపేట పట్టణ కేంద్రం ఖాసీంపేట బేతెస్థ ప్రార్థన మందిరంలో రెవ. దుర్గం కరుణ శ్రీ ( హెప్సిబా ) కి ఇటీవల కాలంలో ఇంటర్ నేషనల్ ఇండిపెండెంట్ అపొస్తలిక్ డయాసిస్ ఆఫ్ సీనాడ్ (ఐ. ఐ ఏ. డి. సి ) తేది : 17 మే 2026 న ఏ. డి. సీ డయాసిస్ - శ్రీలంక, కోలోంబో లో ఆర్డినేషన్ పొంది స్వదేశగమానం చేరిన సందర్భంగా సంఘ సభ్యులు ఈరోజు బిషప్ దుర్గం ప్రభాకర్ - హెప్సిబా ను ఘనంగా సన్మానించడం జరిగింది. రెవ. దుర్గం కరుణ శ్రీ (హెప్సిబా) మాట్లాడుతూ నాకు ఎంతో సంతోషం గా ఉందని యేసుక్రీస్తు దయవలన సంఘం పట్ల, సేవా పట్ల మరింత బాధ్యత పెరిగిందని అన్నారు. ఈ సందర్భంగా బిషప్ దుర్గం ప్రభాకర్ మాట్లాడుతూ నేడు ప్రపంచ పెంతెకోస్తు దినోత్సవం (ప్రపంచ ఇంతే కోస్తూ దినోత్సవ ఆదివారం)మే 24, ఆదివారం నాడు.ఈస్టర్ పండుగ తర్వాత 50వ రోజున క్రైస్తవులు ఈ పండుగను ఘనంగా జరుపుకుంటారనీ దీనిని పెంతెకోస్తు పండుగ, పరిశుద్ధాత్మ దినోత్సవం, లేదా సహవాస ఆదివారం అని కూడ పిలుస్తారని యేసుక్రీస్తు పునరుత్థానం చెందిన 50 రోజుల తర్వాత, శిష్యులపై పరిశుద్ధాత్మ దేవుడు దిగివచ్చిన దినాన్ని క్రైస్తవులు స్మరించుకుంటారనీ అపోస్తలుల కార్యములు 2:1-4 లో పెంతెకొస్తను పండుగదినము వచ్చినప్పుడు అందరు ఒకచోట కూడియుండిరి.అప్పుడు వేగముగా వీచు బలమైన గాలివంటి యొకధ్వని ఆకాశమునుండి అకస్మాత్తుగా, వారు కూర్చుండియున్న యిల్లంతయు నిండెను. మరియు అగ్నిజ్వాలలవంటి నాలుకలు విభాగింపబడినట్టుగా వారికి కనబడి, వారిలో ఒక్కొక్కని మీద వ్రాలగ అందరు పరిశుద్ధాత్మతో నిండినవారై ఆ ఆత్మ వారికి వాక్‌శక్తి అనుగ్రహించినకొలది అన్యభాషలతో మాటలాడసాగిరి.ఈ సంఘటన ద్వారా నే క్రైస్తవ సంఘం యొక్క పుట్టినరోజుగా పరిగణిస్తారనీ పెంతెకోస్తు’ అనగా గ్రీకు భాషలో ‘యాభై’ (50) అని అర్థం అన్నారు ఈ కార్యక్రమం లో బాబు, ఉపేందర్, వెంకన్న, కాల్వపల్లి సర్పంచ్ సంద్రపంగు వెంకన్న, నాగేశ్వరావు, యడవెల్లి బిక్షం, అబ్రాహాము, దావీదు, సురేష్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

## మధు హత్యతో కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి సంబంధం లేదు

### డిసిసి అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్య

-విచారణ ప్రభావితం చేసేందుకే మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి నిరాధారమైన ఆరోపణలు.




**సూర్యపేట, భారత శక్తి జిల్లా ప్రతినిధి,మే 24:**ఁటిఆర్ఎస్ నాయకుడు చింతలపాటి మధు హత్యతో కాంగ్రెస్ కి ఎలాంటి సంబంధం లేదని విచారణను ప్రభావితం చేసేందుకే మాజీమంత్రి జగదీష్ రెడ్డి కాంగ్రెస్ పార్టీపై నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని డిసిసి అధ్యక్షులు గుడిపాటి నరసయ్య అన్నారు.ఆదివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి జగదీష్ రెడ్డి వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. హత్య రాజకీయాల గురించి మాజీ మంత్రి జగదీష్ రెడ్డి మాట్లాడడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు గాను హాస్యాస్పదంగా ఉందన్నారు. మధు హత్య పాత కక్షలతో జరిగిందా వ్యక్తిగత కక్షలతో జరిగిందా అనేది పోలీసుల విచారణలో తేలుతుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి విచారణ అధికారిగా విచారణను ప్రభావితం చేయడం తగదన్నారు. హత్య రాజకీయాలను ఏనాడు కాంగ్రెస్ పార్టీ ప్రోత్సహించలేదని మూడుసార్లు ఓడిపోయినప్పటికీ మాజీ మంత్రి దివంగత రాంరెడ్డి దామోదర్ రెడ్డి, రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి ల ఆధ్వర్యంలో ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవిస్తున్నారని అన్నారు. మాజీమంత్రి తప్పుడు ఆరోపణలను ప్రజలు తీవ్రంగా ఖండించాలన్నారు. ఆ హత్యతో మా పార్టకి ఎలాంటి సంబంధం లేదని త్వరలోనే నిజాలు తేలుతాయి అన్నారు. మా పార్టీపై మాజీ మంత్రి జగదీష్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.మరోసారి కాంగ్రెస్ పార్టీ నాయకులపై పార్టీపై లేనిపోని నిరాధారణమైన ఆరోపణలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంజాద్ అలి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ రహీం, పిసిసి ఎస్సి సెల్ వైస్ చైర్మన్, మాజీ జెడ్పిటిసి చింతమళ్ల రమేష్, జిల్లా కాంగ్రెస్ కోశాధికారి కక్కిరెని శ్రీనివాస్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు దొంగరి గోవర్ధన్, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఏలిమినేటి అభినయ్ నాయుడు, మున్సిపల్ కౌన్సిలర్ నాగుల వాసు, శ్రీ దండు మైసమ్మ దేవస్థానం చైర్మన్ తంగేళ్ల కరుణాకర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు వెన్న మధుకర్ రెడ్డి, మద్దెబోయిన శ్రీనివాస్, గడ్డం వెంకన్న, పడిదల రవి, అక్కేనపల్లి జానయ్య, అన్న

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy